# నేటినిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ గురువారం 1-8-2019 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :25 సంచిక: 268 పేజీలు 8 వెల: రూ.1/-


## ఇంజనీరింగ్ విద్యార్థుల ర్యాష్ డ్రైవింగ్

### స్కూటీపై వెళుతున్నమహిళను ఢీకొట్టడంతో మృతి

హైదరాబాద్,జూలై31(ఆర్ఎన్ఎ): ఇంజనీరింగ్ విద్యార్థులు మద్యం మత్తులో కారు నడిపి ఓ మహిళ మృతికి కారణమయ్యారు. ఈ దుర్ఘటన మేడ్చల్ లో జరిగింది. కొంపల్లి జాతీయ రహదారిపై స్కూటీ మీద వెళ్తున్న మహిళను ర్యాష్ డ్రైవ్ చేస్తూ ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో మహిళ తీవ్రంగా గాయపడ్డది. ఆమెను సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆమె చనిపోయింది. మృతురాలు దూలపల్లికి చెందిన శ్రీదేవిగా గుర్తించారు. ఇద్దరు ఇంజనీరింగ్ యువకులు అల్వాల్‌లోని కార్ కేర్ లో కారుని రెంటుకు తీసుకొని చార్మినార్‌కు బయల్దేరారు. కారును వేగంగా నడుపుతూ.. ఎదురుగా వచ్చిన వాహనాన్ని తప్పించబోయి యాక్సిడెంట్ చేశారు. కారు రెంట్‌కు ఇచ్చిన కార్ కేర్ యజమాని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కారు నడిపిన విద్యార్థికి డ్రైవింగ్ లైసెన్స్ లేదని పోలీసులు నిర్ధారించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేని వ్యక్తికి కారును అద్దెకు ఇచ్చిన కార్ కేర్ ఓనర్‌పై కేసు నమోదు చేసి, కారు సీజ్ చేశారు.

# ఆఫ్ఘాన్‌లో బాంబు పేలుడు..

## 34 మంది మృతి

### పదుల సంఖ్యలో గాయాలు

కాబూల్, జులై31(ఆర్ఎన్ఎ) : ఆఫ్ఘాన్ బాంబు పేలుళ్లతో మరోసారి దద్దరిల్లింది. పశ్చిమ ఫర్హా ప్రావిన్స్‌లో కాందహార్-హెరాత్ జాతీయ రహదారిపై బుధవారం ఉదయం బాంబు పేలుడు సంభవించింది. ఈ ఘటనలో 34 మంది మృతి చెందారు. పదుల సంఖ్యలో గాయపడ్డారు. భద్రతా దళాలు, పోలీసులే లక్ష్యంగా చేసిన ఈ దాడిలో సాధారణ పౌరులు ప్రయాణిస్తున్న ఓ బస్సు ప్రమాదానికి గురైంది. మృతుల్లో మహిళలు, చిన్నారులు ఉన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే ఘటనా స్థలికి చేరుకొని సహాయక చర్యలు ప్రారంభించారు. క్షతగాత్రుల్ని స్థానిక ఆసుపత్రికి తరలించి చికిత్స అందజేస్తున్నారు. దాడి తీవ్రత భారీ స్థాయిలో ఉండడంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ దాడికి ఇప్పటి వరకు ఏ ఉగ్రసంస్థ బాధ్యత వహించలేదు. అఫ్ఘనిస్థాన్‌లో భద్రతా బలగాలు, పోలీసులు లక్ష్యంగా చేసుకొని తాలిబన్ ముఠాలు తరచూ చేస్తున్న దాడుల్లో అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోవడం పరిపాటిగా మారింది.




అఫ్గాన్‌లోని హరాత్ కాందహార్ జాతీయరహదారిపై తాలిబన్లు పేల్చిన బాంబు ఘటనతో చెల్లాచెదురైన వాహనాలు
పేల్చిన బాంబు ఘటనలో క్షతగాత్రులను తరలిస్తున్న దృశ్యం

### మధ్యాహ్న భోజన పథకానికి..

# ఈ-పాస్ విధానం ద్వారా సన్నబియ్యం

- ప్రతీ నెల 12వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సరఫరా చేస్తున్నాం
- వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి

హైదరాబాద్, జులై31(ఆంఎన్ఎ): అక్రమాలను అరికట్టేందుకు, మరింత పారదర్శకంగా ఉండేలా ఈ-పాస్ ద్వారా మధ్యాహ్న భోజన పథకానికి సన్న బియ్యం సరఫరా చేస్తామని మంత్రి నిరంజన్‌రెడ్డి తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.. ఆగస్టు 1 నుంచి 28,623 ప్రభుత్వ పాఠశాలలకు ఈ-పాస్ ద్వారా సెప్టెంబర్ కోటా సరఫరా చేస్తామని మంత్రి తెలిపారు. ప్రతి నెల 12వేల మెట్రిక్ టన్నుల సన్నబియ్యం సరఫరా చేస్తున్నామని వివరించారు. బియ్యం సరఫరాలో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా ఉండేందుకు ఈ-పాస్ విధానం అమలు చేస్తున్నామన్నారు. ఇప్పటికే అంగన్‌వాడీ కేంద్రాలు, సంక్షేమ హాస్టళ్లకు ఈ-పాస్ విధానం ద్వారానే బియ్యం సరఫరా జరుగుతోందన్నారు. ఇక నుంచి ఈ-పాస్ ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకానికి సన్న బియ్యాన్ని ప్రభుత్వం సరఫరా చేయబోతోందని మంత్రి వివరించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అనంతరం అధికారంలోకి వచ్చిన తెరాస ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు సన్న బియ్యం ద్వారా భోజనాన్ని అందిస్తుందని తెలిపారు. ఉమ్మడి ఏపీలో మధ్యాహ్న భోజన పథకంలో దొడ్డు బియ్యం పెట్టడం ద్వారా విద్యార్థులు వాటిని తినేందుకు ఇబ్బందులు పడేవారని, దీనిని గుర్తించిన కేసీఆర్ సన్నబియ్యం ద్వారా మధ్యాహ్న భోజనం అందిస్తున్నారని అన్నారు.



# కేంద్రమంత్రి గడ్కరీని కలిసిన మంత్రి జగదీష్‌రెడ్డి

ఢిల్లీ,జులై 31 : కేంద్ర రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీని తెలంగాణ మంత్రి జగదీష్‌రెడ్డి కలిసి తెలంగాణలో జాతీయ రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎన్‌హెచ్-65 హైదరాబాద్- విజయవాడ రహదారిపై సర్వీస్ రోడ్స్, అండర్‌పాస్ బ్రిడ్జిలను నిర్మించి ప్రజల ఇబ్బందులను తీర్చాలని కోరినట్లు ఈ సందర్భంగా జగదీష్‌రెడ్డి తెలిపారు. ఎన్‌హెచ్-365 సూర్యాపేట-జనగామ రహదారిపై నాగారం, తిరుమలగిరి గ్రామాల మధ్య డ్రైన్స్‌తో పాటు ఫ్లైఓవర్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశామన్నారు. సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణలో అనేక పథకాలు అమలవుతున్నాయని చెప్పారు.

రహదారుల అభివృద్ధికి కేంద్రం వెంటనే నిధులు మంజూరు చేయాలని కోరినట్లు జగదీష్‌రెడ్డి వివరించారు. మంత్రి వెంట ఎంపీలు బడుగుల లింగయ్య యాదవ్, రంజిత్‌రెడ్డి ఉన్నారు.

# తెలంగాణలో కమల వికాసం ఖాయం

- 50శాతం ఓట్లు సాధించడమే తమ లక్ష్యం
- కారు టీఆర్ఎస్‌ది.. డ్రైవర్ అసదుద్దీన్
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్

హైదరాబాద్, జులై31(ఆంఎన్ఎ) : రాష్ట్రంలో టీఆర్ఎస్ కుటుంబ, అవినీతి పాలనపై పోరాడుతామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ అన్నారు. బుధవారం హైదరాబాద్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముమ్మారు తలాక్ బిల్లు చట్టరూపం దాల్చడం సంతోషకరమన్నారు. ఈ చట్టం అమలు భారతీయ ముస్లిం మహిళల విజయమని లక్ష్మణ్ పేర్కొన్నారు. ట్రిపుల్ తలాక్ చట్టంతో ముస్లిం మహిళలకు న్యాయం జరుగుతుందని చెప్పుకొచ్చారు. ముస్లిం మహిళల కోసం తీసుకొచ్చిన బిల్లును మజ్లిస్ ఎందుకు వ్యతిరేకిస్తుందని ప్రశ్నించారు. బీజేపీపై టీఆర్ఎస్ నేతలు రెచ్చిపోయి మాట్లాడుతున్నారని, బీజేపీ చేతిలో టీఆర్ఎస్ చచ్చుపడటం ఖాయం అని వ్యాఖ్యానించారు. తెరాస వైఫల్యాలపై పోరాటం చేస్తామని అన్నారు. బీజేపీని ఎదుర్కొనేందుకు టీఆర్ఎస్-కాంగ్రెస్ కలిసి పనిచేస్తున్నాయన్నారు. కారు టీఆర్ఎస్‌ది.. డ్రైవర్ అసదుద్దీన్ అని విమర్శించారు. 2023 ఎన్నికల్లో తెలంగాణలో కమల వికాసం ఖాయం అని లక్ష్మణ్ ధీమా వ్యక్తం చేశారు. అధ్యక్షుడి నుండి కార్యకర్త వరకు విస్తారక్ యోజన చేపట్టబోతున్నట్లు తెలిపారు. భాజపా విస్తారక్ యోజనలో ఏడు వేల మంది సభ్యులు పాల్గొంటారని లక్ష్మణ్ తెలిపారు. తెలంగాణలో యాభైశాతం ఓట్లు సాధించడమే తమ లక్ష్యమని, ఆమేరకు పనిచేస్తామని అన్నారు.

## చరిత్రలో నేటినిజం



కం॥ భా త్రీ కి - "అమృతము కురిసిన
రా త్రి"ని - జూపించి నట్టి రసవద్భావాల
చా త్రుని - నూతన కవితా
గా త్రుని పూజింతు "బాల గంగాధరు"తిలక్!!

( ఆగష్టు 1 దేవరకొండ బాల గంగాధర్‌తిలక్ జననం) -రాధశ్రీ

సెల్: 9494481210

## నగరానికి భారీ వర్షసూచన..

హైదరాబాద్, జులై 31: హైదరాబాద్ నగరంలో ప్రధానంగా కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి పరిధిలో రానున్న గంటల్లో భారీ వర్షం పడే అవకాశం ఉన్నట్లు జీహెచ్‌ఎంపీ కమిషనర్ దానకిశోర్ తెలిపారు. భారీ వర్ష సూచన నేపథ్యంలో అత్యవసర సహాయక బృందాలను కమిషనర్ అప్రమత్తం చేశారు. భారీ వర్షం దృష్ట్యా జీహెచ్‌ఎంసీ అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రస్తుతం హైదరాబాద్ లోని పలు ప్రాంతాల్లో మోస్తరు వర్షం పడింది. సికింద్రాబాద్, వారసిగూడ, బౌద్ధనగర్, కుత్బుల్లాపూర్,, జీడిమెట్ల, షాపూర్, సూరారం, చింతల్, సుచిత్రలో వర్షం కురుస్తోంది.

# కేఫ్ కాఫీడే అధినేత సిద్దార్థ ఆత్మహత్య



- నేత్రావతి నదిలో మృతదేహం లభ్యం
- పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు మృతదేహం అప్పగింత
- నివాళులర్పించిన ప్రముఖులు

బెంగళూరు, జులై31(ఆర్ఎన్ఎ) : కేఫ్ కాఫీడే సీఎండీ వి.జి సిద్దార్థ కథ విషాదాంతమైంది. రెండు రోజుల క్రితం అదృశ్యమైన ఆయన మృతదేహం నేత్రావతి నదిలో బుధవారం ఉదయం లభ్యమైంది. మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం వెన్‌లాక్ ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించారు. బుధవారం మధ్యాహ్నం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేఫ్ కాఫీడే అధినేత, కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి అల్లుడు వీజీ సిద్దార్థ సోమవారం సాయంత్రం నుంచి కనిపించకుండాపోయారు. జులై 29 సాయంత్రం బెంగళూరు నుంచి వచ్చిన సిద్దార్థ, వ్యాపార పనులమీద కేరళకు వెళ్తున్నాని కుటుంబసభ్యులతో చెప్పి బయలుదేరారు. రాత్రి 8గంటల ప్రాంతంలో నేత్రావతి నదిపై ఉన్న ఉల్లాల్ వంతెనవైపు వెళ్లాలని డ్రైవర్‌కు సూచించారు. అనంతరం అక్కడకు చేరుకున్న తర్వాత వంతెనపై కారు నిలపమని కోరిన సిద్దార్థ, వాహనం దిగి నడుస్తూ కొద్దిసేపు ఫోన్‌లో మాట్లాడారు. తర్వాత ఆయన కనిపించకపోవడంతో డ్రైవర్ ఆందోళన చెంది కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. అనంతరం పోలీసులకు సమాచారం అందించాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు, డ్రైవర్ సమాచారంతో పోలీసులు రంగంలోకి దిగారు. మంగళవారం ఉదయం నుంచి మూడు పోలీసు బృందాలు ఓవైపు, ఎనిమిది పడవల సాయంతో గజ ఈతగాళ్లు, తీర ప్రాంత గస్తీదళం, ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు మరోవైపు నేత్రావతి నదిని జల్లెడపట్టాయి. నదిలో ఎనిమిదో స్తంభం వద్ద ఓ వ్యక్తి నీటిలో దూకడం చూశానని స్థానిక జాలరి ఒకరు వెల్లడించినట్లు మాజీ మంత్రి యు.టి.ఖాదర్ తెలిపారు. ఆ సమయంలో ఒంటరిగా ఉన్నందున రక్షించే సాహసం చేయలేకపోయినట్లు ఆ జాలరి తెలిపారు. ఇదిలా ఉంటే సిద్దార్థ మృతదేహం కుళ్లిపోయిందని పోలీసులు వివరించారు. పోస్ట్‌మార్టం కోసం వెన్‌లాక్ ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు అందించారు. వ్యాపార లావాదేవీల్లో తీవ్ర ఇబ్బందుల్లో ఇరుక్కుపోయానని, ఇన్వెస్టర్లు, ఆదాయపు పన్ను అధికారులు ఒత్తిడి భరించలేకపోతున్నాని ఓ లేఖ రాసిపెట్టి సిద్దార్థ తన ఇంటి నుంచి వెళ్లిపోయారు. ఎన్నో ఆశలతో కాఫీడే సామ్రాజ్యాన్ని స్థాపించినా, అనుకున్న విజయాన్ని సాధించలేకపోయానని ఆయన రాసినట్లుగా చెబుతున్న లేఖ సామాజిక మాధ్యమాల్లో ప్రచారం జరుగుతోంది. తన సంస్థల్లో సుమారు 30 వేల మందికి ఉపాధి కల్పించానని, ఆర్థిక నష్టాలు తీవ్రంగా కదిలించాయని ఆ లేఖలో పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఆదాయపు పన్ను విభాగం ఉన్నతాధికారి వేధింపులతో విసిగిపోయానని ఆ లేఖలో పేర్కొన్నట్లు ప్రచారం జరుగుతోంది. కర్ణాటక మాజీ సీఎం ఎస్.ఎం కృష్ణ కుమార్తె మాళవిక కృష్ణను సిద్దార్థ వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు. మాళవిక.. సిద్దార్థ కంపెనీ వ్యవహారాల్లో చురుగ్గా ఉంటారు. 2008 నుంచి సిద్దార్థకు చెందిన హాస్పిటాలిటీ బిజినెస్ పూర్తి బాధ్యతలు ఈమే నిర్వర్తిస్తున్నారు. కాఫీడే బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్‌లోనూ ఆమె ఒక సభ్యురాలు. ఇలా కెరీర్ హాయిగా సాగిపోతున్న సమయంలో సిద్దార్థ పన్ను ఎగవేత రూపంలో వివాదాల్లో చిక్కుకున్నారు. కోట్ల రూపాయల పన్ను ఎగవేసినట్లు ఆరోపణలు రావడంతో 2017లో ఆయన కంపెనీలపై ఆదాయపు పన్ను శాఖ సోదాలు చేపట్టింది. ముంబయి, బెంగళూరు, చెన్నై, చిక్‌మగుళూరులోని కాఫీ డే దుకాణాలు, ఎస్టేట్‌లపై అధికారులు దాడులు నిర్వహించారు. రూ. 650కోట్ల విలువైన అక్రమాస్తులను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. దీంతో ఆయనకు ఆర్థిక ఇబ్బందులు మొదలయ్యాయి. మరోవైపు కేఫ్ కాఫీ డే గత కొంతకాలంగా నష్టాల్లో సాగుతున్నట్లు తెలుస్తోంది. దీంతో కంపెనీలో కొంత వాటాను కోకాకోలాకు విక్రయించాలని సిద్దార్థ అనుకున్నారు. ఇందుకోసం చర్చలు కూడా జరిగాయి.

### ప్రముఖుల సంతాపం.....

ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన కేఫ్ కాఫీ డే వ్యవస్థాపకుడు, కర్ణాటక మాజీ సీఎం ఎస్.ఎం. కృష్ణ అల్లుడు వి.జి. సిద్దార్థ ఆకస్మిక మరణం పట్ల పలువురు రాజకీయ, వ్యాపార ప్రముఖులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

- సిద్దార్థ మృతిపట్ల కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత సిద్ధరామయ్య దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తన వ్యాపార చతురతతో కర్ణాటక, ఈ దేశానికి ఎంతో సేవచేశారు. ఆ సేవలు చిరస్మరణీయం. నేటి తరానికి ఓ ఉదాహరణ. ఎస్.ఎం కృష్ణ కుటుంబసభ్యులు, సిద్దార్థ శ్రేయోభిలాషులకు నా ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నా అన్నారు.

- మహింద్రా అండ్ మహింద్రా ఛైర్మన్ ఆనంద్ మహింద్రా సిద్దార్థ మృతిపట్ల కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. నాకు ఆయన(సిద్దార్థ) గురించి గానీ, ఆయన ఆర్థిక పరిస్థితుల గురించి గానీ తెలియదు. నాకు తెలిసింది ఒక్కటే.. వ్యాపారవేత్తలు వ్యాపార వైఫల్యాల వల్ల జీవితాలను, ఆత్మగౌరవాన్ని పోగొట్టుకోకూడదు. అది ఒక వ్యవస్థ మరణానికి కారణమవుతుందన్నారు.

- కాంగ్రెస్ సీనియర్ నేత సంజయ్ నిరుపమ్ సిద్దార్థ మృతిపట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా 1700 కాఫీడే అవుట్‌లెట్స్‌కు యజమాని అయిన సిద్దార్థ మృతదేహం ఓ నదిలో లభించింది. ఆయన మృతికి ఎవరు కారణం..? మోదీ ప్రభుత్వమా? ఐటీ అధికారులా? లేదా ప్రైవేటు ఈక్విటీ భాగస్వాములా? దీనిపై లోతుగా దర్యాప్తు చేపట్టాలి. అందరు వ్యాపారవేత్తలు దొంగలు కాదన్నారు.

- సిద్దార్థ మృతిపట్ల వ్యాపారవేత్త కిరణ్ మజుందార్ షా దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సిద్దార్థం భార్య మాళవిక, కుమారులు, మాజీ సీఎం ఎస్.ఎం. కృష్ణ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ట్వీట్ చేశారు.

- వి.జి. సిద్దార్థ ఆకస్మిక మరణం విచారకరమని తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. సిద్దార్థ మరణం ఎంతో దిగ్భ్రాంతికి గురిచేసిందన్నారు. కొన్నేళ్ల క్రితం ఆయనను కలిసే అవకాశం వచ్చిందని, ఆయనో జెంటిల్‌మెన్ అని కేటీఆర్ పేర్కొన్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా. ఈ క్లిష్ట పరిస్థితుల్లో కేఫ్ కాఫీ డే మరింత బలంగా ఉండాలని కోరారు.

- సిద్దార్థ ఆత్మహత్యపై లిక్కర్ కింగ్ విజయ్ మాల్యా విచారం వ్యక్తం చేశారు. వీజీ సిద్దార్థది, తనది దాదాపుగా ఒకే విషయమని, అతను ఒక గొప్ప వ్యాపారవేత్త అని మాల్యా బుధవారం ట్వీట్ చేశాడు. అతను రాసిన లెటర్ తనను కలవరానికి గురిచేసిందన్నాడు. ఆయన రాసిన లేఖలోని విషయాలతో తాను వినాశనానికి గురయ్యానని. ప్రభుత్వ ఏజెన్సీలు మరియు బ్యాంకులు ఎవరినైనా నిరాశకు గురిచేస్తాయన్నారు. తాను తీసుకున్న రుణం మొత్తాన్ని చెల్లిస్తానని చెప్పినా బ్యాంకులు, ప్రభుత్వ రంగ సంస్థలు తన పట్ల క్రూరంగా, దుర్మారంగా ప్రవర్తిస్తున్నాయని మాల్యా అన్నాడు. పాశ్చాత్య దేశాల్లో ప్రభుత్వాలు, బ్యాంకులు రుణగ్రహీతలకు రుణాలను తీర్చేందుకు సహాయం చేస్తాయని, కానీ తన విషయంలో మాత్రం అందుకు విరుద్ధంగా జరుగుతుందన్నాడు. కాగా మైండ్‌ట్రీ లిమిటెడ్ కంపెనీతో తాను జరిపిన లావాదేవీల్లో అవకతవకలున్నాయని చెప్పి ఐటీ, ఈడీలు వేధించాయని సిద్దార్థ రాసినట్లుగా ఉన్న ఓ లేఖ కూడా ఇప్పటికే పోలీసులకు లభ్యమైన విషయం తెలిసిందే.

### అంచెలంచెలుగా ఎదుగుతూ..

కర్ణాటకలోని చికమగుళూరు జిల్లాలోని ఓ కాఫీ సాగు కుటుంబంలో పుట్టారు సిద్దార్థ. ఈ కుటుంబం గత 140 ఏళ్లుగా కాఫీ పంటలు పండిస్తోంది. కష్టాలనేవి తెలీకుండా పెరిగాడు. అయితే లోక జ్ఞానం తెలుసుకునేందుకు బోర్డింగ్ స్కూల్‌లో చేర్పించారు తల్లిదండ్రులు. చిన్నప్పుడు ఆటల మీదున్న శ్రద్ధ చదువు మీద ఉండేది కాదు. ఎనిమిదో తరగతిలో అత్తెసరు మార్కులొచ్చాయి. అతడి ప్రవర్తనను భరించలేని టీచర్ 'ఒరే, నీకు అర్థమయ్యేలా పాఠాలు చెప్పలేకపోతున్నానన్న సందేహం కలుగుతోంది. చదువుపై కాస్త శ్రద్ధ పెడితే నీ భవిష్యత్తుకే మంచిది' అంటూ కంటతడి పెట్టింది. టీచర్ కన్నీళ్లు చూశాక సిద్దార్థ కళ్లు తెరిచాడు. దేశాన్ని కంటికి రెప్పలా కాపాడే సైనికులంటే సిద్దార్థకు గౌరవం. గ్రాడ్యుయేషన్ పూర్తి చేశాక సైన్యంలోకి వెళదామని డిఫెన్స్ అకాడమీ పరీక్ష రాశారు. ఉత్తీర్ణుడు కాలేదు. చేసేది లేక మంగళూరుకు వెళ్లి అర్థశాస్త్రంలో పోస్టు గ్రాడ్యుయేషన్ చేశారు. ఒక రోజు 'నేను స్టాక్ మార్కెట్‌పై శిక్షణ కోసం బొంబాయి వెళ్లాలనుకుంటున్నా' అని తల్లిదండ్రులకు తెలిపారు. దీంతో కాఫీ తోటలు చూసుకుంటాడనుకున్న కొడుకు ఇలా మాట్లాడటం ఆశ్చర్యం కలిగించింది. ఎంత చెప్పినా వినలేదు. ఆఖరికి తండ్రి సిద్దార్థ చేతిలో కొంత డబ్బు పెట్టి సాగనంపారు. చికమగళూర్ నుంచి బొంబాయి చేరుకున్న సిద్దార్థ.. ఒక ఆఫీసుకి వెళ్లి రిసెప్షనిస్టుతో 'నేను కర్ణాటక నుంచి వచ్చాను.

మహేష్ కంపానీని కలవాలి' అనడిగాడు. 'ఆయన్ని కలవడానికి కొన్ని రోజుల నుంచి ఎదురుచూసేవాళ్లు చాలామందే ఉన్నారు. నువ్విప్పుడొచ్చి కలుస్తానంటే కుదరదని రిసెప్షనిస్టు తెలిపింది. పదే పదే బతిమాలితే ఆయన గదిలోకి వెళ్లేందుకు అనుమతి ఇచ్చింది. 'సార్, మీ గురించి చాలా చదివాను.. విన్నాను. నేను ఎకనామిక్స్ పట్టభద్రుణ్ణి. చేస్తే గీస్తే మీ దగ్గరే శిష్యరికం చేయాలి. లేదంటే మా ఊరెళ్లి, నాకిష్టం లేకపోయినా కాఫీ తోటలు సాగు చేయక తప్పదు. ఒక్క అవకాశం ఇవ్వండంటూ వినయంగా వేడుకున్నారు. సిద్దార్థ అంకితభావాన్ని చూసి చిరునవ్వుతో ఓకే అన్నారు మహేష్ కంపాని. బొంబాయి స్టాక్ ఎక్స్చేంజ్‌కి ప్రెసిడెంట్, జేఎం క్యాపిటల్ అధినేత అయిన ఆయన దగ్గర ఎంతైనా నేర్చుకోవచ్చన్నది సిద్ధూ ఆలోచన. స్టాక్‌మార్కెట్‌లో పాఠాలు, ట్రేడింగ్ మెలకువలు ఆపోసన పట్టాడు. స్టాక్ మార్కెట్ గురించి కొంత అవగాహన వచ్చాక సిద్దార్థ తిరిగి సొంతూరు చేరుకున్నారు. తాను బెంగళూరులో స్టాక్ బ్రోకర్ బిజినెస్ చేద్దామనుకుంటున్నానని, డబ్బు కావాలని తల్లిదండ్రులను అడిగారు. తల్లిదండ్రులు చేసేది లేక ఏడున్నర లక్షలు చేతికిచ్చి ఒకవేళ వ్యాపారంలో నష్టపోతే, తిరిగొచ్చి కాఫీ తోటలు చూసుకో అని చెప్పి పంపించారు. ఆ డబ్బుతో శివన్ సెక్యూరిటీస్ అనే స్టాక్ బ్రోకింగ్ కంపెనీని ప్రారంభించారు. బొంబాయిలో సంపాదించిన పరిజ్ఞానం ఇక్కడ పనికొచ్చింది. వచ్చిన లాభాలతో చికమగళూరులో కాఫీ తోటలు కొనేవారు. కొన్నాళ్లకు శివన్ సెక్యూరిటీస్ 'వే 2 వెల్త్'గా మారింది. తొలుత కాఫీ ఎగుమతి నుంచి.. 1984లో శివన్ సెక్యూరిటీస్ అనే సంస్థను కొనుగోలు చేసిన సిద్దార్థ.. అనతి కాలంలోనే దాన్ని విజయవంతమైన పెట్టుబడి బ్యాంకింగ్‌గా తీర్చిదిద్దారు. అయితే సిద్దార్థ కుటుంబానికి 12వేల ఎకరాలకు పైగా కాఫీ తోటలు ఉన్నాయి. ఆ కాఫీ గింజలను ఎవరికో అమ్మే బదులు తానే రిటైల్ మార్కెట్లోకి ఎందుకు రాకూడదని అనుకున్నారు. ఆ ఆలోచన నుంచి పుట్టిందే అమాల్గమేటెడ్ బీన్ కాఫీ ట్రేడింగ్ కంపెనీ. 1992లో ప్రారంభించిన ఈ సంస్థ.. కాఫీ గింజలను విదేశాలకు ఎగుమతి చేస్తుంది. రెండేళ్లలోనే దేశంలోనే అతిపెద్ద కాఫీ ఎగుమతిదారుగా ఈ కంపెనీ ఎదిగింది.

### 1996లో కాఫీ డే మొదలు..

1996లో బెంగళూరులోని అత్యంత రద్దీ అయిన బ్రిగేడ్ రోడ్‌లో 'కేఫ్ కాఫీ డే' పేరుతో తొలి రిటైల్ అవుట్‌లెట్‌ను సిద్దార్థ ప్రారంభించారు. అప్పట్లోనే ఇక్కడ ఒక కాఫీ, గంట ఇంటర్నెట్‌కు రూ.100 ఛార్జ్ చేసేవారు. ఈ అవుట్‌లెట్ విశేషాదరణ పొందింది. దీంతో ఇతర ప్రాంతాలకూ దీన్ని విస్తరించారు. దేశంలోనే అతిపెద్ద కాఫీ చైన్.. ప్రస్తుతం భారత్‌లో కేఫ్ కాఫీ డే పేరు తెలియని వారుండరంటే అతిశయోక్తి కాదు.

అన్ని ప్రధాన నగరాల్లో ఈ కంపెనీ అవుట్‌లెట్లు ఉన్నాయి. దేశవ్యాప్తంగా 1700 కెఫేలు, 48,000 వెండింగ్ మిషన్లు ఉన్నాయి. వియన్నా, చెక్ రిపబ్లిక్, మలేషియా, నేపాల్, ఈజిప్టు లాంటి దేశాల్లోనూ కాఫీడే శాఖలు ఉన్నాయి. అలా తక్కువ కాలంలోనే కాఫీ డేకు మంచి గుర్తింపు లభించింది. కాఫీ కింగ్‌గా సిద్దార్థ పేరు మార్మోగింది. కాఫీడేతో పాటు హాస్పిటాలిటీ వ్యాపారాన్ని కూడా ప్రారంభించారు. కెరీర్ సక్సెస్‌ఫుల్‌గా ఉన్న సమయంలోనే సిద్దార్థ ప్రముఖ ఐటీ సంస్థ మైండ్ ట్రీలో పెట్టుబడులు పెట్టారు. 1999లో రూ.340 కోట్లతో వాటాలు కొనుగోలు చేశారు. ఈ ఏడాదే మైండ్‌ట్రీలో వాటాలను రూ.3వేల కోట్లకు అమ్మేశారు.

# భద్రాద్రి జిల్లాలో కాల్పుల కలకలం

## ఎదురుకాల్పుల్లో న్యూడెమక్రసీ సభ్యుడి మృతి

భద్రాద్రి కొత్తగూడెం,జూలై31(ఆర్ఎన్ఎ): భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఎదురుకాల్పుల కలకలం రేపింది. గుండాల మండలంలో పోలీసుల కాల్పుల్లో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ దళ సభ్యుడు మృతిచెందారు. రోళ్లగడ్డ దేవెళ్లగూడెం అటవీప్రాంతంలో పోలీసులు, లింగన్న దళం సభ్యుల మధ్య ఈ ఉదయం ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. మావోయిస్టు వారోత్సవాల్లో భాగంగా గుండాల అటవీ ప్రాంతంలో పోలీసులు కూంబింగ్ నిర్వహిస్తుండగా.. రోళ్లగడ్డ అటవీప్రాంతంలో పోలీసులకు లింగన్న దళ సభ్యులు తారసపడ్డారు. ఈ క్రమంలో ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఘటనలో న్యూడెమోక్రసీ సభ్యుడు ఒకరు మృతిచెందారు. గోపి, నరేష్ అనే ఇద్దరు కమాండర్లను అదుపులోకి తీసుకున్నారు. ఘటనాస్థలిలో రెండు తుపాకులు స్వాధీనం చేసుకున్నారు

# ప్రపంచ శ్రేణిలో "సెల్ఫీ ఆఫ్ సక్సెస్"

## తొలి రచనతోనే బుర్రా వేంకటేశం విశ్వవ్యాప్తం- బి.ఎస్.రాములు



ఐఎఎస్ అధికారి బుర్రా వెంకటేశం ఇంగ్లీష్‌లో తొలిసారిగా వెలువరించిన సెల్ఫీ ఆఫ్ సక్సెస్ పుస్తకం అమెజాన్ అమ్మకాల్లో నంబర్‌వన్ స్థానంలో నిలిచిందని బీసీ కమిషన్ చైర్మన్ బి.ఎస్.రాములు అన్నారు. సెల్ఫీ ఆఫ్ సక్సెస్ పుస్తకాలను కొరియా ప్రతినిధులకు ఐఎఎస్ అధికారి బుర్రా వెంకటేశం, బీసీ కమిషన్ చైర్మన్ బి.ఎస్.రాములు అందజేస్తూ... ఈ సందర్భంగా చైర్మన్ బి.ఎస్.రాములు మాట్లాడుతూ ఐఎఎస్ అధికారి బుర్రా వెంకటేశం ఇంగ్లీష్‌లో తొలిసారి వెలువరించిన సెల్ఫీ ఆఫ్ సక్సెస్ పుస్తకం పాఠకులనుంచి అత్యుత్తమ పుస్తకంగా ఫైవ్‌స్టార్స్ సాధించి అమెజాన్ అమ్మకాల్లో మొదటి స్థానంలో నిలిచిందని అన్నారు.

ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది గ్రంథాలయాలలో ఈ పుస్తకం పాఠకులకు అందుబాటులోకి వచ్చిందని రచయిత బుర్రా వేంకటేశం అన్నారు. ఈ పుస్తకాన్ని హిందీ, తెలుగు, ఉర్దూ, బెంగాలి, ఫ్రెంచ్, రష్యన్, చైనా, స్పానిష్, కొరియా భాషల్లో వెలువరించేందుకు రచయిత బుర్రా వెంకటేశం శ్రీకారం చుట్టాలని ఆకాంక్షించారు.

# తెలుగును ప్రపంచ సాహిత్యానికి పరిచయం చేసిన సినారె

## భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ



మహాకవి డా॥ సి. నారాయణరెడ్డి తెలుగు భాషను ప్రపంచ సాహిత్య రంగానికి పరిచయం చేశారని భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ అన్నారు. రవీంద్రభారతిలోని పైడి జయరాజ్ ప్రివ్యూ థియేటర్‌లో భాషా సాంస్కృతికశాఖ, హాసం క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఎస్.వి. రామారావు రూపొందించిన "సవ్యసాచి డా॥సి. నారాయణరెడ్డి" డాక్యుమెంటరీ చిత్రాన్ని మంగళవారం ప్రదర్శించారు. ఈ సందర్భంగా మామిడి హరికృష్ణ మాట్లాడుతూ జీవిత అనుభవాల గురించి సినారె అనేక రచనలు చేశారని తెలిపారు. జీవన తాత్వికుడు, హృదయ అనువాదానికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచి నిరంతర చైతన్య జ్యోతిగా వెలుగొందిన మహాకవి అని కొనియాడారు. తెలంగాణ సారస్వత పరిషత్ కార్యదర్శి డా॥జె.చెన్నయ్య మాట్లాడుతూ సినారె సాహిత్య వ్యక్తిత్వాన్ని ఘనంగా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో భాస్కర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, సినారె కుటుంబ సభ్యులు, సినారె అభిమానులు పాల్గొన్నారు.

# సినారె పురస్కారాలు ప్రదానం



కాకతీయ ఫౌండేషన్ అధ్యక్షుడు జర్నలిస్టు రవి ఆధ్వర్యంలో మహాకవి డా॥సినారె జయంతిని గానసభలో నిర్వహించారు. సినారె కళాపురస్కారాలను వివిధ రంగాలకు చెందిన ఎనిమిది మందికి ప్రదానం చేసి సత్కరించారు. డాక్టర్ ఎస్పీ భారతి, పి. గోవర్ధన్‌రెడ్డి, విజయలక్ష్మీరెడ్డి, పవన్, మహ్మద్ షరీఫ్, డా॥ నందన్‌సింగ్, శివశంకర్‌రెడ్డి, కృష్ణమాచార్యులు పురస్కారాలను స్వీకరించిన వారిలో ఉన్నారు. సముద్రాల వేణుగోపాలచారి (తెలంగాణ ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి), కళా జనార్ధనమూర్తి, ఉపద్రష్ట అరుణ అతిథులుగా పాల్గొని పురస్కార గ్రహీతలను అభినందించారు.



కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో గానసభలో డా॥సినారె 88వ పుట్టినరోజు వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా సినీసంగీత విభావరిని నిర్వహించారు. కిన్నెర-సినారె సాహితీ పురస్కారాన్ని ప్రముఖ సాహితీవిమర్శకుడు డా॥ ఎస్వీ రామారావుకు ప్రదానం చేసి సత్కరించారు. ముఖ్య అతిథిగా ప్రభుత్వ సలహాదారు డా॥కేవీ రమణాచారి, తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ వీసీ ఆచార్య ఎన్. గోపి, ఎం. శివానంద కుమార్, యలవర్తి రాజేంద్రప్రసాద్, కిన్నెర రఘురాం పాల్గొన్నారు. తెలుగు జాతి గర్వించదగ్గ మహాకవి సినారె అని డా॥కేవీ రమణాచారి అన్నారు. "ఫైన్ క్వాలిటీస్ ఆఫ్ తెలంగాణ సాయిల్"కు నిలువెత్తు దర్పణం సినారె అని ఆచార్య ఎన్.గోపి అన్నారు.






# ఇస్లామిక్ దేశాల్లోనూ తలాక్‌పై నిషేధం

## ఆయా దేశాల చట్టాలను గుర్తించని ముస్లిం సమాజం

హైదరాబాద్,జూలై31 (ఆర్ ఎన్ఎ): హైదరాబాద్ లాంటి నగరాల్లో ముస్లిం మహిళల పేదరికాన్ని అడ్డుపెట్టుకుని గల్ఫ్ షేక్‌లకు కట్టుబానిసలుగా కట్టబెడుతున్నారు. ఎందరో అమాయక అమ్మాయిలు షేక్‌ల కామవాంఛకు బలైన ఘటనలు ఉన్నాయి. వీటి గురించి ఇక్కడి నేతలు ఏనాడూ పోరాడలేదు. ఈ విధానంపై ఆలోచన చేయడంలో ఆ సమాజం పూర్తిగా విఫలమయ్యింది. ఇరవై ఇస్లామిక్ దేశాల్లోనూ తలాక్‌పై నిషేధం ఉంది. భార్య, ఆమె సన్నిహిత బంధువులు మాత్రమే కేసు పెట్టవచ్చు. అందువల్ల చట్టం దుర్వినియోగ మయ్యే అవకాశాలు లేవు. విపక్షాల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకున్నాకే తదనుగుణమైన సవరణలూ చేయడం ద్వారా బిల్లును ఆమోదించి దేశానికి మార్గనిర్దేశనం చేయడం అభినందనీయం. మహిళలను మనమంతా గౌరవించే సంస్కృతిని ఆచరించడానికి ముందుకు రావాలి. నిజానికి ఆయా దేశాల్లో అక్కడి చట్టాలకే ప్రాధాన్యం ఉంటుంది. మనదగ్గర మాత్రం అలా లేదు. అయినా ఇంతకాలం ఎవరూ అభ్యంతరం చెప్పడం లేదు. కానీ విడాకుల విషయంలో తలాక్ పద్దతి సరికాదని సుప్రీం కోర్టు గుర్తించి దీనిపై కేంద్రానికి చేసిన ఆదేశాలతో కేంద్రం లా కమిషన్‌కు సూచనలు చేసింది. ముమ్మారు తలాక్ పద్దతి రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు చెప్పాక దానిని ఆమోదించడం మినహా మరో మార్గం ప్రభుత్వం ముందు లేకపోయిందనే భావించాలి. ఈ దశలో కేంద్రం బిల్లు తీసుకుని వచ్చిన దశలో కొందరు దీనిని వ్యతిరేకించడం సరికాదు. విడాకుల కోసం మూడుసార్లు తలాక్ చెప్పే విధానం, బహుభార్యత్వంపై పోరాడాల్సిందే. ఇంకా మహిళలను కట్టుబానిసలుగా చేయాలను కోవడం సరికాదని గుర్తించాలి. కొందరు ముస్లిం ఉద్యమకారిణులు షరియా చట్టంలోని లోపాలను ఎత్తి చూపుతున్నారు. అత్యాచారం, తదితర కేసుల్లో నేరస్థులైన ముస్లిం పురుషుల విషయంలో షరియా చట్టం అమలు చేయాలని మత పెద్దలు ఎందుకు ఒత్తిడి చేయడం లేదని నిలదీశారు. ఈ దశలో మహిళల హక్కులను మనం గౌరవించేలా చట్టాలు చేసుకోవాల్సి ఉంది. ఇది మహిళల హక్కులకు సంబంధించిన వ్యవహారంగానే చూడాలి తప్ప మత వ్యవహారంగా చూడరాదు. ముస్లిం మహిళలకు న్యాయం చేకూర్చే ప్రయత్నాన్ని రాజకీయ ప్రామాణికాలతో బేరీజు వేయకూడదు.

# అంతరపంటలతో అధిక దిగుబడులు

## తృణధాన్యాల పంటలకు ప్రోత్సాహం

భూపాలపల్లి,జూలై31 (ఆంఎన్ఎ): అంతర పంటలు వేసుకోవడం వలన కలిగే లాభాలను రైతులు తెలుసుకోవాలని జిల్లా వ్యవసాధికారులు రైతులకు సూచించారు. తృణధాన్యాలు పండించడం వల్ల ప్రజలకు ఆహార భద్రత కలుగడంతో పాటు నేలసారవంతమై పంట దిగుబడులు అధికంగా వస్తాయని తెలిపారు. వర్షాభావ పరిస్థితుల్లో ఇది ఎంతగానో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. రైతులను ఉద్యానవన పంటలలో ప్రోత్సహించాలని, జిల్లాలో తృణధాన్యాలు, పప్పులు, ఆహార పంటల విస్తీర్ణం పెంచాలని వ్యవసాయ శాఖ అధికారులు కూడా క్షేత్రస్థాయిలోఆదేశించారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆహార పంటలు పంపించాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో వరి పంట విస్తీర్ణం సాధారణంగానే ఉన్న ముతక, తృణధాన్యాలు, పప్పు ధాన్యాల పంటలతో చాలా వెనుకబడి ఉంది. జిల్లాలో వరిధాన్యం, పప్పు ధాన్యాలు, తృణధాన్యాలు, నూనెగింజలు, మొక్కజొన్న, తదితర పంటలను పండించేందుకు రైతులను ప్రోత్సహించాలన్నారు. ప్రతి వ్యవసాయ శాఖ అధికారి వద్ద వారి పరిధిలో గల రైతులకు సంబంధించిన పంటల వివరాలు పూర్తిగా ఉండాలన్నారు. అలాగే వర్షాభావం ప్రాంత అభివృద్ధి కార్యక్రమం ద్వారా జిల్లాలో అతి తక్కువ వర్షం పడే రెండు గ్రామాలను గుర్తించి ఆ గ్రామంలో రైతులు అభివృద్ధి సాధించేందుకు ఉద్యాన వన పంటలు, కూరగాయలు, పాడి గేదెలు, ఆవులు, కోళ్ల పెంపకం తదితర కార్యక్రమాలను ప్రయోగాత్మకంగా చేపట్టి విజయవంతం చేయాలని అన్నారు.

# 'పరిమళించిన మానవత్వం' పుస్తకావిష్కరణ



ప్రొ॥ జి. హరగోపాల్ రచించిన 'పరిమళించిన మానవత్వం' అమరుల స్ఫూర్తి వ్యాసాలు పుస్తకావిష్కరణ సభ సోమవారం సాయంత్రం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. పుస్తకాన్ని ఆవిష్కరించిన వసంత కన్నబీరాన్ మాట్లాడుతూ ప్రొఫెసర్ హరగోపాల్ తన బాల్యం నుంచి జీవితమంతా విలువల కోసం నిలబడ్డారని అన్నారు. దగాపడిన ప్రజల కోసం ఆయన నిరంతరం శ్రమించారని వివరించారు. ప్రొఫెసర్ వీఎస్. ప్రసాద్ మాట్లాడుతూ కుటుంబం, వృత్తిలో, సమాజంలో విలువలకు కట్టుబడి నిరంతరం శ్రమిస్తూ జీవితాలు గడిపిన వాళ్లు సమాజ పురోగతిని ప్రభావితం చేస్తారని చెప్పారు. ప్రొఫెసర్ కె. లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాలమూరు అధ్యయన వేదిక సభ్యులు సీ. రామ్మోహన్, పౌరహక్కుల సంఘం నేత ఎస్.శేషయ్య, మానవహక్కుల వేదిక అధ్యక్షుడు జీవనకుమార్, ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, అమరుల బంధుమిత్ర సంఘం నేత పద్మకుమారి, ఉదయమిత్ర, పి. స్వామి తదితరులు పాల్గొన్నారు.

# ముస్లిం మహిళల విజయం

హైదరాబాద్, జులై 31:ముమ్మారు తలాక్ బిల్లు విషయంలో మోదీ ప్రభుత్వం ఘనవిజయం సాధించిందనే కంటే భారతీయ ముస్లిం మహిళలు తమ హక్కులను సాధించారని అనాలి. ఎంతోకాలంగా అనాగిరక చట్టంతో తమను తన్ని తగలేసినా భరిస్తూ వచ్చిన మహిళలకు ఇప్పుడు చట్టం అండగా నిలవబోతున్నది. ఈ చట్టం ఇప్పుడు తలాక్‌కు తలాక్ చెప్పేసింది. ముమ్మారు తలాక్ చెప్పి విడాకులిచ్చే దుష్ట సంప్రదాయం ఇక భారత్‌లో కొనసాగదు. ఈ బిల్లు సందర్భంగా అనేక విషయాలు గుర్తించాలి. ఇంతకాలం మనుషులంతా ఒక్కటే..మన రక్తమంతా ఒక్కటే... కులాల, మతాల అడ్డుగోడలు పగులగొట్టాలన్న కుహనా రాజకీయవాదులు తలాక్ బిల్లుపై చర్చ ద్వారా తమ ఫాసిస్ట్ విధానాలను బహిరంగ పరిచారు. ట్రిపుల్ తలాక్ చెప్పి మహిళలను వదిలించుకునే వదిలించుకునే పద్దతిని అరికట్టేందుకు చట్టం తీసుకుని వచ్చే ప్రయత్నంలో బిల్లుకు మద్దతు ఇవ్వాల్సిన రాజకయీ పార్టీలు దీనిని వ్యతిరేకించాయి. దేశంలో రాజకీయ పార్టీల నైజం ఏమిటో బయట పడింది. నిజానికి ముస్లిం మహిళలు ఇలాంటి పార్టీలకు ఇక తలాక్ చెప్పాలి. రాజ్యసభలో తమకు తగినంత బలం లేకపోయినా రాజకీయ వ్యూహచతురతతో ఈ బిల్లును ఆమోదింపజేయడం ద్వారా బిజెపి ఓ రకంగా ము÷-లిం మహిళల పక్షాన పోరాడిందని గుర్తించాలి.

కొన్ని పక్షాలు ఓటింగ్‌కు దూరంగా ఉండటం, కొందరు వాకౌట్ చేయడం, బిజూజనతాదళ్ లాంటి పక్షాల నుంచి అందిన మద్దతు కారణంగా ఉద్దేశించిన తలాక్ బిల్లు చట్టంగా బయటకు వచ్చింది. ముమ్మారు తలాక్ విధానం రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు 2017లోనే తీర్పునిచ్చినా, ఇంకా అది కొనసాగుతుండటంతో ఎన్డీయే ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావించి ఈ చట్టం విషయంలో ముందడుగు వేసింది. 99-84 ఓట్ల తేడాతో 'తలాక్ బిల్లు'ను రాజ్యసభ ఆమోదించడం తో ఇక తలాక్ పేరుతో మహిళలను గెంటేసే ప్రయత్నాలు సాగవు. లోక్‌సభ ఆమోదించిన ఈ బిల్లు ఇపుడు రాజ్యసభలోనూ ఆమోదం పొందడంతో త్వరలోనే ఇది రాష్ట్రపతి వద్దకు వెళ్లనుంది. ఆయన ఆమోదించిన తర్వాత, ఫిబ్రవరి 21న జారీచేసిన ఆర్డినెన్సు స్థానే చట్టం అమల్లోకి వస్తుంది. మొత్తంగా భారతీయ ముస్లిం మహిళ ఘన విజయాన్ని సాధించారనే చెప్పాలి. ఈ చట్టంతో ఎట్టకేలకు ముస్లిం మహిళలకు అండ దొరికింది. మతఛాందస చట్టాలతో ఇంతకాలం బానిసలుగా చూస్తూ, తాళిని ఎగతాళి చేసే విధానానికి చట్టం ద్వారా అడ్డుకట్టపడింది. నిజానికి పెళ్లి, విడాకులు అన్నవి మానవ సంబధాలు. వీటికి మతంతో సంబంధం లేదు. మహిళలు ఏ మతం, వర్గం వారైనా అందరికీ ఒకే చట్టం ఉండాలి. కానీ మన దౌర్భాగ్యం ఏమంటే మతాలవారిగా మహిళలను చిన్నచూపు చూస్తున్నాం. వారిని ఆదరించాలన్న జ్ఞానం పురుష జాతిలో ఉండడం లేదు. మనకు జన్మనిచ్చిన మన తల్లులను గౌరవించే సంస్కారం ఉన్న ఈ దేశంలో పూర్తిగా మృగ్యం కావడం దారుణం కాక మరోటి కాదు. ఆలస్యంగా అయినా ముస్లిం మహిళలకు కొత్త చట్టంతో ఊరట దక్కనుంది. ఒకేసారి ముమ్మారు తలాక్ చెప్పి విడాకులిచ్చే పద్ధతిని నిషేధించే ప్రవేశపెట్టిన బిల్లు చట్టరూపం దాల్చడంతో ఇకముందు కూడా నేక ఛాందసవాద చట్టాలకు పాతరవేయాల్సిన అవసరం ఏర్పడింది. తక్షణ, ముమ్మారు తలాక్ చెప్పడం చట్ట విరుద్ధమని, అలా చేసిన భర్తకు మూడేళ్ల వరకు కారాగార శిక్ష విధించవచ్చని ముస్లిం మహిళల వివాహ హక్కుల పరిరక్షణ బిల్లు-2018 పేర్కొంటోంది. ఇదివరకే లోక్‌సభ ఆమోదం తెలిపి, రాజ్యసభలో ఆమోదం కోసం నిరీక్షిస్తున్న బిల్లు ఆమోదంతో దేశంలో నవశకం మొదలయ్యిందనే చెప్పాలి. తీవ్ర చర్చోపల నేపథ్యంలో ఈ బిల్లుకు ఆమోదం లభించింది. ఈ ముసాయిదాను క్షుణ్ణంగా పరిశీలించాల్సి ఉన్నందున పార్లమెంటు ఉభయసభల సభ్యులతో కూడిన సెలెక్ట్ కమిటీ పరిశీలనకు దీనిని పంపించాలన్న డిమాండ్‌ను ప్రభుత్వం అంగీకరించలేదు. నిజంగానే విపక్షాలకు

అంత శ్రద్ధ ఉంటే దీనిపై పార్లమెంటులోనే చర్చకు అవకాశం కల్పించే వాతావరణం ఉండేది. నిర్దిష్టంగా ఒక మతాన్ని లక్ష్యంగా చేసుకోవాలనే ఉద్దేశమేదీ లేదని ప్రభుత్వం స్పష్టం చేసినా విపక్షాలు విజ్ఞత ప్రదర్శించలేకపోయాయి. ఓటు బ్యాంక్ రాజకీయాలకు అలవాటు పడిన నేతలకు విశాల ప్రయోజనాలు కానరావ నడానికి ఈ బిల్లును ఉదాహరణగా చూడాలి. ముస్లిం మహిళలకు న్యాయం చేకూర్చి,గౌరవాన్ని కల్పించా లనేదే బిల్లు వెనుక ప్రయత్నమని న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ వివరించారు. సతి ఆచారాన్ని వరకట్నాన్ని, పార్లమెంటు నిషేధించ గలిగినప్పుడు తక్షణ తలాక్‌నూ నిషేధించవచ్చని మంత్రి స్మృతి ఇరానీ చేసిన వ్యాఖ్యలు కూడా గమనార్హం. స్వలింగ సంపర్కాన్ని, వివాహేతర సంబంధాలను నేరం కాదని చెప్పి ముమ్మారు తలాక్‌ను నేరమని ఎలా అంటారని మజ్లిస్ ఎంపి ఒవైసీ ప్రశ్నించడంలోనూ ఔచిత్యం లేదు. ముమ్మారు తలాక్ పద్ధతి రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు చెప్పాక దానిని ఆమోదించడం మినహా మరో మార్గం ప్రభుత్వం ముందు లేకపోయిందనే భావించాలి. అలాగే మత జాడ్యం వదిలించే ఇలాంటి చట్టాలతో మహిళలకు అండగా నిలవాలన్న విశాల దృక్పథాన్ని ప్రతి ఒక్కరూ స్వాగతించాలి. ఈ బిల్లుతో ముస్లిం మహిళలను కట్టుబానిసత్వం నుంచి బయటపడేసే చర్యలకు ఓ సువర్ణావకాశం వచ్చింది. భారత దేశంలో కులమతాలకు అతీతంగా మహిళల పట్ల గౌరవభావం ఉంది. వారిపట్ల ఆరాధనా భావం ఉంది. ముస్లిం మహిళలు అయినంత మాత్రాన కట్టుబానిసలుగా ఉండాల్సిన అవసరం లేదు వారంతా ఆధునిక భావాలతో తమ మహిళలకు కూడా సమ గౌరవం ఇచ్చేలా చూడాల్సిన అవసరాన్ని గుర్తించాలి. ముస్లిం మహిళలు కేవలం కట్టుబానిసలుగా, సెక్స్ బానిసలుగా జీవనం వెల్లదీస్తున్న ఘటనలు కోకొల్లలు. వారి జీవితాల్లో వెలుగు నింపేందుకు విడాకులను ఏకపక్షంగా తలాక్ విధానాన్ని తొలగించే మహత్తర చారిత్రక ఘట్టాన్ని ఆహ్వానించాల్సిన బాధ్యత ముస్లిం మేధావులపైనే ఉంది.

# తలాఖ్ నిషేధంపై మహిళానందం

## ముస్లిం మహిళల్లోనే నూతనోత్తేజం

న్యూఢిల్లీ,జూలై31(ఆర్ఎన్ఎ): మూడుసార్ల తలాఖ్ పద్ధతికి చరమగీతం పలకాలనేది దేశంలో నెలకొన్న వాస్తవ అభిప్రాయంగా ఉంది. తాజా చట్టంతో దేశవ్యాప్తంగా మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ చట్టం కోసం పోరాడిన మహిళలు కూడా తమ హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు చెప్పుకుంటున్నారు. కొంతమంది గందరగోళాన్ని సృష్టించేందుకు యత్నిస్తున్నారని ముస్లిం మహిళలే విమర్శించారు. ముస్లిం లా బోర్డు షరియా చట్టాన్ని తమకు అనుకూలంగా మెలితిప్పుతోందని ముస్లిం మహిళా ఫౌండేషన్ అధ్యక్షురాలు నజ్నీన్ అన్సారీ ఇప్పటికే ఆరోపించారు. ముస్లిం లా బోర్డు పితృస్వామ్య వ్యవస్థను అమలు చేయాలని చూస్తోందని మరికొందరు ముస్లిం మహిళలు ఆరోపిస్తున్నారు. ముస్లిం మహిళల స్వేచ్ఛా స్వాతంత్ర్యాల గురించి చర్చ జరుగుతున్నపుడు మాత్రమే షరియా చట్టాన్ని ఎందుకు పరిగణనలోకి తీసుకోవాలని ప్రశ్నించారు. అలాగే ఇదేదో బిజెపి అనుకూల నిర్ణయంగానో కూడా చూడరాదు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నా ఈ చట్టం అమలు చేయాల్సి వచ్చేదే. ఈ అంశాన్ని అఖిల భారత ముస్లిం పర్సనల్ లాబోర్డు రాజకీయం చేసేందుకు యత్నిస్తోందంటూ ప్రభుత్వం మండిపడగా.. బలవంతంగా రుద్దకూడదంటూ కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలు పేర్కొన్నాయి. ఉమ్మడి పౌరస్మృతికీ, మూడుసార్ల తలాఖ్ పద్ధతికీ ముడిపెట్టొద్దని కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్ గతంలోనూ స్పష్టం చేశారు. ఉమ్మడి పౌరస్మృతి రాజ్యాంగంలోనే ఉందనీ, దీనిని ప్రజలపై బలవంతంగా రుద్దబోమన్నారు. ముస్లిం లాబోర్డు చర్చలో పాల్గొనాలనీ, విజ్ఞానాత్మక చర్చ జరగాలనీ, వారి వైఖరి తెలియజేయాలనీ, ఏకాభిప్రాయం ఏర్పడాలన్నారు. న్యాయకమిషన్ చర్చకు పెట్టిన అంశానికే పరిమితమవ్వాలన్నారు. ఉమ్మడి పౌరస్మృతిపై సమగ్ర చర్చ జరగాలని న్యాయకమిషన్ భావిస్తోందనీ, అందులో పాల్గొనవద్దనుకుంటే అది ముస్లిం పర్సనల్ లాబోర్డు ఇష్టమన్నారు. ఈ అంశాన్ని రాజకీయ చర్చగా మార్చొద్దని సూచించారు. తలాఖ్ విషయంలోనూ న్యాయ కమిషన్ అన్ని భాగస్వామ్య వర్గాల అభిప్రాయాల్నీ కోరిందన్నారు. అయితే భారతదేశానికి ఉమ్మడి పౌరస్మృతి ప్రయోజనకారి కాదని ముస్లిం పర్సనల్ లా బోర్డ్ వాదిస్తోంది. మూడు సార్లు 'తలాక్' అని చెప్పి విడాకులు తీసుకొనే విధానం, వివిధ మతాల్లో మహిళా వ్యతిరేక ఆచారాలపై ప్రజాభిప్రాయాన్ని కోరడానికి న్యాయ పరిశీలన సంఘం (లా కమిషన్) చేస్తున్న ప్రయత్నం మోసపూరి తమని అభివర్ణించింది. అంతే గాకుండా దీనిని తాము బహిష్కరిస్తామని స్పష్టం చేసింది. మూడుసార్లు తలాక్ చెప్పే విధానాన్ని వ్యతిరేకిస్తూ కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో గతంలోనే అఫిడవిట్ దాఖలు చేసింది. ట్రిపుల్ తలాక్ వ్యక్తిగత నిబంధన అని, దీనిని కేంద్ర ప్రభుత్వం సవరించరాదని ముస్లిం వర్గాలు పేర్కొంటున్నాయి.

అమెరికాలో ప్రతి ఒక్కరూ తమ వ్యక్తిగత చట్టాలను, గుర్తింపును అనుసరిస్తారని, వారి అడుగుజాడల్లో నడవాలని మన దేశం ఎందుకు కోరుకోవడం లేదని ప్రశ్నించారు. అయితే ఈ దశలో ఇలాంటి వాదనలకు తావీయకుండా తలాక్ వ్యవహారంలో మాత్రం ఒకే గొంతుక వినిపించి మహిళలకు స్వేచ్ఛ ప్రసాదించాల్సి ఉంది. దీనిని ముస్లిం మేధావులు సానుకూల ధోరణితో స్వాగతించాలి. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతించి మహిళలకు గౌరవం ఇవ్వాలన్న ధోరణి రావాలి. అప్పుడే సమాజంలో వారికి గౌరవం పెరుగుతుంది.

# సంక్షేమంలో కేసీఆర్ ముందున్నారు

## కేసీఆర్ కిట్‌తో మేలు:ఎమ్మెల్యే

కొత్తగూడెం,జూలై31(ఆర్ఎన్ఎ): ప్రజలు జీవితాల్లో మార్పులు తెచ్చేలా సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టి న సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే అన్నారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా పేదింటి గర్భిణులకు తెలంగాణ ప్రభుత్వం కేసీఆర్ కిట్ పథకం ఒక వరాన్ని ప్రసాదించింది. ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాలు చేసుకున్న గర్భిణులకు వీటిని అమలు చేస్తున్నారు. ఆయా ప్రభుత్వ ఆస్పత్రుల్లో తమ పేర్లను నమోదు చేసుకోవడంతో ఇప్పటికే ప్రభుత్వం మంజూరు చేసిన కేసీఆర్ కిట్ పథకం వారికి వరంగా మారిందని అన్నారు. కేసీఆర్ కిట్‌లో 15 రకాల వస్తువులు తల్లీబిడ్డ అవసరాలకు ఉపయోగ పడుతున్నాయని ఎమ్మెల్యే అన్నారు. పేద బాలింతలు ఈ కిట్‌లు బయట కొనుగోలు చేసుకోవాలంటే ఆర్థిక భారం పడుతున్నందున ప్రభుత్వమే వాటిని ఉచితంగా సరఫరా చేసేందుకు నిర్ణయించిందన్నారు. కేవలం కేసీఆర్ కిట్‌కే పరిమితం కాకుండా ప్రసవం అయిన తల్లికి రూ.12 వేలు పారితోషకం ఇచ్చేందుకు కూడా ప్రభుత్వం నిర్ణయించిన్నారు. ఈ పదిహేను రకాల కిట్‌లలో బేబీ బెడ్, బేబీ మాకింగ్‌టోస్, బేబీ డ్రెస్సెస్, బేబీ టవల్స్, న్యాప్‌కిన్స్, జాన్సన్స్ బేబీ సోప్, శాంపు, ఆయిల్, తల్లులకు సబ్బులు, రెండు చీరెలు, బాక్స్, టాటల్ టాయ్, కిట్‌బాక్స్, బాస్కెట్‌లను ఈ కేసీఆర్ కిట్‌లో ఉంచారని అన్నారు.

### మత్స్య పరిశ్రమ అభివృద్ధికి కృషి

ఖమ్మం,జూలై31(ఆర్ఎన్ఎ): సమగ్ర మత్స్యాభివృద్ధి పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు నిధులు కేటాయించింది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చొరవ పట్ల జిల్లాలో చేపల, రొయ్యల ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. తద్వారా రాష్ట్రంలోనే ఖమ్మం జిల్లా రెండో స్థానంలో నిలిచిందని జిల్లా మత్స్యాభివృద్ధి అధికారి అన్నారు. మత్స్యకార్మికుల ఆర్థిక అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సమీకృత మత్స్య అభివృద్ధి పథకం లబ్ధిదారులను ఎంపిక చేసే విధానంలో పూర్తి పారదర్శకత చేపడుతున్నట్లు తెలిపారు. మత్స్యకార్మికుల సహకార సంఘాలకు ప్రభుత్వ పరంగా అందిస్తున్న సంచార వాహనాలు, లగేజీ ఆటోలు, ఇతర పరికరాలను అందించేందుకు లాటరీ నిర్వహించారు. జిల్లాలో 177 సంఘాలు చేపలవేట వృత్తిపై ఆధారపడి ఉన్నాయన్నారు. వీరి ఆర్థిక అభివృద్ధికి గాను లగేజీ ఆటోల కోసం లబ్ధిదారులను ఎంపిక చేసిట్లు చెప్పారు.

నేటినిజం
# సాహితీ కెరటాలు
E-mail : netinijam93@gmail.com
website: www.netinijam.com
గురువారం 1-8-2019 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 హైదరాబాద్ 3

## నమ్మలేని నిజాలు

ఆరోగ్యశ్రీ
అల్ప ప్రాణుల గుడి
జీవ సంజీవి.

అంగట్లో కల్లు
ఈదుల్లో చెట్లుంటేనా?
మత్తుకు పైకం.

మారిన మాత్ర
అర్థంకాని రాతలు
తగ్గని రోగం.

పాము పకోడ
విభిన్న జిహ్వారుచి
ఏది వదలరు.

కొత్త పలక
చదువుల ఐపాడు
పరాన్న భుక్కు.

- రేడియమ్
9291527757

## శ్రీనిజాలు

నెర్రెలిడిన నేలమీద
కరిమబ్బు చెరించిందోయ్!
చినుకుచిరుత గాండ్రించుతు
పంజవిసిరి చరిచిందోయ్!

ఎదురెత్తిన నదీనీళ్ళతో
ఎలిగెత్తిన మహాకాయుడు!
బాహుబలి మోటర్లతో
మానవుడే మహనీయుడు!



- కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

# జాతీయ దేశీ వైద్య, ఉత్పత్తుల దినోత్సవం



- బి.ఎస్.రాములు
సామాజిక తత్వవేత్త
ఛైర్మన్, బీసీ కమిషన్, తెలంగాణ రాష్ట్రం
సెల్: 8331966987

ఏటా కనీసం రెండుసార్లు దేశీయ వైద్య ఉత్పత్తుల చికిత్సల దినోత్సవాలు జరుపుకోవడం అవసరం. అది దేశీయ వైద్య విధానాల జీవన శైలి దినోత్సవంగా ప్రాచుర్యంలోకి తీసుకురావడం అవసరం. వైద్య రంగానికి సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేయాల్సిన కృషి ఎంతో ఉంది.

అల్లోపతితో లక్షలాదిమంది ఆయుర్వేద వైద్యులు, వనమూలికలు సేకరించేవారు ఉపాధి కోల్పోయారు. ప్రజలేమో వైద్యానికే హెచ్చుభాగం వెచ్చించాల్సి వస్తున్నది. అల్లోపతి డాక్టర్లు, మందుల కంపెనీలేమో వందల, వేల, లక్షల కోట్లకు పడగెత్తుతున్నారు. ఒక పరిశోధన ప్రకారం అల్లోపతి వైద్యం వల్ల 80 శాతంమంది పేదరికంలోకి నెట్టివేయబడుతున్నారు. తరతరాలుగా ఇండియాలో ఆయుర్వేదం, వనమూలికలు, స్థానిక వైద్యం, అనుభవ వైద్యం కొనసాగుతూ వస్తున్నది. దీన్ని స్థిరీకరించి నూతన పరిశోధనలు, ప్రయోగాలు చేస్తూ, ముందుకు సాగితే దేశం స్వయం సంపూర్ణంగా వైద్యరంగంలో ప్రపంచానికి మరో నమూనాగా ఎదిగి ఉ ండేది. ఆధునిక పరిశోధనలు ఆయుర్వేదంలో భాగం చేయకుండా, అల్లోపతిలో భాగం చేయడం అనే పొరపాటు నేటికీ కొనసాగుతున్నది. ఉదాహరణకు టీకాలు అనే విధానం కేవలం అల్లోపతికి సంబంధించింది కాదు. అదొక పరిశోధన. అది అనేక పరిశోధనల ఫలితం.

మలేరియా దోమలవల్ల వస్తుందని సికింద్రాబాద్‌లో కనుక్కొని ప్రపంచానికి చెప్పారు. అలా ఈగలు, దోమలు, బ్యాక్టీరియా, అరక్షిత నీరు, కలుషిత ఆహారం వల్ల అనేక వ్యాధులు వస్తాయని పరిశోధనలవల్ల తెలుసుకోవడం జరిగింది. వాటికి వైవిధ్యం ఆయుర్వేదం ద్వారా కూడా కనుక్కోవచ్చు, హోమియోపతి ద్వారానూ కనుక్కోవచ్చు. అల్లోపతి ద్వారా కనుక్కోవచ్చు. స్థానిక, వనమూలికల వైద్యం ద్వారా, ప్రకృతి చికిత్స ద్వారా పరిశోధన చేసి కనుక్కోవచ్చు. సల్ఫా మందులు, యాంటిబయోటిక్స్, పెన్సిలిన్ వంటి వాటి ద్వారా అల్లోపతి వైద్యం విస్తరిస్తూ వస్తున్నది. వికటిస్తూ వస్తున్నది. అల్లోపతి వైద్యం ఎప్పటికప్పుడు వికటిస్తూ వస్తుందని హానిమాన్ అనే అల్లోపతి వైద్యుడు పరిశోధనలో గమనించి హోమియోపతి వైద్య విధానాన్ని కనుక్కొన్నాడు. ఇప్పుడు అల్లోపతి వైద్య పరిశోధనలు కూడా వైద్యం వికటించి సైడ్ ఎఫెక్ట్స్ వస్తున్నాయని నిర్ధారిస్తున్నాయి. దీనికితోడు 1964 నుండి అల్లోపతి వైద్య పరిశోధనలు, వైద్యం, మందుల ఉత్పత్తి, చికిత్స విధానాలు, వ్యాధిని పూర్తిగా నయం చేయకుండా అదుపులో చేసేవిధంగా సాగాలని ఒక రహస్య నిర్ణయంతో సాగుతున్నది. అందువల్ల దేనికి పూర్తి నివారణ లేదు అనే ప్రచారం ప్రారంభించారు. అలా బీపీ, షుగర్, క్యాన్సర్, ఎయిడ్స్ వంటి అనేక వ్యాధులను శాశ్వతం చేస్తున్నారు. పూర్తిగా నిర్మూలించే విధానాలకు, పరిశోధనలకు చెల్లుచీటి ఇచ్చారు. ఆయుర్వేదం, యోగా, మెడిటేషన్, ప్రకృతి చికిత్స వంటివి అల్లోపతి చేసే ఈ దుష్ప్రచారానికి భిన్నంగా శాశ్వత పరిష్కారాన్ని చేసి చూపిస్తున్నాయి.

చాలా ఆలస్యంగానైనా సరే పాత అనుభవాలనుండి, పాత విజ్ఞానం నుండి నూతన పరిశోధనలు చేస్తూ, అనేక ఆయుర్వేద మందులు, చికిత్సలు వేగం పుంజుకున్నాయి. జాండిస్ అని పిలిచే పసిరికలకు లివ్52 అనే ఆయుర్వేదం మందు ఒక్కటే పనిచేస్తున్నది. వైద్యనాథ్, జాండూ, హిమాలయ, పతంజలి, దివ్య, కేరళ, ఆయుర్వేద ఫార్మసీలు మొదలైన వాటితోపాటు ఇటీవల విస్తృతంగా ప్రాచుర్యంలోకి వస్తున్న యోగ, మెడిటేషన్, ప్రకృతి చికిత్స, రాందేవ్‌బాబా వంటి ప్రయత్నాల ద్వారా, భారతీయ వైద్య విధానాల పట్ల ఆసక్తి పెరుగుతున్నది. ఎక్కడ అల్లోపతి వైద్యం ఆగిపోతుందో, అక్కడనుండి ఆయుర్వేదం, యోగ ప్రారంభమవుతుందని అని రాందేవ్‌బాబా ఇచ్చిన నినాదం మహత్తరమైనది.

వ్యాధి వచ్చిన తర్వాత వైద్యం చేసుకోవడం ఒక తీరు. రోగాలు రాకుండా చూసుకోవడం ఒక తీరు. జీవనశైలిని, ఆహార నియమాలను సరిగ్గా పాటిస్తే వైద్యం అవసరం అంతగా ఉండదు. డెబ్బై, ఎనభై యేళ్ళ వయస్సులో ఉ న్నవాళ్ళు ఎంతోమంది ప్రముఖులు కూడా పెద్దగా వైద్యం అవసరం లేకుండా బతుకుతూ వస్తున్నారు. బాగా అవసరమైతే ఆయుర్వేదానికి సంబంధించిన వన మూలికలతో గానీ, ఆహారాన్ని గానీ తీసుకోవడం ద్వారా బండి నడిపిస్తున్నారు. తద్వారా వారి రోగ నిరోధక శక్తి పెరుగుతున్నది. లంఖనం పరమ ఔషధం అనేది భారతీయ జీవన శైలిలో ఒక ప్రధానమైన అంశం. ఉపవాసం ఉండడం ద్వారా రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ప్రకృతి చికిత్సలో ఒక మాట చెప్తారు. శరీరం తనను తాను బాగు చేసుకుంటుంది. చేయాల్సిందల్లా అందుకు తగిన పరిస్థితులను కల్పించడమే. శరీరంలో పేరుకుపోయే మలినాలను తొలగించడం ద్వారా ప్రకృతి చికిత్స శరీరాన్ని తనకు తాను బాగుచేసుకుంటుంది.

ఈ విషయాలు తెలిసినప్పటికీ, చాలామంది నిర్లక్ష్యం చేస్తుంటారు.

> **కుటుంబ నియంత్రణ ద్వారా, ప్రకృతి సమతుల్యత సాధించడం ద్వారా, పర్యావరణాన్ని పరిరక్షించడం ద్వారా, పారిశ్రామిక కాలుష్యం, అణుధార్మికత, కల్తీ వంటి భారం నుండి రక్షించుకోవడం ద్వారానే భూమి రక్షించబడుతుంది. భూభారం తగ్గుతుంది. ప్రకృతిమాత తన ఒడిలో మనల్ని సంపూర్ణ ఆరోగ్యంతో దీవిస్తుంది.**

హోటళ్ళు, సినిమా టాకీసులు, ఫంక్షన్లు, కల్తీ ఆహార పదార్థాలు, పంటలకు వాడే క్రిమి సంహారక మందులు, ఆధునిక ఎరువులు, శరీరంలో చేరి మలినాలుగా మిగిలిపోతున్నాయి. శరీరాన్ని చెదలు తిన్నట్టుగా తినేస్తున్నాయి. ఇది తెలిసి కూడా కేవలం నాలుక రుచికోసం అనారోగ్యాలను కొనితెచ్చుకుంటున్నారు. శరీరాన్ని, మనస్సును బాధలకు గురి చేస్తున్నారు.

ఒక సరైన డాక్టర్ తినడం కోసం బతుకుతున్నారా, బతకడం కోసం తింటున్నారా అని ప్రశ్న వేస్తారు. ఈ ప్రశ్న వేసే డాక్టరే సరియైన డాక్టర్. బ్రాహ్మణ భోజనప్రియ అనే నుడికారం ద్వారా మొత్తం మధ్య తరగతికి వ్యాపించింది. కానీ, డాక్టర్‌కు బతకడం కోసం తింటున్నామని జవాబు చెప్తారు. నాలికలో మొత్తం నాలిక కాకుండా సగం నాలికకు మాత్రమే రుచి తెలుస్తుంది. నాలిక దాటితే రుచి తెలియదు. నాలికతో సంబంధం లేకుండా, ఆయుర్వేద మందులు గొంతులో వేసుకోమని చెప్పుడేవారు. ఆయా సందర్భాల్లో గొంతుకు గొట్టం పెట్టి ఆహారాన్ని అందించడం తెలిసిందే. శరీరంకోసం, ఆరోగ్యం కోసం, బతకడంకోసం తిండి తినాలి అనుకుంటే మనజీవన శైలి తప్పకుండా మారుతుంది.

ఆయుర్వేదం, హోమియోపతిలో ఆలస్యంగా వైద్యం పనిచేస్తుందని నింద మోయాల్సి వస్తుంది. వెంటనే వెల్లకుండ, అన్ని తరువాయులు పూర్తయ్యాక ఆశ్రయించిన పేషెంట్లవల్ల ఈ నింద మోయాల్సి వస్తున్నది. అందువల్ల వెంటనే తగ్గేవిధంగా ఉండే మందుల ఆవశ్యకత, చికిత్సలు, పరిశోధనలు ఎంతో అవసరం. అవి ఇప్పుడు లేవని కాదు. వాటికి ప్రాచుర్యం చాలా ముఖ్యం.

ఆయుర్వేదం విస్తరిస్తే ఎన్నో ప్రయోజనాలు. వేల కోట్ల రూపాయలు విదేశీ మారక ద్రవ్యం తరలింపు ఆగిపోతుంది. ఆయుర్వేద, వనమూలికల పంటల ద్వారా పంటల్లో మార్పు, పంటలకు గిట్టుబాటు పెరుగుతుంది. చిరుధ్యానాల పేరిట ఇది కొంత ఇప్పుడిప్పుడే వ్యాప్తిలోకి వస్తున్నది. ఇంకా ఎన్నోరెట్లు పెరగాలి. తక్కువ నీటితో, తక్కువ కాలంలో పండే పంటలను ప్రాధాన్యతతో పండించడం ఎంతో అవసరం. అడవులు పెంచడం ద్వారా వనమూలికలు, వానలు సమృద్ధితో పర్యావరణం విలసిల్లుతుంది.

ఆయుర్వేదం వంటి భారతీయ వైద్య విధానాల్ని ఎన్నోరెట్లు అభివృద్ధి చేసుకోవడం అవసరం.

ప్రకృతి తత్వానికి, శరీరతత్వానికి, పరిసరాలకు అనుగుణంగా జీవనశైలిని మార్చుకోవడం అవసరం. రోజువారీ జీవితంలో ఈతకు, వ్యాయామానికి, యోగా, మెడిటేషన్, వాకింగ్‌కు ఒక గంట కేటాయిస్తే అనేక వ్యాధులు నయమవుతాయి. రాకుండా ఉంటాయి. వారానికి ఒక రోజు ఉపవాసం ఉ ండడం కూడా ఎంతో అవసరం. నీవు పుట్టినప్పుడు రెండున్నర, మూడున్నర కిలోలే. పెరిగిన బరువంతా నువ్వు పెంచుకునేదే. ఆరోగ్యవంతుడికి ఎంత అవసరమో అంతవరకే బరువు ఉండేలా చూసుకోవాలి. అంతకన్నా ఎక్కువ పెరిగేదాక చూసుకొని, బొర్ర చూసుకొని మురిసిపోయి, ఆ తర్వాత బరువు తగ్గడంలేదని బాధపడడం దేనికి. బరువు గాలి కొట్టినట్టుగా పెరగదు. రోజుకు కొంత పెరుగుతుంది. అలా కొద్దిగ పెరుగుతుందని గమనించినప్పుడే జాగ్రత్తలు తీసుకుంటే వందలాది రోగాలు దరిచేరవు. కొలెస్టరాల్, ఫ్యాట్స్ పెరగకుండా చూసుకోవడం అవసరం.

అందుకు అనువుగా జీవనశైలి రూపొందించుకోవాలి.

ఏమైనప్పటికీ డబ్బులు ఉన్నంత మాత్రాన ఒక రోగానికి లక్షల కోట్లు ఖర్చు పెట్టడం సరైంది కాదు. ఒకాయన ఫలానా ఫలానా తినడం మానేయాలి. తాగడం మానేయాలి అని అంటే ఇక బతకడం ఎందుకు అని ఎదురు ప్రశ్న వేశాడట. వాళ్ళ జీవన లక్ష్యం వ్యసనాలు, అలవాట్లు జీవనశైలిగా మార్చుకోవడమే. ఇలాంటివారికి ఏం చెప్పినా స్వీయ అనుభవంతోనే దారిలోకి రావడం జరుగుతుంది. పోతే పుటుక్కున పోతారు. అదికూడా మంచిదే. భూమి భారం తగ్గుతుంది అని కొందరు అంటుంటారు. కానీ భూభారం తగ్గాల్సింది ఇలా కాదు. కుటుంబ నియంత్రణ ద్వారా, ప్రకృతి సమతుల్యత సాధించడం ద్వారా, పర్యావరణాన్ని పరిరక్షించడం ద్వారా, పారిశ్రామిక కాలుష్యం, అణుధార్మికత, కల్తీ వంటి భారం నుండి రక్షించుకోవడం ద్వారానే భూమి రక్షించబడుతుంది. భూభారం తగ్గుతుంది. ప్రకృతిమాత తన ఒడిలో మనల్ని సంపూర్ణ ఆరోగ్యంతో దీవిస్తుంది.

## వాస్తు జిందాబాద్

వ్రాయిస్తారు కొట్టి వేయిస్తారు
మళ్లీ మళ్లీ
కొట్టి వేయిస్తారు వ్రాయిస్తారు
ఏమి టీచర్లో ఏమిటో, చదువేమిటో?
కాలం వృధా

కాసుల వృధా
గురువులు మారినపుడెల్లా ఇదో దండుగ!
కూల్చివేతలు కట్టడాలు
ప్రజల సొమ్ముతో వైభోగాలు
వసంతాలు విందులు వినోదాలు
ఆవిష్కరణలు ఆనందహేళలు

అంతా వాస్తమయా
అంతా పీఠాధిపతుల కాలం

జనమెందుకు?
చెమటకు విలువెందుకూ?

ప్రజాస్వామ్యం పూలు పూయటం లేదు
ప్రజల చెమట పంట పండినా
చీకట్లో గోల్‌మాల్

కంట్రాక్టర్ల గుసగుసల మధ్య
రాజకీయ క్రీడ
వాస్తు మాట్లాడదు
వాస్తవం పాతరవుతుంది.



- సి.హెచ్. మధు
సెల్: 9949486122

## ఆత్మబంధం

నిస్వార్థపూరితంగా
నిర్మలభరితంగా
పవిత్రపూర్వకమైన
వినమ్ర సంస్కారాలతో
ఆదర్శంగా వెలిసి
అనివార్యమై నిలిచి
సౌశీల్యంతో ముడిపడి
సంకల్పంతో జతపడి
విలువలతో మెలిగే
స్వయంప్రకాశంగా వెలిగే
ప్రమిదకిచ్చే పరిపూర్ణ గౌరవం
ప్రజ్ఞకిచ్చే సంపూర్ణ స్వేచ్ఛ
ఆత్మబంధం !! ??

సువిశాల భూగోళంలో
సుందర మనోహర కోమల
రమణీయమైన ప్రకృతిలో
సీతాకోక చిలుకలా
స్వేచ్ఛా విహంగంలా
జలపుష్ప విలాసినిలా
సతతానందాన్నిచ్చేదై
ప్రసన్న వదన దరహాసంతో
ప్రశాంత సునయన వీక్షణతో
మనోభీష్ట సమన్వయంతో
పరవశించే అమృతవర్షిణి
ఆత్మబంధం !! ??

అంతరాత్మ సదృశ్యమై
ఆధ్యాత్మికతతో మమేకమై
అమూల్యమైన
మహిమాన్వితపు గనిలా
అనిర్వచనీయమైన
మరులుగొల్పే నిధిలా
అలవికాని సంతృప్తినిస్తూ
విచక్షణతో కదిలేది
విశ్వాసపాత్రమై మెదిలేది
కాలాలకు కష్టాలకు అతీతంగా
వేదనలకు వాదనలకు దూరంగా
స్థిరమై సుస్థిరమై
అనంతమై నిలిచేది
ఆత్మబంధం !!



- రాజేశ్
సెల్:9440460490

## నిజాలు!!

నరమేధం
అక్కడా, ఇక్కడా, అంతటా

తామరాకు ఫేస్ బుక్కు..!
సాగాలి అంటకమెంటక., తుషార బిందువై

పునాది రాళ్ళై పథకాల్కొన్ని
వేసిన మంత్రిగారు సమాధైనా, పూర్తికాక

తెగింపు తరుణివంతే
అబలగా బెదిరినా., అపరకాళికై

మత్తు తొలుత గమ్మత్తు
చిత్తం చిత్తై బ్రతకంతా మత్తుకు తొత్తు

గెలిచేయడం...గెలిచేయడం చిన్న తేడా
మొదటి దాన్ని అధిగమిస్తే రెండోది సాధ్యమే

విప్లవం ప్రజాపక్షమే
దొరలేకాదు,దోపిడీ దారులెవరైతేనేం

ప్రయోజనాలెన్నో..జనాలకి
వాడాల్సినప్పుడు వాడకపోతేనేం,బుర్ర

తెలిసింది ఒక్కటే..
తెలిపే ఆత్రం మినహా ఏ మాత్రం తెలీదనీ

సిటీ రోడ్లు పద్మవ్యూహాలు
అర్జునుడైనా అవాక్కయ్యే అద్భుత వైనాలు

అయోమయాల యూ టర్న్ లు
పెరిగే పెట్రో పుండుపై ధూరాభార కారాల్ని

అగ్నిధారలు...మంచుగుం
డెల్లో...
కబళిం'చైనా' డ్రాగన్...పక్కలో 'పాకే' పాము

విచిత్ర భావన విశ్వం
ఊహకు సంక్లిష్టం, పరిమిత అనంతం

ఏ పరీక్ష గుర్తు పడుతుంది?
కులమత లింగ వర్గ జాతి ప్రాంత భేదాలు

మనసుకెక్కడిది మరణం
ఆత్మ దర్శనానికి అనంతకాలం

ఆశానిరాశలు.,దృక్పథాలు
తోడున్న నా, ఎడతెగని త్రోవ, చందంగా

"చై"నా'మాల్ అంతా గోల్ మాల్
చదువు'కొనుట' సార్థకమయ్యే చోటట

అనుబంధాలు అంతరించవు
అహంభావం, నిర్లిప్తత, నిర్లక్ష్య,చంపకుంటే



-గొల్లపెల్లి రాంకిషన్
9849693324.

# చైనా పద్యాల్లో చీనాంబరాలు








కవిత్వం ఏ భాషలోనైనా కమనీయంగానే ఉంటుంది. చైనా భాష అందుకు ఏమీ తీసిపోదు . చైనా కవిత్వం లో కనిపించే విలక్షణత్వానికి ,విశాల తత్వానికి ఆ భాషలో వుండే సౌలభ్యం కూడా ఒక ప్రధాన కారణంగాచెబుతారుపండితులు.చైనా భాష చీనో టిబెటన్ భాషా కుటుంబానికి చెందింది. లిపి చిత్రలిపి .వ్యాకరణ రహితమైన భాష. వాక్యంలో పదానికి ఉ న్న స్థానాన్ని బట్టి ఆ పదం ఏ భాషా భాగానికి చెందిందో నిర్ణయింపబడుతుంది. చైనా భాష మూడు వేల సంవత్సరాలకు ముందు నుంచే ఉన్నట్టుగా పండితులు ప్రకటించారు . సాధారణంగాయాత్ర చరిత్ర విశేషాలు ఎంతో విచిత్రంగా ఉంటాయి. డాక్టర్ఎన్. గోపి గారు రచించిన ×చైనాలో కవితా యాత్ర×అనే గ్రంథంలో కవి అనుభవాలన్నీ కూడా మననిచైనా నగర వీధుల్లో నిలబెడతాయి. చక్కగా పొడవాటి గోడ దగ్గర నుంచి పెద్ద చేప వరకు అన్నిటినీ చూపించి తీసుకు వస్తాయి. అలా చైనా యాత్ర అంతా సుఖంగా సుముఖంగా చుట్టబెట్టి వచ్చిన గోపి గారు షాంఘై నుంచి సింగపూర్ తిరిగి వచ్చే లోపల (అంటే నాలుగు గంటల వ్యవధిలో) చైనా సమాజం సాంస్కృతికతల మీద నూరు చిన్న కవితలు రాశారంటే అది ఆశుకవిత్వమా కవిత్వం రాయడమే వారి జీవితాశయమా అన్న అంశాన్ని నివ్వెరపోతూ మనం నిర్ణయించుకోవాల్సిందే కానీ ఆ కల వేగం మాత్రం ఆగదు.

జూన్ నెలలో 25 వ తారీకు నాడు సాయంత్రం 6 గంటల సమయంలో ఆంధ్ర మహిళా సభ లో ఉన్న నేషనల్ బుక్ ట్రస్ట్ ఆఫీసులో లో డాక్టర్ ఎన్.గోపి గారు రచించిన ×చైనా పద్యాలు× × జీవన భాష" అన్న రెండు పుస్తకాలకు శ్రీపాద స్వాతి గారు చేసిన అనువాదంతో పుస్తక ఆవిష్కరణ సభ ప్రారంభమైంది. ప్రకృతి చల్లబడితేనే కవులందరికీ కూడా కవిత్వం చల్లగా వినిపిస్తుంది అన్న నమ్మకంతో గోపి గారు తీవ్రమైన ఎండ గాడ్పులు తీరికగా వెళ్లిపోయాక మెల్లిగా చక్కటి చైనా పద్యాల్లోని కవిత్వాన్ని చల్లని సాయంకాలం లో అందరికీ పంచారు. గోపి గారి చైనా పద్యాల్లో కావ్య కన్నియలు ఎన్నో చినీ చీనాంబరాలు కట్టాయి. అన్ని మంచి వెలగలవే .సున్నితంగా ఉన్న గోపి గారి కవిత్వం ఎంత బాగుందంటే దానిమీద వెంటనే స్పందించి ఒక వ్యాసం రాయాలని పించేంతగా నన్ను ఆకర్షించింది . 40 పేజీల్లో నాజూకు గా తిరుగుతున్న కవితా కన్యలని ఒక్కసారి పలకరిద్దాం అనిపించింది. ఆ సన్నని కవితల మీద ఒక ఒక పరిశీలన చేసి కొన్ని మంచి వాక్యాలు చెప్తేబాగుం టుందని అనిపించింది.గోపి గారు చెప్పినట్టుగా ఈ చైనా కవితలు చిన్నగా ముద్దుగా చైనా ప్రకృతిలా చల్లగా ఉన్నాయి .ఈ పుస్తకం చదివితే చైనా మీద ఉ న్నటువంటి ద్వేషం పోయి చిన్నగా మమత చిగురిస్తుంది. ఈ విషయాన్ని నాలుగు వాక్యాల నానీలో గోపి గారు ఎంతలా చెప్పారో చూడండి..

అరవయ్యేళ్లుగా / చైనా పై కోపం/ పదిరోజుల్లో /ప్రేమించటం
నేర్చుకున్నాను(పేజి నెంబర్ 22)

భారత్ కి చైనా చేసిన వ్యతిరేక చర్యలు మర్చిపోవాలంటే చాలా కష్టమే కానీ చైనా ఒకసారి తిరిగి వస్తే చాలు... అనేక ..........అతీతులుగా నిలబడవచ్చు అన్న సందేశం కనిపిస్తుంది ఈ కవితలో . తెలుగువాడినని /మరిచిపోయాను / భారతీయుడిగా/ అనుభూతి చెందాను . (పే .నెం. 35)

చైనా /ఇకనుంచైనా /కలిసి మెలిసి ఉందాం / ఇరుగుపొరుగులం కాదా మనం ? (పే. నెం. 40) ఇది చదువుతుంటే ఇరు దేశాల మధ్య ఉ న్న వైరుధ్యం పట్ల కవి సహృదయం ఎంతగా కలత చెందిందో, ఎలా తడిసి పోయిందో తెలిసిపోతుంది . ఇంక చైనా దేశం ఎంత అందంగా ఎలా... ఎలా ఉంటుందో అనుకునే వారికి మరో నాని ఉంది

శ్రీశ్రీ చైనా వెళ్లొచ్చి /స్వర్గ మన్నాడు /ఇప్పుడు చూస్తే/ ఏమనేవాడో.

దీనికి అందమైన సరిగంచులా మరో చిన్న కవిత .....ఊరినిండా /ఉద్యానవనాలు/ జూన్ లో /పుప్పొడి వర్షాలు కురవచ్చు. .....మొత్తంగా చూస్తే సహస్రార కమలంలో ఏ రేకు అందం దానిదే అన్నట్లు ఒక్క నాని కూడా వదిలేటట్టు ఉండదు. నానీలు కదా ఎప్పుడూ ముద్దొస్తునే ఉంటాయి.

చైనాలో/ గోడ ఎంత పొడవో/ ఇండియా చుట్టూ /మడత పెట్టొచ్చు/ (పే.నెం9)అంటూ చైనా గురించి ......

.. చెప్పారు.ఇక్కడ ఘన పదార్థం లో ఉన్న గోడని మెత్తని మడతలో ఒదిగిపోయే స్వభావంలో చెప్పడం ఎంతో కవితా వైవిధ్యం ఉన్న మహా మేధస్సుకు తప్ప ఇతరులకు సాధ్యం కాదు. ఇందులో నవ నవ లాడే చైనా కన్యల్లాంటి నానీలతో పాటుగా రాజకీయపు విసుర్లతో కూడా తళుక్కుమని మెరిసే నానీలు ప్రత్యేకంగా నిలిచి ఉంటాయి.

తలుపు దగ్గర ఎవరూ /అని గట్టిగా అరిచాను/ నేనే అంది/ ఇండియా గాలి

(పే.నెం10)ఇక్కడ కవి హృదయం నాకు అర్థం అయిందో లేదో కానీ ఎప్పుడో ఒకప్పుడు భారతదేశం ధైర్యంగా చైనా తలుపు కొట్టి మరీ నిలదీస్తుంది అని అనిపించింది. ×కవిరేవ ప్రజాపతిః ×అన్నట్టుగా భవిష్యత్తుని గురించి ఆలోచిస్తూ గోపి గారి కవి హృదయం ఎంతగా తల్లడిల్లుతూ ఘోషిస్తూ ఈ ప్రశ్న వేసిందో కరుణ నిండిన ఈ కవితని ఒకసారి చదవండి:

యుద్ధానికి /కాలు దువ్వుతారేం// రేపటి తరాన్ని /తాకట్టు పెట్టొద్దు.

అంతేకాదు ఇరు దేశాల మధ్య స్నేహం కుదిర్చేందుకు రాయబారిగా మారిపోయిన గోపి గారు ఏమంటున్నారో చూడండి ఈ పువ్వులు/ కొత్తగా ఉన్నాయి) మన పువ్వులతో/ బంధుత్వాన్ని అడగాలి

(పే.నెం. 34)

నానృషిః కురుతే కావ్యం అన్నది ఆర్యోక్తి ..నవరసాలూ ప్రసవించే వాడే కవి అన్నది నవీన ఉవాచ. చైనా భారత దేశాల మధ్య ఉన్న సఖ్యత గురించి అంతగా ఆర్ద్రత చెందిన కవి ఇంతలోనే ఎంత హాస్యాన్ని అక్షరాలకు అంటించారో చూడండి. అయిపోయిన కొద్దీ/ టీ పోస్తుంటారు / జాగ్రత్త /టాయిలెట్ దూరంగా ఉంది/ (పే.నెం 20)

చైనీస్ తప్ప/ మరేదీ రాదు /మాట్లాడితే / చెవిటి నవ్వులు నవ్వుతారు/

నేను చూసినంత లో చదివినంతలో నవ్వుని చెవిటి నవ్వులుతో పోల్చిన కవులు అరుదే కాదు దాదాపు అదృశ్యం అనే చెప్పాలి. ఈ పదప్రయోగాన్ని షడ్విధ హాసాలని వివరించిన భరతుడు కూడా ప్రయోగించి ఉండడు.

కవితలలో ముత్యాలన్నీ ఏరుకుంటూ పోతే మాల కూర్చడం కష్టమవుతుంది.

చివరగా మరో చిన్న ముత్యంతో ముగిస్తున్నాను. చైనా గోడ దగ్గర /ఓ రాయిని తెంపుకున్నాను/ అది చరిత్రకు/సావనీర్ (పే.నెం31)

ఇక్కడ కూడా పువ్వు తెంపినట్టు గోడ ముక్క ని తెంపడం ఏంటి అని అనిపిస్తుంది కానీ అదిచరిత్ర కు సావనీర్ అంటూ గోడ ముక్కని తెంపినటువంటి కవి హృదయం దేన్నైనా తన వజ్ర తుల్యకవిత్వంతో తెంపగలదు ..తెచ్చుకో గలదు..



-విజయశ్రీ కుప్పా
సెల్ 6304179385

## వలసదారి

వలస
అటునుంచి ఇటూ
ఇటు నుంచి అటూ
ఎప్పుడో ఒకప్పుడు
ఎవరికో ఒకరికి

వచ్చేదీ పోయేదీ మనిషే
తనతో పాటు తెచ్చేదీ తీసుకెళ్లేది మాత్రం
అనివార్యంగా తన మట్టిగుణం

భూమీ గ్రహాలూ తిరిగినట్టే
మనిషి కాలుకు బలపాలు కట్టుకుంటాడు
చెప్పులరగ్గొట్టుకుంటాడు
వాడి చూపు దూరపుకొండలవైపు

మట్టిమీది ప్రేమ మనిషిని
నీడలా వెంబడిస్తుంది

వెలుగుల పరావర్తనంలో
అది పెద్దగానో చిన్నగానో
అంటుకునే ఉంటుంది

ఓగిరానికి ఎంతదూరం వెళ్లినా
పక్షి ధ్యాస గూటిపైనే
మనిషి ఎంతదవ్వులకేగినా
మనసంతా వలపంతా
పురిటిగడ్డ పరిమళం పైనే

ఒకరిది గంధ సుగంధం
మరొకరిది పూల అత్తరు
ఇంకొకరిది డీసెంటు సెంటు
అందరూ పరిమళప్రియులే
ఎటొచ్చీ ఎవడి సువాసన వాడి కిష్టం
అందుకే వాటిని మోసుకెళ్తాడు
ఎటు వలస వెళ్లినా

పరిమళాల వలసఇపుడు
ప్రపంచం నిండా

విశ్వనగరాలలో
ఇరుగుపొరుగులు ఇప్పుడు
తులసి మొక్కలు ఖర్జూరపు చెట్లు
క్రోటన్లూ గులాబీలూ ఇంకా ఎన్నో..



-తుమ్మూరి రాంమోహన్ రావు
9701522234

తెలంగాణ రాష్ట్ర ఆదర్శ పాఠశాల మరియు కళాశాలలోని తెలుగు పండితుడయిన చేరాల రామన్ స్వంత ఖర్చుతో విద్యార్థుల కవిత్వాన్ని తొలి "పది"కులు (సంకలనం), " మాపల్లె పాతాళ గరిగె" కవితా సంపుటిని వెలువరించి విద్యార్థులకు సాహిత్య విలువలను వివరిస్తున్న ఉపాధ్యాయుడు చేరాల రామన్‌ను అభినందిస్తున్నాము. ఇటీవల మాజీమంత్రి కేటీఆర్ చేతుల మీదుగా తొలి పుస్తకానికే 'బాల సాహిత్య పురస్కారం' అందుకోవడం విశేషం. కరీంనగర్ జిల్లా శంకర పట్నం మండలంలోని కేశవపట్నం టి.యస్. మాడల్ స్కూల్ విద్యార్థులు రాసిన కవితలు ఈవారం నేటినిజం పాఠకుల కోసం..

-సంపాదకులు

# బాల వికాసం

## నింగి చుక్కవా.. నేల తల్లివా!

'చుక్కమ్మా ఓ చుక్కమ్మా
రావమ్మా మా దరికి చేరమ్మా
నీ భిక్షే వనం
వనం లేనిదే మా జీవనం లేదు'
బావి లోపల నీరు అడుగంటి పోయే
నీళ్ళులేక చెరువులు మైదానాళ్ళాయే
వాగులు వంకలు ఎండిపోయే
ఎండిన చెరువుకాడ ఊరంతా చేరే
చుక్క నీటి కోసం చెలియలే తోడే
రావమ్మా మా తనువు తడువమ్మా
అని నేలతల్లి పిలిచే చుక్కనీటి కోసం
భూమిలోన దాగిన బుజ్జి విత్తనం
వేచి చూసే ఆ నీటి చుక్క కోసం
దిక్కుతోచని మూగ జీవులు
ఆర్తిగా చూసే నీటి కోసం
గూటిలోన ఒదిగిన గువ్వపెట్టేమా
గోలగోల చేసెనల చుక్క నీటి కోసం
అదిగో అదిగో ఆకాశన ఓ నీలిమేఘం
ఊరించిపోయే ఊసురుమనిపించే
ఆశగా చూసిన ఆ కన్నుల్లో
నీటిబొట్టు ఊరి కన్నీటి చుక్కే రాలే
అప్పుడే ఊరి ప్రజలు అనిరి
"జలమే మన బలం, జలంతోనే మనం
ఆదా చేస్తే ఫలం
ప్రతి బిందువు అమృత సింధువు
పొదుపే ముద్దు వృథా వద్దు"

**- కె.అనూష**
10వ తరగతి
టి.ఎస్.ఎం.ఎస్. శంకరపట్నం
కంరీంనగర్-505 490

## భవితకు భరోసా

చుక్కలా వస్తాను చక్కని నేస్తమై నిలుస్తాను
ఆపన్నహస్తం అందిస్తే సమస్తం మీకిస్తాను
ఇంకుడు గుంగ కావచ్చు
ఇంటి కుంట కావచ్చు
బావిలోన కావచ్చు
బోరులోన కావచ్చు
చెలిమెలోన కావచ్చు
చెరువులోన కావచ్చు
అడవిలోన కావచ్చు
ఆనకట్టలో కావచ్చు
రూపమేదైనా పొదుపే శ్రీరామరక్ష
మీ ప్రాణానికి నేను ఊపిరినవుతా
సమిష్ఠి ప్రాణకోటికి జీవనాధారమౌతాం
నా నిల్వతోనే భవిత
నా పొదుపే భవితకు మలుపు.



**- కె. పుష్ప**
9వ తరగతి
టీఎస్ మోడల్ స్కూల్
శంకరపట్నం
కరీంనగర్ జిల్లా- 505 490

## నా పల్లె తల్లి

అరుణోదయ సూర్యకాంతులతో
కోయిల కుహు కుహు కూతులతో
అరణ్యరోదనలతో, పక్షుల రావాలతో
హరిత వర్ణపు తరువులతో
అలరించి ఆస్వాదించేలా చేశావు
పచ్చని పైరుల హొయలతో
పరిమళాల సుగంధాల పూల బాటతో
మురిసి మరిచిపోయేలా చేశావు
నీకు నా జోహార్ ఓ నా పల్లె తల్లి.



**- శ్రీసాయి దత్త. ఎన్**
ఆదర్శ పాఠశాల & కళాశాల
కేశవపట్నం, మం॥ శంకరపట్నం
కరీంనగర్-505 490

## భావి భారతం

పిల్లలు.. బావి భారత పౌరులు
నేటి పిల్లల్లో తేవాలి చైతన్యం
అది సాటి మానవుని ధర్మం

మన పిల్లల చదువు
వారి భవిష్యత్తుకు వెలుగు
చిరునవ్వులు చిందించె పిల్లలు
అందరి హృదయాల్లో కురిసె చినుకులు
పిల్లలూ.. వికసించె పువ్వులూ..
ప్రపంచానికి పరిమళానిచ్చె కుసుమంలూ
నేటి పిల్లలమాటా..
రేపటి భవిష్యత్తుకు బాట
పిల్లల్ని ప్రేమిద్దాం
నవభారతాన్ని నిర్మిద్దాం.



**- ఎన్. వేణుగోపాలాచారి**
10వ తరగతి, టీఎస్ మోడల్ స్కూల్
శంకరపట్నం, కరీంనగర్ జిల్లా- 505 490

## బాల్యం

బాల్యం భవితకు బాట
ఆనందాల పున్నమి వెన్నెల కోట
ఎన్నో తడబాట్లు.. మరెన్నో ఒడిదొడుకులు
ఎన్నో జ్ఞాపకాలు.. మరెన్నో అనుభూతులు
గడిచిన కాలం తిరిగిరాదు
మన చేతిలో ఉన్నప్పుడే ఆస్వాదించు
బాల్యానికి లేవు సరిహద్దులు
గగనతలమే ఆనందాల లోగిళ్లు
బాల్యమా నిను మరువం
నాడు, నేడు. ఏనాడు..

**- పావురాల భావన**
10వ తరగతి
టీఎస్ ఆదర్శ పాఠశాల
కరీంనగర్ జిల్లా- 505 490

## జోహారులు

స్వార్థాన్ని విడచి
కష్టాన్ని మరిచి
తలలు తెగుతున్న
ప్రాణంపోతున్న
మా లక్ష్యం స్వాతంత్ర్యం
మా జన్మహక్కు
మా కోసం ఎన్నో బలిదానాలు
మా స్వేచ్ఛ కోసం అమరులైన
త్యాగధనులారా
జోహారులు.. జోహారులు.

**ఎన్.అంకిత**
10వ తరగతి
టీఎస్ ఆదర్శ పాఠశాల
కరీంనగర్ జిల్లా- 505 490

## పల్లె- ప్రగతికి మెట్టు

మా పల్లె, అందమైన సిరిమల్లె
తెలవారుతుంది పల్లె కోడిపుంజుల కూతలతో
ప్రజలు నిద్రలేస్తారు స్వచ్ఛమైన మనసులతో
మా పల్లె తరగని బంగారం
అది మాకు దేవుడిచ్చిన వరం
గడపముందు కూస్తాయి
పక్షులు కిలకిలరాగాలు.
అది విని పిల్లలు చేస్తారు బయటికి పరుగులు
పల్లెలో ఉందో అందమైన చెరువు
అదే మా పల్లె ప్రజలకు బ్రతుకు తెరువు
పల్లె చుట్టు పక్కల ఉంటాయి పచ్చని పొలాలు
అవి మా ప్రజల స్వచ్ఛమైన మనసుకి చిహ్నాలు
మా పల్లెలో ఉంది అందమైన ప్రకృతి
అందులో కనిపిస్తుంది మా ఊరి సంస్కృతి
ఎటు చూసినా వుంటాయి పచ్చని చెట్లు
అవి మా పల్లె ప్రగతికి మెట్లు.

**- కె. దీప్తి**
10వ తరగతి, క్ర.సం.16
టీఎస్ మోడల్ స్కూల్,
శంకరపట్నం
కరీంనగర్ జిల్లా- 505 490



## గురువులు

మతిహీనులైన మాకు సుభాషిత రత్నాలు చెప్పి
చంచలంగా వున్న మాకు ఛందస్సు చెప్పారు
గాలీలా గమ్యం లేకుండా వున్న మాకు గణితశాస్త్రం చెప్పి
అజ్ఞానంగా ఉన్న మాకు విజ్ఞానశాస్త్రం బోధించారు
బాధ్యత లేని మాకు హక్కులు విధులేంటో తెలిపే పౌరశాస్త్రం చెప్పి
ఆదమరచి వున్న మాకు ఆర్థికశాస్త్రం ఆలకింప చేసారు
చరిత్రలేని మాకు చరిత్ర పాఠాలు చెప్పి చరిత్ర గొప్పతనాన్ని వివరించారు.
సూర్య చంద్రుల గ్రహ గతులను గురించి చెప్పి మా జీవన గతినే మార్చేసారు
కొత్త భాషలను నేర్పించి భాషేదైనా మతమేదైనా మనుషులంతా ఒక్కటే
అనే భావనను మాకు నేర్పి మత సామరస్యాన్ని గూర్చి చాటి చెప్పారు
మా అజ్ఞానపు చీకట్లను తొలగించి మాలో విజ్ఞాన జ్యోతిని వెలిగించి
మా అభివృద్ధి కారకులైన మా గురువులకు ఏమిచ్చి తీర్చుకోగలం ఋణం..
వారు చెప్పినట్లు నడుచుకొంటు పది మందికి సాయపడుతూ
ఉత్తమ పౌరునిగా నిలిచినప్పుడే వారి ఋణం తీర్చిన వారిమవుతాము.



**- షిఫా నౌషీన్**
9వ తరగతి, టీఎస్ మోడల్ స్కూల్, శంకరపట్నం. కరీంనగర్ జిల్లా- 505 490

## అందమైన పల్లె

నా పల్లె నలుపు అనే అంధకారం లేని అందమైన పల్లె
నా పల్లె రైతన్నల రత్నాలయం, రైతన్నలగుండె చప్పుడు
రాజీలేని రతనాల పల్లె, సాటిలేని సౌందర్యమైన పల్లె
ఐకమత్యమే ఆనందానికి అరుదైన పల్లె
సర్వకోటి జీవరాశులకు జీవనాధారం నా పల్లె
పచ్చని పైరులకు పేరున్న పసిడి బొమ్మ నా పల్లె
చెరువు అనే గర్భంలో తలదాచుకున్న కోట
బిందువుల కేరింత నా పల్లె
పక్షుల అల్లరులతో పరవశించిపోయే ప్రేమామయి నా పల్లె
అమ్మ అనే లాలనకు
అంకితమైన భావం నా పల్లె.



**- వి. అభిజీత్**
10వ తరగతి, క్రమ.సం.37
టీఎస్ మోడల్ స్కూల్, శంకరపట్నం
కరీంనగర్ జిల్లా- 505 490

## ప్రకృతి శోభ

ప్రకృతి కిలకిలాలు ప్రకృతి అందాలకు
మారు పేరు పల్లెలు
పల్లెల అందాలు వర్ణించడం అసాధ్యం
కిలకిలల రాగాలతో ప్రకృతి అందాలతో
మంచి మనసుల ఆప్యాయలతో
మొదలయిన పల్లె చెరువు
అనుభందంతో ముడి పడుతుంది.
మనుషుల అనుబంధాలతో
అప్యాయాలతో ముడిపడిన
పల్లె మనుషుల పల్లెగా
మారిపోతుంది అందమైన పల్లె
ఆప్యాయతలకు అనురాగానికి నిదర్శనం.



**- సిహెచ్. అమూల్య**
9వ తరగతి
టి.ఎస్.ఎం.ఎస్.
శంకరపట్నం
కంరీంనగర్-505 490

## మా మల్లన్న పల్లె

నా పల్లె.. మా అమ్మ ఒడి
'అ' అమ్మా.. 'ఆ' ఆవు అనకముందే
ఓనమాలు దిద్దకముందే
పక్షులతో పాట నేర్పింది
జంతువులతో ఆట నేర్పింది
తల్లి ఒడిలోంచి..
పల్లె తల్లి ఒడిలోకి పడింది మొదలు
నడకల్లో నడతను.. మాటల్లో మానవత్వాన్ని
మానవుడంటే సమైక్య
సహజీవన సంఘజీవన పాఠం నేర్పింది
నా పల్లె చెట్టు, చేమ, పుట్ట, పురుగు
మానవ సంస్కృతి తెలిపింది
నా పల్లె మట్టి మనుషుల విలువను,
త్యాగాన్ని నేర్పింది
నా పల్లె చెరువు సంతృప్తి అనే
సౌజన్యశీలతను చూపింది
అందుకే నా పల్లె మా అమ్మ ఒడి
అమ్మా అని పిలిస్తే ఆదరిస్తుంది
ఆదెరువు అవుతుంది
కష్టాలు, కన్నీళ్ళు ఎన్ని ఉన్నా
నా పల్లె ప్రతి ఇంటి గుమ్మానికి తోరణంలా
పచ్చని పొలాలతో స్వాగతం చెబుతాయి
అందుకే నా పల్లెకు వందనం
నా తల్లికి వందనం
నా పల్లె తల్లికి వందనం అభివందనం.



**- చేరాల రామన్**
తెలుగు పండితులు
టీఎస్ మోడల్ స్కూల్, శంకరపట్నం
కరీంనగర్ జిల్లా- 505 490
సెల్: 9441223650



కేటీఆర్ నుండి పురస్కారం అందుకుంటున్న చేరాల రామన్



తొలి 'పది'కులు కవితా సంకలనం ఆవిష్కరణ



మాపల్లె పాతాలగరిగే కవితా సంపుటి ఆవిష్కరణ

# అందర్నీ అలరిస్తున్న 'మొగ్గలు'

పుస్తక సమీక్ష




కవితాత్మకంగా కవులు తమ భావ ప్రకటన చేయడానికి ఆధునిక తెలుగు సాహితీ రంగంలో అనేక లఘు కవితా రూపాలు వెలుగులోకి వచ్చాయి! మూడు పాదాలలో పాఠక లోకాన్ని ముగ్ధులను చేసే విధంగా 'మొగ్గలు" ప్రక్రియకు డా॥ భీంపల్లి శ్రీకాంత్ శ్రీకారం చుట్టారు. అనతి కాలంలో ఎంతో మంది కవులు 'మొగ్గలు' ప్రక్రియను ఆదరించి సుసంపన్నం చేస్తున్నారు. ఎప్పటికీ వాడని మల్లెల వోలె 'మొగ్గలు' మూడు పాదాలలో కొలువుదీరి.. ముచ్చట గొలుపుతు న్నాయి. కవుల కలాల నుండి జాలువారే అక్షర సొబగులతో "మొగ్గలు" అందంగా తయారై.. అందరినీ అలరిస్తూ కవిత్వపు సిగ్గులనొలక బోస్తున్నాయి! సమాజంలోని అక్రమాలను నిగ్గు తేల్చేందుకు, భక్తితత్వాన్ని ప్రకటించేందుకు.. పాలకులపై కలాన్ని ఎక్కుపెట్టేందుకు.. ప్రజా ప్రతినిధులను ఎండగట్టేందుకు 'మొగ్గలు' కవులకు అండగా నిలుస్తున్నాయి.

ఈ క్రమంలోనే యువకవి ఉప్పరి తిరుమలేష్ "చిరుమొగ్గలు" పేరుతో ఓ గ్రంథాన్ని వెలువ రించి.. తమ సృజనాత్మక ప్రతిభను చాటుకున్నారు. సంక్షిప్తత, సరళత, క్లుప్తత అనే ఆభరణాలతో ముస్తాబయ్యే "మొగ్గలు" నేడు అందరి దృష్టినా కర్షించే నేపథ్యంలో.. తిరుమలేష్ సామాజిక చైతన్యం కోసం తమ భావాలకు అక్షరాకృతి నిచ్చారు.

ఆయన ఎంపిక చేసుకున్నకవితా వస్తువుల్లో కొత్తదనముంది. అభివ్యక్తిలో సరళత్వం ఉంది. సామాజిక చింతనతో.. జన చైతన్యానికి పాటు పడాలన్న తపన ఆయన మొగ్గల్లో కానవస్తుంది. మొగ్గలులో కొలువుదీరే మూడు పాదాలలో మొదటి రెండు పాదాలను సమన్వయ పరుస్తూ.. సమర్థిస్తూ రాసే మూడో పాదంలోనే కవి యొక్క ప్రతిభను ప్రదర్శించాల్సి ఉంటుంది. ఈ విషయంలో తిరుమలేష్ చేసిన ప్రయత్నం ప్రశంసనీయం.

కవి మొగ్గలులో అమ్మను ఉన్నతంగా చిత్రి ంచారు. పరమాత్మ స్వరూపిణిగా, ఆత్మబంధు వుగా వర్ణించారు. అఖిల లోకానికి మొటటి బడి అమ్మ ఒడేనని తేల్చి చెప్పారు. మానవతా విలువలను బోధిస్తూనే భవిష్యత్తుకు బతుకు పునాది వేసేదీ అమ్మ బడేనని విడమరిచి చెప్పారు.

"అవధులు లేని విశాల ప్రపంచంలో
విజయాలు సాధించాలని కోరుకుంటుంది
అమ్మ ఆశీర్వచనాలే మనకు విధిరాతలు"

అని అమ్మ పట్ల తమ గౌరవాన్ని చాటుకున్నారు.

"ఉగ్గుపాలు పడుతూనే
మనలో వీరత్వానికి పునాది వేస్తుంది
వీరుల పురిటి గడ్డ గర్భగుడి" అంటూ మరో

చోట ప్రకటించారు.

వృద్ధుల పట్ల కవి తమ ఆరాధనా భావాన్ని ప్రకటిస్తూ మొగ్గలు రాశారు.

మానవ జాతికి మూల వారసులవుతూనే
సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకలవుతారు
వయో వృద్ధులు కాదు వారు మానవతా

వృక్షాలని తేల్చి చెప్పారు.

శ్రీశ్రీ కవిత్వాన్ని అక్షరాల ఎర్ర గులాబీ వనంగా అభివర్ణించారు. శ్రీశ్రీ కవనం సామాన్య ప్రజలకు కరవాలమనీ.. శ్రీశ్రీ కదులుతున్న కాలమనీ.. శ్రీశ్రీ సాహిత్యం అభ్యుదయ పథమనీ.. శ్రీశ్రీ కవిత్వం ఆధునిక కవులకు మార్గదర్శకం అంటూ కవి తిరుమలేష్ మొగ్గలకు జీవం పోశారు.

అలాగే కాళోజీని తెలంగాణ తేజో కిరణంగా, కల్మషంలేని కారుణ్య మహర్షిగా పాలకులపై అక్షర ఫిరంగి దళంగా, తెలంగాణ సాంస్కృతిక వైతాళికుడిగా అభివర్ణించిన తీరు బాగుంది.

పాటకు ప్రాణం పోసిన సినారెను ఊహల సాహితీ కిరణాల ఉషస్సుగా, సాహితీ లోకాన మేరు నగ శిఖరంగా మన ముందు నిలపడంలో కవి తిరుమలేష్ సఫలీకృతులైనారు.

విశ్వం విశ్వసించిన ఆత్మసాధనం యోగ అనీ.. యోగభూమి మన మాతృభూమి అంటూ కవి స్వాభిమానాన్ని చాటుకున్నారు. శాంతికాముకుడిగా, భారతదేశం యుగ పురుషుడిగా, శాంతి చైతన్య యాత్రికుడిగా వాజ్‌పేయిని ఉన్నతంగా ఆవిష్క రించారు.

తెలుగు భాష జగతికి వెలుగు భాష అనీ, అమ్మ పాల మధురిమ మన తెలుగు భాష అనీ మృతభాష కాదు అమృత భాష అని మన భాషను వివిధ మొగ్గల్లో అలతి అలతి పదాలతో అందంగా చిత్రించారు.

ఇలా ఎన్నో కవితా పంక్తులు ఈ గ్రంథంలో ఉదహరించడానికి యోగ్యంగా ఉన్నాయి. అభివ్యక్తిలో, పదబంధ ప్రయోగంలో, కవి ఇంకా శ్రద్ధ చూపవలసి ఉన్నప్పటికీ.. తమ భావాలను మొగ్గలులో బంధించ యత్నించినందుకు అభినందనలు తెలుపుదాం. కవిత్వంలో వచనం డామినేట్ చేయకుండా జాగ్రత్త పడాలని కోరుకుందాం. ఇంకా గాఢమైన కవిత్వం రాయడానికి తమ కలానికి పదును పెట్టుకునేందుకు.. అధ్యయనంపై దృష్టి పెడతారని విశ్వసిద్దాం. మొగ్గలులో కొలువుదీరిన భావాలు మున్ముందు వికసించి మరింత కవిత్వపు పరిమళాలను వెదజల్లాలని ఆకాంక్షిద్దాం.

ప్రతులకు: ఉప్పరి తిరుమలేష్
ఇ.నెం. 11-11, శ్రీ కృష్ణానగర్
అమరచింత
వనపర్తి జిల్లా- 509 130
సెల్: 9618961384



**-దాస్యం సేనాధిపతి**
94405 25544

## ఈగాలి.. మనల్ని మోస్తూనే...



ఔను.. మనం.. పయనిస్తూనే ఉంటాం
ఈ పయనం అనంతమే
కాకపోతే రూపం.. స్థలం మారతాయ్
నేల మీద నుండి.. నేలలోకో
నేల నుండి నింగిపైకో
అన్నీ మనమైతే... శబ్ద ధారులం!
ఎంత అద్భుతం.. మనం శబ్దంలోకి
శబ్దం మనలోకి... గాలిలో మాటలం!
గాలిని 'ట్యూన్' చేస్తే చాలు
మనం.. నినదిస్తాం.. మన వాణి ఆకాశంలో!
గాలిరెక్కల మీద.. గగనమంతటా
నిరంతర పరరూప ప్రవేశమే.. కాయంలేదుగా
కాయానికి కృతజ్ఞతలతో.. సెలవ్
ఎన్ని బాధల.. నొప్పుల.. దుఃఖాలను మోసిందో
ఎన్ని ఆనందాలను ఐశ్వర్యాలుగా కూర్చిందో
ఇప్పుడిక విశ్రాంతి, దేహమా
ఎన్ని ఉరికి, ఉబికి వచ్చే
వేదనానంద కన్నీటి కెరటాలతో
మనం మమేకమయ్యామో..
ఇప్పుడిక హాయిగా వెన్నెలతో
ఊసులు యుగళ గీతాలు
ఓ చుక్క మెల్లగా గుసగుసలు
పాట వినిపించవూ..కవితలా
తకధిమి లాడవూ
అంతే.. ఆకాశమంతా ఆనంద జుగల్బందీ
అవనిలో.. ఆకాశవాణి బదులిస్తుంది
'మైహూం..నా' అంటూ
శ్రీకాంతన్నా..
నువ్వెక్కడికెళతావ్..
పాటల్లో.. మాటల్లో
కవితలు.. కల్పనల్లో
రాతల్లో.. రాచవీధుల్లో
గుండెల్లో.. తొంగిచూసే స్మృతుల్లో
గొంతుల్లో..స్వరజతుల్లో
అన్నింటా.. మనమే
కవీ, ఇంద్రగంటి ఇంటి శ్రీకాంతుడా
నింగీ.. నేలలో.. మనమే
ఈ గాలి..
మనల్ని మోస్తూనే..!



**- ఝాన్సీ కె.వి. కుమారి**
90108 23014

# డా॥ వెలువోలు నాగరాజ్యలక్ష్మి కవితలు చైతన్యపు చిరుదివ్వెలు






ఎక్కడికా పయనం.. కవితా సంపుటి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మక మరియు సాంస్కృతిక సమితి ఆర్థిక సహకారంతో 'సారస్వత కళానిధి' డాక్టర్ వెలువోలు నాగరాజ్యలక్ష్మి 53 కవితలను 'ఎక్కడికీ పయనం' కవితా సంకలనంగా వెలువ రించారు. జాతి సంస్కృతికి జీవనాడి మాతృభాషను అలక్ష్యం చేస్తున్న యువతను ఉద్దేశించిన కవితా సంపుటి శీర్షికగా, ప్రచురింపబడిన ఈ పుస్తకంలో వైవిధ్యభరిత చైతన్యపు చిరుదివ్వెలున్నాయి. పొలం ప్రాణంగా బతికి, ఆ పొలంలోనే ఆఖరి శ్వాస విడిచిన 'నాన్నపై కండువా' హృదయాలను కదిలిస్తుంది. మనసు లేని యంత్రంలా కదిలే మనిషికంటే శ్రమను సంకేతపు మౌన యోగిని అంటూ 'లిఫ్ట్' కవయిత్రి ప్రతిభకు తార్కాణం. ప్రస్తుత సమాజనడవడికలో, 'పైశాచిక వికృతానికి బలిఅవుతున్న నిస్సహాయ 'ఆడ'తనంపై 'నన్ను బ్రతక నివ్వరూ' కవిత వేదనాతరంగాల విషాదం వర్షింప చేస్తుంది. జాడ తెలియని 'మెదడకు పట్టిన చీడ' ఆడపిల్లల జీవితాలకు మరణ శాసనం రాసే క్రూర మనస్తత్వం గురించి గుండె గుండెతో మమేకం కావాలని రచయిత్రి ఆకాంక్షిస్తారు. 'పోరాటమే ఊపిరిగా' మేధాపట్కర్ 'కల్పన'గా మిగిలిన కలగా కల్పనా చావ్లా, కార్గిల్ స్మృత్యర్థం 'సైనిక సోదరా!' 'పేపర్ బాయ్' వంటి కవితల సున్నిత భావవ్యక్తీకరణతో అలరిస్తున్నాయి. నివురు గప్పిన నిప్పులో పురుష దురహంకారం పట్ల కవయిత్రి రణభేరి మ్రోగించడం, ధిక్కార స్వరంతో స్త్రీవాదం జ్వలిస్తుంది.

డాక్టర్ వెలువోలు నాగరాజ్యలక్ష్మి, జీవన వేదనను అవలోకించగలిగే హృదయంతో, అక్షరాల ఆత్మను కవితా స్పందనతో వ్యక్తీకరించగలిగిన కల్పనా ప్రతిభావైచిత్రి గల కవయిత్రిగా ఈ సంపుటి సాక్షాత్కరింపచేస్తుంది. ఇందులో ఉబుసుపోక కోసం రాసిన కవితలుకనబడవు. కేవలం పేరు రావటానికి తాపత్రయం లేదు. జీవితానుభవాలను, దైవందిన సామాజిక వార్తాచిత్రాల తీరు తెన్నులపై కవితా పూర్వకమైన వాగ్బాణాలున్నాయి. డా॥ కంపెల్ల రవిచంద్రన్, సౌభాగ్య, డా॥ మండలి బుద్ధప్రసాద్‌గార్లు కవయిత్రి ప్రతిభను, ముందు మాటలలో, అద్దంలో దర్శింపచేసారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత మరియు సాంస్కృతిక సమితి ఈ కవితా సంపుటిని వెలుగులోకి తీసుకురావటం అభినందనీయం. ఈ సత్కృతికి సంబంధించిన ప్రోత్సాహం, ఆదరణ రానున్న రోజులలో కూడా కొనసాగాలని ఆశిద్దాం.

ప్రతులకు: డా॥ వెలువోలు నాగరాజ్యలక్ష్మి
301, 1వ లైన్, రామన్నపేట
గుంటూరు- 522 007.
సెల్: 9394113848.



**-జయసూర్య**
సెల్: 9440664610

# కవిత్వం హరివిల్లైన వేళ...!

పుస్తక సమీక్షలు

డా॥ వైరాగ్యం ప్రభాకర్ సంపాదకత్వంలో 'సింగిడి' కవితా సంకలనం రూపుదిద్దుకుని హరివిల్లై అందరినీ ఆకట్టుకోవడం అభినందనీయం.

శ్రీ ప్రభాకర్ పేరుకు ముందు 'వైరాగ్యం' ఉ ంటేనేం.. 'వైవిధ్య' భరితమైన రచనలు చేసేందుకు సృజనకారులను ప్రోత్సహించే సుగుణం ఆయనకు ఆభరణమైంది. మనిషి నీ పయనమెటు, అక్షర ప్రభలు, చమక్కులు, సర్వేపల్లి రాధాకృష్ణన్, నినాదాలు వంటి గ్రంథాలను సొంతంగా వెలువరించిన ఆయన "రెండు తలల పాము" కథా సంపుటిని కూడా ప్రకటించి సాహితీ లోకానికి చేరువైనారు. స్వచ్ఛ భారత్‌పై జనాన్ని చైతన్య పరిచేందుకు ఒక్క అడుగు ముందుకు గ్రంథాన్ని తమ సంపాదకత్వంలో ప్రచురించారు. నీ స్నేహం, అవినీతిపై అక్షరాయుధం, అమ్మానాన్న, ఓ కవిత వంటి గ్రంథాలకు సంపాదకత్వం వహించి.. రెండు రాష్ట్రాల్లోని తెలుగు కవులు, రచయితలను ప్రోత్సహించడం ప్రశంసనీయం. అనుక్షణం అక్షర సృజన కోసం ఆరాటపడే ఆయన 'మార్చి 21' రోజున వచ్చే ఏడు దినోత్సవాలను దృష్టియందుంచుకుని.. భూగోళ దినోత్సవం, ప్రపంచ కవితా దినోత్సవం, ప్రపంచ అటవీ దినోత్సవం, ప్రపంచ అంగవికలుర దినోత్సవం, ప్రపంచ తోలు బొమ్మలాట దినోత్సవం, ప్రపంచ జాతి వివక్ష వ్యతిరేక దినోత్సవం, ప్రపంచ రంగుల దినోత్సవం వంటి అంశాలపై కవితలు రాయించి.. పరస్పర ఆర్థిక సహకార పద్ధతిపై ఓ కవితా సంకలనాన్ని రూపకల్పన చేసి "సింగిడి" రూపంలో సాహితీ ప్రపంచానికి అందించడం స్వాగతించదగింది. ఈ గ్రంథంలో పై అంశాలపై 52 మంది రాసిన కవితలు కొలువుదీరాయి. ఈ కవుల్లో యిప్పుడే కలం పట్టిన వారున్నారు. పేరు పొందిన కవులున్నారు.

"కవిని నేను" కవితలో దొంతరబోయిన దైవాధీనం సమాజహిత సుకవిని నేను అని నినదించారు. ఇంద్ర ధనుస్సులో సప్తవర్ణాలను వీక్షించే రంగ వల్లుల హరివిల్లును నేనంటూ కవిగా తమ స్వాభిమానాన్ని చాటుకున్నారు.

నంద్యాలకు చెందిన విజయలక్ష్మి "కవి కవిత్వం'' అంశంపై తమ భావాలకు అక్షరాకృతినిచ్చారు. కలం పట్టుకుంటేనే కవిత్వం కాదని, కవి హృదయం రంజిల్లాలని, అనుభూతి మనసును తట్టి లేపాలని ఆకాంక్షించారు.

బొమ్ము విమల రాసిన "కవి హృదయాలాపన" కవితలో.. కవంటే పదాల పచ్చికను మేస్తూ..,, కవితా ప్రియులకు నూజీవీడు రసాలతో కవిత్వ దాహాన్ని తీర్చే కలం హాలికుడు అని తేల్చి చెప్పారు.

పల్లోలి శేఖర్‌బాబు రాసిన "కవి" కవితలో కవి భ్రమరమై, కర్షకుడై, కార్మికుడై, సామాజిక సేవకుడై, అన్వేషికుడై కవిత్వ సృజన చేస్తారని విడమరిచి చెప్పారు.

దుప్పటి మొగిలి రాసిన "ఓ.. కవితా.. నీకు వందనం" కవితలో కవిత్వం యొక్క ఔన్నత్యాన్ని






చాటి చెప్పారు. టి. వసంతాలక్ష్మన్ రాసిన "నా కవితా నేస్తం" కవితలో.. నా గుండె గాయాలను శుభ్రం చేసి.. నను మైమరిపించిన నా జీవన సహచరి కవితా కుసుమమ్ సుమా! అంటూ చక్కని ముగింపునిచ్చారు. ఆడిగోపుల సదయ్య రాసిన "నా భవిత" కవితలో కవిత్వం యొక్క భిన్న రూపాలను ఏకరువు పెట్టారు.

గంగుల రాజేందర్ యాదవ్ రాసిన "కవితమ్మ ఓ.. కవితమ్మా" గేయంలో కవిత్వం చేసే మేలును ఆవిష్కరించారు.

మహేంద్రాడ సింహాచలాచార్య "భూమి చిరునామా" పేరుతో రాసిన కవితలో భువిని రక్షించుకుందామని పిలుపునిచ్చారు. డా॥ రామకృష్ణమూర్తి రాసిన "భూశోకం", ప్రసాద్ తుమ్మరాసిన "నీవు ధరిత్రి నేను దరిద్రున్ని" కవితలో ఆలోచనాత్మకంగా ఉన్నాయి. 'భూమాత రక్షకులం' అంటూ ఉదయశ్రీ ప్రభాకర్ రాస్తే.. "మరణ మృదంగం" పేరుతో వనపర్తి గంగాధర్ తమ భావాలను అక్షర బద్ధం చేశారు. పర్యావరణ పరిరక్షణ ఆవశ్యతను నొక్కి చెబుతూ 'ధరిత్రి దినోత్సవం' కవితకు బి. అంజనీదేవి రూపం కల్పిస్తే.. రేగులగడ్డ వెంకటలక్ష్మి గాయత్రి 'భూగోళం సహిస్తోంది" అంటూ తమ కవితను రాశారు. జిక్కు కృష్ణమూర్తి 'అడవి సంపదకు వందనం" సమర్పిస్తే.. శివేగారి చిన్నికృష్ణ అడవితల్లి గొప్పదనాన్ని అక్షరాల్లో బంధించారు.

ఆర్. మాధవీలత తన 'మానవాళి నేస్తం" కవితను అవనిమాత ప్రియపుత్రిక.. మానవాళి మానస పుత్రిక అంటూ ప్రారంభించారు.

ముదుంబ శేషఫణి "ప్రపంచ అటవీ దినోత్సవం" గురించి రాస్తే.. డా॥ నమిలికొండ సునీత "తరువే జగతికి మూలం" అని తేల్చి చెప్పారు.

క్యాతం హేమంత్ అటవీ హృదయాన్ని ఆవిష్కరిస్తే.. కొప్పుల ప్రసాద్ అడవితల్లి ఆవేదనను తమ కవిత ద్వారా వినిపించారు.

"కాలం చేసిన గాయం నేను" అంటూ పుల్లా రామాంజనేయులు రాస్తే.. పచ్చిమాల శివనాగరాజు దివ్యాంగులను ఉన్నతంగా ఆవిష్కరిస్తూ తమ కవితను కొనసాగించారు.

'ఈ జన్మ' పేరుతో పాలకుర్తి నాగజ్యోతి రాసిన కవిత ఆర్ద్రంగా మలచబడింది. బాపురం నరహరిరావు రాసిన కవితలో వికలాంగులే ఎంతో మిన్న అంటూ తమ భావాలను ప్రకటించిన తీరు బాగుంది.

మానవత్వం మరిచి మనిషనే అర్థాన్ని మార్చేవారే నిజమైన వికలాంగులు అని తుమ్మారాజా నొక్కి చెప్పారు. డా॥భీంపల్లి శ్రీకాంత్ మొగ్గలు ప్రక్రియలో దివ్యాంగులను ఉన్నతంగా చిత్రించారు.

'గెలుపై చిగురిస్తా ఓటమిని చీలుస్తా" అంటూ పెద్దింటి శ్రావ్య రాస్తే.. శ్రీలక్ష్మి చివుకుల తమ కవితలో తోలు బొమ్మలాటను ఆవిష్కరించారు. సునీతబండారు, ముసులూరు నారాయణ, మహ్మద్ ముస్తఖీమ్ తాంద్ర చిరంజీవి, డా॥ విప్లవ్‌దత్ శుక్ల, దొంతరాజు విజయలక్ష్మి తదితరులు తమ కవితల్లో తోలు బొమ్మలాట ప్రాశస్త్యాన్ని, విశేషాలను ప్రస్తావించారు.

డా॥ పూసల రజనీగంగాధర్, నూశెట్టి రవీంద్రనాథ్, నల్లగొండ సురేష్, ఎం.ఆర్.మూర్తి తదితరులు జాతివివక్షపై తమ కలాన్ని సంధించారు.

రమేశ్ గోస్కుల కైతికాల ప్రక్రియలో జాతి వివక్షను ఎత్తి చూపారు

అన్నంరాజు వేణుగోపాల శ్రీనివాసమూర్తి, రవిచంచలలు కూడా జాతి వివక్షపై కవితలు అల్లి మెప్పించారు. డా॥ మైలవరపు లలితకుమారి రాసిన "వసుంతోత్సవం" కవితాత్మకంగా ఉంది. అరుంధతీ వివేక్, సర్ఫరాజ్ అన్వర్, స్తంభంకాడి గంగధర్‌లు సప్త వర్ణాలను తమ తమ కవితల్లో ప్రతిబింబింపజేశారు.

బి. హరిరమణ రాసిన 'వేకువరంగు"కవిత ఆలోచనాత్మకంగా మలచబడింది. భమిడిమర్రి కమలాదేవి రాసిన "హెూలీ" కవితలో హెూలీ పండుగను భార్యాభర్తల అనురాగానికి ఆది అని. ధర్మబద్ధమైన కామానికి ప్రతీక అని ముగించిన తీరు బాగుంది.

చల్లా పార్వతి తమ కవిత ద్వారా జీవితమేరంగుల మయమని తేల్చిచెప్పారు.

లంక వెంకటస్వామి ప్రపంచ దినోత్సవాలను ప్రస్తావిస్తూ తమ కవితను కొనసాగించారు.

చివరగా గ్రంథానికి సంపాదకత్వం వహించిన డా॥ వైరాగ్యం ప్రభాకర్. సమస్య మనదే.. పరిష్కారం మనదే" అంటూ రాసిన కవితలో సమస్యకు మూలం మనమే. పరిష్కార అన్వేషణ మనదేనని.. మనసుంటే అన్నీ సాధ్యమేనని విడమరిచి చెప్పారు.

ఇలా వైవిధ్యభరితంగా ఇందులో భిన్నమైన అంశాలపై కవితలు కొలువుదీరాయి. కళ్యాణం శ్రీనివాస్ వేసిన ముఖచిత్రం ఈ గ్రంథానికి నిండు శోభను కూర్చింది

ఈ గ్రంథం కోసం కవితలు రాసిన కవులు ఇంతటితో ఆపకుండా మరింత గాఢంగా కవిత్వం పండించడానికి తమ కలాలకు పదును పెట్టుకుంటారని ఆశిద్దాం.

ప్రతులకు: డా॥వైరాగ్యం ప్రభాకర్
2-102, సీతారాంపూర్
కరీంనగర్-
9014559059



-దాస్యం సేనాధిపతి
94405 25544

## నెలరాజా....వెన్నెలరాజా.

సిరివెన్నెల కురిపించే
నింగిలోని చందమామతో
అందెను నేడే అందని జాబిల్లి..
అని పాడుకుందామా..?
తనపై పాదంమోపిన నీల్ ఆమ్ స్ట్రాంగ్ ని
మరెన్నో మూగజీవాలను గుర్తుచేసుకుందామా?
చందమామ బాగుందిచూడు...
చౌధవీ కా చాంద్ హో...
వెన్నెలరేయి ఎంతో హాయి..
అంటూ పల్లవులెన్నో గుర్తుచేసుకుందామా?
చంద్రలోకమైనా,దేవేంద్రలోకమైనా
గగనాంతర రోదసికి చేరుకొనే
మానవుడే మహనీయుడని
మరోసారి కీర్తించుకుందామా?
మింటిలోన నీవు ఒంటిగాడివై..
అని దిగులుచెందనీక తోడవుదామా?
పగలేవెన్నెలగా జగాన ఊయలలూగుదామా?
చంద్రయాన్..ఆగినా..సాగినా
ఎన్ని కలవరింతలో ఎన్నిపులకరింతలో
పాలపుంత చేరువలో నిన్నుచేరువేళలో
నెలరాజా..వెన్నెలరాజా...!



-డాక్టర్ చక్రపాణి
యిమ్మిడిశెట్టి
9849331554

## చినుకమ్మా వాన చినుకమ్మ

చినుకమ్మా వాన చినుకమ్మ
కురువమ్మా కుండ పోతయ్యి
నీరమ్మా వాన నీరమ్మా
పారమ్మా నువ్వు యేరయ్యి
చెరువులు కుంటలు నిండాలి....
వాగులు వంకలు పొంగాలీ ॥చిను

ఆకాశమంతటా ఆవరించే విషము
ఋతు పవనాలు రాకడే కరువాయే
నింగిలొ మబ్బుల జాడలే లేవాయే
నేల పైన వాన చినుకు కురువదాయే
రోజు రోజు నీరు కరువయ్యి పోతుంటే...
దినం దినం బ్రతుకు బారమయ్యి పోద ॥చిను

గుట్టల గండెల్లొ గుణ పాలు దించుతె
కొండల కొంకుల గొడ్డండ్లతొ నరుకుతె
మొక్కలు నాటక చెట్లను పెంచక
గుట్టల్ని తవ్వేసి కొండల్ని నరికేస్తే
ఋతువు యేడ పురుడు పోసుకోని
వరునుడు ఎట్ల ఇంక వర్శిస్తాడమ్మా. ॥చిను

నగరాల్లొ కట్టడాలు గుట్టలు అవ్వుతుంటె
పల్లె అందాల చిరునామా చెరుగుతుంటే
మట్టి వాసన మటు మాయం అవ్వుతుంటె
సిమెంట్ కంకర విస్తరిస్తు పోతువుంటే
భూగోళం తాపంతో వేడి ఎక్కుతుంది...
మనిషి ఆ మంటల్లొ మాడిపోనున్నాడు ॥చిను

ప్రకృతి పచ్చగుంటెనే మనిషికి ఆరోగ్యము
వికృత చేష్టలు చేస్తే చేయును మనకు కీడును
చెట్టు పుట్ట గుట్ట కొండ మనిషి మంచి స్నేహితులు
చినుకు చెరువు వాగు వర్షం మనిషి మంచి మిత్రులు
వాటి చెలిమే మనకు ఎంతొ బలము
ఆ బలమే ఈ భూమి మీది జలము ॥చిను



-ఉప్పెన
8106073661

## ఆధిపత్య పైత్యం

ఎప్పుడూ సూర్యున్నే చూసే
పొద్దుతిరుగుడు పువ్వులా
సాయం కోసం ఎదురుచూసేటోడు
పేదోడైతనే ఉంటడు
దాచుకోవాల్సిన సహజ వనరులను ఛిద్రం చేసి
వాడుకోవాల్సిన ద్రవ్యాన్ని
స్విస్ ఖాతాలో దాచుకొనెటోడు
ధనవంతుడైతనే ఉంటడు
దోచుకొని దాచుకొనుడే
మనిషి గెలుపు సూత్రం
ఆధిపత్య పైత్యానికి డబ్బే మూలం

సహజవనరులతోనే బతుకని తెలుసుకొని
నాగరికుడైన మానవుడు.. స్వార్థపరుడై
అవే సహజ వనరులను కొల్లగొడుతూ
బుద్ధిజీవులమని, మేధావులమని విర్రవీగుతున్నడు

గాలి కలుషితం
నీరు అగమ్యగోచరం
ఖనిజ సంపద దోపిడీ
ఆహారం విషతుల్యం
ప్రకృతి సంపద చిన్నాభిన్నం
ఫలితంగా వానాకాలంల కూడా
రోకలిబండలు పలిగే ఎండలేనాయే
చినుకు చుక్క లేక చెరువులు,
కుంటలు నోరెళ్ళబెట్టుడేనాయె

ఆధిపత్యం కోసం
ప్రపంచ యుద్ధాలు జరిగినయి
ఊళ్లకూళ్లు తుడిచిపెట్టుకపోయినయి
అయినా ప్రజాధనంలో సింహభాగాన్ని
దేశ రక్షణ కోసం ఖర్చు చేస్తాం
అణ్వాయుధాలు లెక్కలేసుకుంటూ
శాంతి మంత్రం జపిస్తాం
అంతా మానవులమేనని మరిచి
సరిహద్దు రేఖల కోసం కొట్లాడుకుంటం

శాస్త్ర సాంకేతికత
భూమిని గురుత్వాకర్షణను దాటి
అంతరిక్షానికి దూసుకుపోతున్న వేళ
చల్లని వెన్నెల కురిపించే చందమామ
పిల్లలు అద్దంల చూసి మురిసే 'చంద్ర'యానం
విశ్వమానవ కళ్యాణం కోసం అడుగులేస్తూ
దేశ ప్రతిష్టను ఇనుమడింపజేయాలని ఆశిస్తూ..



-గుండు కరుణాకర్
9866899046

## దివ్యతేజో మహాత్ముడు- శ్రీరామలింగస్వామి-చరణ్ జనమంచి






జనమంచి పబ్లికేషన్స్ ఆధ్యాత్మిక చింతన పెంపొందింపచేసే మంచి ఆశయంతో చరణ్ జనమంచి రాసిన శ్రీరామ లింగస్వామి జీవిత చరిత్రను ప్రచురించటం ఆధ్యాత్మిక జిజ్ఞాసులైన చదువరులకు ఒక సద్గురును మహాజ్ఞాని, యోగి పుంగవుని దివ్య సాన్నిహిత్యం కలిగించే ధన్యత సంప్రాప్తించినట్టయింది. భారత దేశంలోని ఎందరో సద్గురు జ్ఞానుల పవిత్ర చరిత్రలు వెలువరిస్తున్న చరణ్, తెలుగులో ఆధ్యాత్మిక సాహితీ రచయితగా సుపరిచితులు. 1823-1873 నాటి ఐహిక జీవనంలో దైవాంశ సంభూతునిగా కుల, మతాలకు అతీతంగా 'సమరస శుద్ధ సన్మార్గ సత్య సంఘం, 'సన్మార్గ బోధిని' పేరిట విద్యాలయం, అన్నదాన సత్రం, జ్యోతిదర్శన భాగ్యం కలిగించే ధ్యాన మందిరం నిర్మించి ఆధ్యాత్మికతను సామాజిక సేవా కార్యక్రమాలతో ప్రభావితం చేసిన మహా సంస్కరణ యోగిగా, సద్గురు శ్రీ రామలింగస్వామి జగత్రసిద్ధి పొందారు. ప్రముఖ కవి, విమర్శకులు రమణ వెలమకన్ని అక్షర యజ్ఞఫలం తొలి పలుకులలో స్వామీజీ ప్రతిభా వైశిష్ట్యాన్ని అద్భుతంగా ఆవిష్కరింపచేసారు. ఈ పుస్తకంలో స్వామీజీ జననం, బాల్యం, ఐహిక జీవనంతో పాటు ఆయన వ్యక్తిత్వ మహెూన్నతను చాటి చెప్పే రచనలను చేర్చటంతో దివ్యజ్ఞాన సంపన్నవంతమైంది. స్వామీజీ ఆధ్యాత్మిక మహత్యానికి సంబంధించిన వ్యాఖ్యానాలు, బోధనలు, ప్రసంగాలు, కీర్తనలు, ఎన్నో సూచనా పత్రాలు, సన్మార్గ సూత్రాల సందేశ రచనలు, పద్యాలు ఉజ్జ్వల ఆధ్యాత్మిక కాంతి ప్రసరింప చేస్తున్నాయి. తమిళనాట చిదంబర దేవాలయ అద్భుత రహస్య సాధకునిగా కాంచీపురం, మద్రాస్, తిరువొత్తి యూర్, చిదంబరం, వడలూరు మెట్టుకుప్పం, స్వంత గ్రామమైన నురుదూర్, కరుంగు, తిరువణ్ణామలై, సిద్ధి విలక్కం, వారి దివ్యానుభూతులతో, దివ్య లీలలతో భక్తులను తరింపచేసి అనుగ్రహింప చేసిన వివరాలున్నాయి. కర్మకాండలు, మత విభేధాలకు అతీతంగా శ్రీరామలింగస్వామి జీవన యానం రచయిత చరణ్, ఆవాజ్ఞానసి తేజో స్వరూపునిగా ఈ పుస్తకంలో సాక్షాత్కరింప చేసారు. స్వామీజీ మహాభినిష్క్రమణ, దివ్యజ్యోతిలో ఐక్యతా తాదాత్మ్యం సాక్షిగా నేటికీ వరులూర్‌లో అఖండ జ్యోతి రూప సందర్శనాలయం అసంఖ్యాక భక్తులను అలరిస్తోంది.

ప్రతులకు: జనమంచి చరణ్
10-3-88, ఫ్లాట్ 139
ఆర్.ఎల్. నగర్, రాంపల్లి-501 301.
మేడ్చల్. సెల్: 9393930 525



-జయసూర్య
సెల్: 9440664610

## మహాకవీ దాశరథీ!

దాశరథీ! తెలంగాణ
పేశల కవితా శరధీ!
దాశరథీ! తెలంగాణ
వైతాళిక మహారథీ!
దాశరథీ! తెలంగాణ
ప్రజావళి మహాకవి!
దాశరథీ! తెలంగాణ
సాహిత్య ప్రభారవీ!

మ.ఘ.వ. నిజాం ఏలుబడిని
మంటగలిపె నీ పద్యం
తెలంగాణ కోటి జనుల
మేలు కొలుపె నీ గీతం

ముప్వన్నెల జండాకే
ముక్కులిడెను నీ పద్యం
ఉర్వి భారతీయులంత
ఒక్కటనెను నీ పద్యం

అన్యాయాన్నెదిరించిన
అంగారం నీ పద్యం
ప్రణయాన్నీ వెలిగించిన
శృంగారం నీ గీతం

విశ్వకవీ! నీ హృదయం
విశ్వమంత విశాలం
మహాకవీ! నీ కవనం
పరిమళాల మధుమాసం
కనులకు వామన మూర్తివి
కవితా త్రివిక్రముడవు
తిమిరంతో గమరం చేసిన
ధీరోదాత్త కవీశ్వరుడవు

అనాధుల ప్రేమించిన
మహాకవీ దాశరథీ!
శ్రీనాధుల నెదిరించిన
ప్రజాకవీ దాశరథీ!

నాపై కారుణ్యంతో
వాత్సల్యం కురిపించిన
నా కవితా హృదయంలో
నందనాలు మొలిపించిన
మహాకవి దాశరథీ!
నీ చరణాలకు అంజలి
మహాకవీ దాశరథీ!
నీ జయంతి సుమనోంజలి.



- డా॥ తిరునగరి
93924 65475



## సినారె కు నివాళి

మీ హూంకృతి యే
ఓంకృతియై యెన్ని సాహితీసభలను ప్రారంభించిందో..
మీ దక్షత అధ్యక్షత
యెన్ని మాటల పున్నములను పూయించిందో..
మీ ముఖ్యాతిథి సందేశాలు
యెన్ని ముఖ్యమైన సాహితీమలుపులకు
దోహదం చేసాయో..
సమయంవిలువ సాహిత్యవిలువ
స్పష్టంగా తెలిసిన మీ సభానిర్వహణాకళ్ళెంతో
యెన్ని అధిక ప్రసంగగుర్రాలను నియంత్రించారో..
నేటి సాహిత్యసభలు
మీవాక్కుల చమక్కులను కోల్పోయి
నీరసమౌతున్నాయి
మీ ప్రసంగధారల్లో తడవలేక తేజం కోల్పోతున్నాయి..
కొత్తపుస్తకాలు మీ ముందుమాటల స్పర్శలేక
వెనుకబడిపోతున్నాయి
కొత్తకవులకు మీ భుజం తట్టుడు దొరకక
కలంబలం చూపించలేక పోతున్నారు..

డా.సి.నారాయణరెడ్డి ఈ మీ పేరే
మాకు నిలువెత్తుసాహిత్యం..
మీ సాంగత్యం మా అదృష్టం
మీ సాన్నిధ్యం మాకు నిత్యప్రేరణం
మీ అభినందనం మాకు
సాహిత్యసంజీవనం..



-డా॥కాసర్లనరేశ్ రావు
9441406252

## కవితా దీప్తి సినారె

కరీంనగర్ కాంతి కిరణం
తెలంగాణ దివ్యతేజం
నవ్వని పువ్వుల ఇల
పూయించిన కవనం
వదనం కర్పూర సౌరభం
హృదయం నాగార్జునసాగరం
వెన్నెల వాడల్లో నడిచిన
కవితా హిమ శిఖరం
రామప్ప గుడిలోపల
నర్తించిన గేయ ఝుంకృతులు
నల్లని రాళ్ళకు కళ్ళను
మొలిపించిన అక్షరాలు
మట్టి-మనిషి-ఆకాశం
ఆ నవరతం ఆదర్శం
కవితైనా, గజల్ గీతమైన
మానవతే నీ మతం.
కవిత్వం చిరునామాగా
ప్రకటించిన ధీశాలి
పాటోబయోగ్రఫీని
రచించిన కవి వనమాలి
మరణంపైన రణాన్ని
సాగించిన కవివి
అక్షరయానమే యాత్రగా
జీవించిన రవివి
పగలే వెన్నెల కురిపించిన
పాటల మాంత్రికునివి
తేజస్సు తపస్సుగా
చాటిన విశ్వంభరుడివి.
మానేరుకు వెలుగు
తెలుగు జాతి జిలుగు
అతడు నారాయణరెడ్డి
నవరసాల బంగరు కడ్డి.



-వడ్డేపల్లి సంధ్య
సెల్:7036000123

## అమరకవి శేఖరా..నీకు అంజలిడుదు..

సరస హృదయ సత్కవీంద్ర - సినారె
సారస్వతాబ్ధి చంద్ర
పద్యగేయ, వచన కవిత
వివిధ ప్రక్రియాద్భుత
శతాధిక గ్రంథకృతికర్తా కృతిభర్త
సహజ సాహితీ సృజన
సౌమనస్య సౌశీల్య
నిరంతర సాహితీ పిపాస
నిగర్వ నిత్యానంద, నిర్మల గంభీరాకార
సుమధుర భాషణాచాతుర్య
దివ్యోపన్యాస భూషణ
దిగ్దిగంత యశశ్చంద్రికా ప్రభావ
సాహితీ సార్వభౌమ
విశేష కవి జనాదరణీయ-
"విశ్వంభర, కావ్యరేడ
జ్ఞానపీఠ పురస్కార వరకాడ
విజ్ఞాన విరాజిత
వివిధ మహా పదువల నేలిన
వినయతేజ
రమ్యరసరాగ డోలోరాగ మొలికి
సినీగీతాలు మెరసెను
చిత్రసీమ రచయితగ
తెలుగు సాహితీలోకాన
తేజరిల్లిన, తెలంగాణ ముద్దుబిడ్డ
కవి వసంతమా
కమనీయ వన్నెకాడ
అమరకవి శేఖరా
నీకు అంజలిడుతు.



- గోవిందుల శ్యామసుందరాచార్య
సెల్: 9440620116

## కన్నీటి చిత్రం

రెండు కన్నీటి చుక్కలు
గీసి పెట్టగలవా?
అన్నాను మిత్రుడితో
రెండు కలువరేకుల్లో
రెండు నీటిబిందువులు గీసి
నా చేతుల్లో పెట్టాడు
'ఇందులో కన్నీళ్ళేవి' అడిగాను
'తొంగిచేస్తే కదా తెలుస్తుంది'
గుండెలు గుప్పిట్లో పట్టుకొని
అలా తొంగి చూశాను
విశ్వమంతా కన్పించింది
నింగీ-నేలా రెండూ ప్రతిబింబిస్తూ
'రెండు సాగరాలు దేనికీ' అన్నాను
ఒకటి జీవనసాగరం
మరోటి కన్నీటిసాగరం అన్నాడు
మరి ఈ కలవరేకల
అమ్మల కళ్లెప్పుడూ కలువరేకలే కదా!
ఉమ్మ నీళ్లలో పుడతాయి
ఉడతల్లా పెరుగుతాయి
అమ్మగా మనకుజన్మనిచ్చిన పాపానికి
బతుకంతా ఏడుస్తూనే వుంటాయి
అమ్మచిత్రం గీస్తూ దేవుడుకూడ
ఆమె పెదాలపై సూర్యోదయం
చిత్రించడం మరిచిపయాడు మరి!



- గుర్రాల రమణయ్య
9963921943

## స్వగతం

చల్లదనం కప్పుకున్న చీకటి
రాత్రంతా జాగారం చేసింది కదా
ఆత్రంగా ఎదురుచూస్తోంది
ఉదయం ఎప్పుడొస్తుందా అని

రాత్రంటే జ్ఞాపకాల వెలుగుకదా
అనుభూతుల గుహలో నిదురించే మనసును
తట్టిలేపితే
నక్షత్రాల్లా మిణుకు మిణుకుమంటూ
సందిడిస్తూ అనుభవాల పరిమళం

ఏకాంతగాలుల్ని పీల్చటమంటే
తొంగిచూసే హృదయతంత్రుల్ని మీటటమే కదా
ఎక్కడెక్కడి రహస్తంత్రులు ఆపేక్షగా హత్తుకుంటాయి
ప్రేక్షకుడిలా లీనమవటమే మిగిలింది.

స్వప్నాలు పూచిన దారులు
పూలతేరులై పలకరిస్తుంటే పవళించే నాయకుడిలా
పంచరంగుల పంచామృతాన్ని సేవిస్తూ నువు
రేపటి భయంలేని సగటుజీవిలా
స్వగతాన్ని స్వాగతిస్తావు.



-సి.యస్.రాంబాబు
9490401005

## నానీలు

దేహము ఒక ప్రమిద
స్వేదం చమురు
ఇక వెలిగేది
జీవితం!

పసిపిల్లలందరినీ
తల్లే మోసింది
వాళ్ళందరూ కలిసినా
ఆమె బరువే!

అమ్మ ఒడిలో
ఉండాల్సిన బాల్యం
పుస్తకాల బరువుతో
అస్తవ్యస్తం!



- పసుమర్తి లలితా నరసింగరావు
9959819013

# డా. సి నారాయణ రెడ్డి- నవ్యగేయ మహాకవి..



తెలుగు సాహిత్య వినీలాకాశంలో నవ్యకవితా వెలుగులను చిందించిన కవిచంద్రుడు మన సినారె..ఆయన నవ్యగేయ మహాకవి..అచ్చమైన పల్లీయవాతావరణానికి ఆదర్శప్రాయమైన హనుమాజిపేటలో శ్రీ మతి బుచ్చమ్మ, మల్లారెడ్డి దంపతులకు తేది 29 వ జులై 1931 నాడు జన్మించారు డా. నారాయణ రెడ్డిగారు. వారు క్రమ కమం గా మొలకై,చిగురై,మొగ్గై విరబూసిన సౌగంధికా ప్రసూనమై ..కవితా పరీమళాలను, రసమధురిమలను తెలుగు నేల నాలుగు చెరుగులా పంచి , తెలుగు భాషా సౌరభాలను విశ్వ వ్యాప్తంజేసిన విశ్వంబరుడు డా. నారాయణ రెడ్డిగారు.

దాశరథి గారి మాటల్లో ఆయన గారి కవిత్వం ఇలా ఉంటుంది..

**"పాలసంద్రం పొంగి నింగినంటినట్లు,**
**పండు వెన్నల నింగిని దిగి నేల వాలినట్లు"**

నారాయణ రెడ్డి గారు ఒక వర్షించే మేఘం, గలగలా పారే జలపాతం, వికసించిన వసంతం, గళమెత్తే కోయిల,పురివిప్పే మయూరం, భాసించే సూర్యుడు, వెన్నలొలికించే చంద్రుడు. .ఇన్ని అంశాలనుకలబోసి, అందులో కవితాంశాలను కలిపి భావాలను,శబ్దాలను చేర్చి కంప్యూటర్ కు ఇస్తే అది అందులో ప్రాణంపోసి ఒక నారాయణ రెడ్డి ని అందిస్తుంది..

కవిత్వం లోనూ,జీవితంలోనూ మానవతను, చైతన్యాన్ని ,రసహృదయాన్ని పండించుకొన్న సాహితీమూర్తి .కవికుల తిలకుడు ఆధునికాంధ్ర సాహిత్యంలో విభిన్నాంశాలకు సమన్వయం సాధించిన సాహిత్య శిఖరం.శ్రావ్యగళంతో రసహృదయాలను ఉర్రూతలూగించిన శబ్దరసధ్వని మర్మజ్ఞుడు.

డా.నారాయణ రెడ్డి బహుముఖ ప్రజ్ఞాశాలి.

ఆయన అనేకానేక పదవులను సమర్ధవంతంగా నిర్వహించి వాటికి వన్నెలద్దారు. ఆచార్య పదవి మొదలుకొని అధికార భాషాసంఘ అధ్యక్షుడు వరకు పలు పదవులను నిర్వహించారు. రాజ్యసభ సభ్యునిగా రాజసాన్నొలికించారు. అయన ఎన్నో సాహిత్య సభలకు అధ్యక్షత వహించి ,విశిష్ట అతిథి గా పాల్గొని అత్యద్భుతమైన, అమృతోపమానమైన వ్యాఖ్యానాలు,ఉపన్యాసాలు చేసి రసహృదయాలను ఆనందడోలిల్లో ముంచెత్తిన మహామనీషి.సాహిత్య ప్రపంచంలో విభిన్న ప్రక్రియలను చేపట్టి నవ్వని పువ్వునుండి నాగార్జునసాగరం వరకు కర్పూరవసంతరాయలు నుండి విశ్వంభర వరకు ఎన్నో పుస్తకాలు వ్రాసి సాహిత్య అకాడమీ పురస్కారాలనుండి జ్ఞానపీఠ్ అవార్డుల వరకు ఎన్నెన్నో పురస్కారాలను పొందిన తెలుగు వారి ముద్దు బిడ్డ నారాయణ రెడ్డి గారు.నిత్య కృషీ వలుడు.

ఎందరో యువకవుకు ప్రోత్సాహించి స్ఫూర్తిని చ్చి ఎన్నో కవితలు వెలుబడడానికి కారణభుతుడైన శబ్ద నగిషీ సినారె. అసంఖ్యాకమైన పుస్తకాలకు తొలిపలుకులు పీఠికలు వ్రాసి కవులను వెన్ను తట్టి ఉత్సాహాన్నిచ్చి, ఉరికించిన వన్నెకాడు సినారె.

చిత్రసీమలో కొన్నివేల రసరమ్యమైన పాటలను వ్రాసి పండితులను పామరులను సైతం ఔరా సినారె అనే టట్లు మెప్పించి తెలుగు వారి గొంతుల్లో పాటగా నిలిచిపోయిన పదమాంత్రికుడు.ఎక్కడోఒకచోట ఏదో ఒకపాట ప్రతినిత్యం వినబడుతూనే ఉంటుంది.. పరిమళాలను వెదజల్లుతూ నే ఉంటుంది. సమాజంతో సామరస్యం పెంపొందించు కొరకు సాహిత్యం కంటే మరో సాత్విక మైన సాధనం లేదని పెద్దలంటారు.కవిత్వం తో సామరస్యాన్ని సాధించడం ,కవితకు నవత కల్పించడం నారాయణ రెడ్డి గారి ప్రత్యేకత.

ఈకవి ప్రకృతి వైపు చూస్తే ప్రణయ గీతికలుపాడతాడు,భావంవైపు పరుగెడితే ప్రగతి గీతి వినిపిస్తాడు,వస్తువునెన్నుకొంటే వైదగ్ధ్యాన్ని ప్రకటిస్తాడు,వర్ణననెన్నుకొంటే వైవిధ్యాన్ని ప్రదర్శిస్తాడు, శిల్పాన్నారాధిస్తే చిత్రాలను చూపిస్తాడు,చమత్కారాన్ని చిలికిస్తే శబ్దబంధాలనలంకరిస్తాడు,వాస్తవాన్ని చెప్పదలిస్తే వచన రచన కొనసాగిస్తాడు, సంఘర్షణను సమీక్షిస్తే సమరగీతినినదిస్తాడు,పెరుగుదల ఆగిపోతే తిరుగుబాటు చేస్తాడు,వెలుబాటకనబడక పోతే విప్లవ శంఖాన్ని పూరిస్తాడు..నారాయణ రెడ్డి లో ఈకాంతి కిరణాలన్ని హరివిల్లుగా విరిసి ఆధునికతను అందగింప జేస్తాయని డా. జి వి సుబ్రహ్మణ్యం గారంటారు.ఇన్ని అభిజ్ఞతలు ఒక్క వ్యక్తిలో పుంజీభవించడం అసాధారణ మైన విషయం.. అనన్య ప్రతిభకు ఉదాహరణం..వారి సాహిత్యాన్ని ఆమూలాగ్రంగా ఆవిష్కరించడమంటే అనంతమైన ఆకాశాన్ని అద్దంలో చూపించడమే అవుతుంది. వారి జయంతి సందర్భంగా వారి ఆయా రచనలలో ని కొన్ని కొన్ని మెరుపుల్ని మళ్ళీ ఒకసారి దర్శించు కొందాం..

నవ్వని పువ్వులో:

**"జీవ నాడులలోని శీతాంబువులుపోసి,**
**పాలవెన్నెలలోని పచ్చిమీగడతీసి,**
**తమ మేని పొరలనే సుమ పాన్పుగాజేసి,**
**ఎంతొ గారాబుగా, ఎంతెంతొ డాబుగా,**
**కడుపార పోషించె, మనసార ప్రేమించె**
**ఓ చిన్ని మొగ్గా..ఒకన్నె మొగ్గా.."**

అజంతా సుందరిలో:

శిల్పిని గూర్చి.

"శిలలలో విమల చంచలలు నిల్పిన శిల్పి,
రాలలో నందన వనాలను నిల్పిన శిల్పి,
నిగ్రహము లేకున్న నీకళార్చన సున్న,
సంయోగమే లేని సౌందర్యమే మిన్న
సృష్టి యే తనకు సంతుష్టిని ప్రసాదించు,
ప్రతిఫలమునాశిస్తు బ్రతుకదు కళాజీవి."

జలపాతంలో అమృతం పండించే అణుబీజాల నుండి విషపూరిత మృత్యుసస్యాలను మొలిపిస్తున్న శాస్త్ర జ్ఞులారా.. పరమాణు వులను రగిల్చి చరిత్రను పొగచూరనీయకండి.

వల్లకాడు స్మృతి కిరాగానే తృళ్ళిపడతావెందుకు?

సమతాపాఠాలు నేర్చుకోవాలంటే శ్మశానమే సహజ కావ్యం సుమా!"

మనిషీ-చిలకలో:

**"నాఇంటి వివృత గవాక్షం నాభాష,**
**నాకంటి వినిర్మల కటాక్షం నా భాష,**
**భాషే నేను తెచ్చుకొన్న తీయని వరం,**
**భాషే నేను కట్టుకొన్న జీవన గోపురం.**

ఉదయం నాహృదయంలో:

సమన్వయ శీలాన్ని చాటిచెప్పే కవితా సూక్తి.

**" మంచుకొండ ఒడిలో నిద్రించే అగ్ని చేలున్ని,**
**బడబాగ్నిలో పాఠాలు నేర్చే ప్రహ్లాదున్ని,**
**ఇనబింబం నాశిరస్సు, ఇందుబింబం నామనస్సు."**

మార్పు నా తీర్పులో:

**"శిశిరంనుండి వసంతానికి, చీకటినుండి ప్రభాతానికి,**
**నిరాశనుండి ఆశాశిఖరానికి అశ్రుజలధినుండి ఆనంద తీరానికి నడిపించే మార్పు నేనిచ్చే తీర్పు."**

కాలాన్ని వర్ణించే పంక్తులు..

ఎండను మేస్తుంది, వెన్నెలను త్రాగుతుంది, గాలిని కప్పుకుంటుంది, గగనంలో పడుకుంటుంది.."

ఇంటి పేరు చైతన్యంలో:

**పరుగే ఒకబీజం, ప్రగతి దాని భూజం,**
**ప్రసవం ఒక మరణం, ఫలితంరవి కిరణం,**
**దేహాన్ని కలుపుకొనే గుండెతో దేశాన్ని కలుపు కోండి..**
**పంచేంద్రియాల పరిష్వంగంలో ప్రపంచాన్నే పొదుగు కోండి.."**

మథనంలోని జ్వలనంలో ఒక కవిత:

**రక్తం..బిందువులా రాలితే తమస్సు,రగిలితే ఉషస్సు..**
**రక్తి..ఇందువులా ఫలిస్తే చంద్రిక, జ్వలిస్తే చండిక.."**

లోతులను ముట్టే విలోకనం నీకుంటే, కన్నీటి బొట్టులో కడలి ఉన్నది చూడు..

దైవమేదన్న సోదాగుణం నీకుంటే,నాస్తికుని వాక్కులో నక్కియున్నది చూడు..

గమ్యమేదన్న జిజ్ఞాస యే నీకుంటె ప్రతి మైలురాయిపై వ్రాసియున్నది చూడు..

బ్రతుకులను చదివే నిశిత బుద్ధినీకుంటె గుండె గుండెకు కత్తి కోత ఉన్నది చూడు.. "

మృత్యువు నుంచి:

**వెదురెందుకు అరవాలి విరిచేస్తుంటే..**
**విరవందే వేణువౌతుందా అది..**
**గంధపు చెట్టెందుకు ఏడవాలి నరికేస్తుంటే,**
**నరకందే పరిమళమౌతుందా అది,**

**భూమికలో:**

**మబ్బేమిటి మానేమిటి గిరులేమిటి దరులేమిటి..**
**అన్నీ కవితాత్మలోని అంశాలే..మహాంశువులే,**

రామప్ప లో:

**కదలలేవు మెదలలేవు పెదవి విప్పి పలుకలేవు,**
**ఉలిఅలికిడి విన్నంతనె గలగలమని పొంగి పొరలు,**
**పైన కఠినమనిపించును,లోనవెన్న కనిపించును,**
**జీవమున్న మనిషి కన్న శిలలే నయమనిఽంచును.."**

విశ్వంభర:

నిద్రించదు జ్ఞానం..నీరసించదు తేజం,
ఆ తేజం విశ్వచరిత అభినవ భూమిక,
జ్ఞానం నవ్య మానవతకు అఖండ దీపిక,..

అన్నింటికి మూలం మనస్సే అంటారు సినారె..

ఋషిత్వానికీ, పశుత్వానికీ, సంస్కృతికి, దుష్కృతికీ, స్వచ్ఛందతకూ,నిర్బంధ తకూ, సమార్ద్రతకూ,రౌద్రతకూ తొలి బీజం మనస్సు.. తులారూపం మనస్సు..

మనస్సుకు తొడుగు మనిషి,మనిషికి ఉడుపు జగతి,

ఇదే విశ్వంబరా తత్వం..ఇదే అనంత జీవిత సత్యం..

సినిమా పాటలు:

"గులేబకావళి కథ" సినిమా లో " నన్ను దోచుకొందువటే వన్నెల దొరసాని" నుండి అరుంధతి లోని " జేజమ్మా..ఓ జేజమ్మా "పాటవరకు కొన్ని వేలపాటలను వ్రాసి..కోట్లాది శ్రోతల హృదయాలను దోచుకొన్న కవి సినారె..

నేటి యువకవులకు ఆదర్శప్రాయుడు..

( విషయ సేకరణ సింహభాగం డా తిరుమల శ్రీనివాసాచార్య విరచిత "నారాయణ రెడ్డి -సాహితీమూర్తి." పుస్తకం నుండి సేకరించబడింది)

వ్యాసకర్త వివరాలు..



-మంద పీతాంబర్
9848451892.

# తాత్కాలిక అకర్షణల పల్లకీలో..

ఒకనాడు
అరుణకిరణ కరవాలంగా
వెలుగొందిన అక్షరం
నేడు
ఏ మాయలో పడ్డదో మరీ
మౌనమే
ఆభరణమన్న చందంగా
మూతి ముడుచుకుని
తాత్కాలిక
ఆకర్షణల పల్లకీలో ఊరేగుతోంది!
ఒకనాడు..
భాస్వరమై భాసిల్లిన స్వరం
సామాజిక గాయాలను
తమ గేయాల్లో బంధించి
నినదించిన గళం..
నేడు గొంతులో ఏం చేరిందో మరీ
మూగనోము వహించింది!
ఆనాటి
ఆదర్శాలు.. చిలుక పలుకులు
నీటిపై రాసిన రాతలై పోతుంటే
ప్రభువుకు ప్రణమిల్లుతూ
కాలం వెళ్లదీస్తోంది!
ఔను మరీ
వేషం కోసం వేసుకున్న
కొత్త చొక్కా
నలగకుండా చూసుకోవాలి కదా!

- డి. స్వాప్ని
సెల్: 9490258894

# అనువాద సాహిత్యంలో జలజం రచనలు స్ఫూర్తిదాయకం

## - శృంగార బిల్హణీయం పుస్తకావిష్కరణలో ఆచార్య ఎల్లూరి శివారెడ్డి

అనువాద సాహిత్యంలో పాలమూరు జిల్లాకు చెందిన ప్రసిద్ధ కవి, అనువాదకులు జలజం సత్యనారాయణ రచనలు స్ఫూర్తిగా నిలుస్తున్నాయని తెలంగాణ సారస్వత పరిషత్ అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అన్నారు. జలజం సత్యనారాయణ అనువదించిన 'శృంగార బిల్హణీయం' పుస్తకావిష్కరణ సభను ధ్వని సాహిత్య సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో మహబూబ్ నగర్‌లోని లిటిల్‌స్కాలర్స్ పాఠశాలలో జూలై 21 న నిర్వహించారు. ఆచార్య ఎల్లూరి శివారెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ పాలమూరు సాహితీ క్షేత్రాన్ని ఎంతోమంది సుసంపన్నం చేశారని అన్నారు. బిల్హణుడు రచించిన బిల్హణీయం అద్భుతమైన కావ్యమని, అంతటి గొప్ప కావ్యాన్ని సరళ పదాలతో అనువదించడం జలజం సత్యనారాయణ గొప్పదనమని అభినందించారు. సభాధ్యక్షులు ఆచార్య బన్న అయిలయ్య మాట్లాడుతూ నాటి సురవరం ప్రతాపరెడ్డి నుంచి నేటి జలజం దాక తమ రచనల ద్వారా ఎందరో కవులు తెలంగాణకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చారని అన్నారు. పుస్తక సమీక్షకులు కవి బెల్లి యాదయ్య మాట్లాడుతూ శృంగారాన్ని సినీ పరిశ్రమకు చెందిన వ్యక్తులు బూతుకోణంలో చిత్రీకరించారని, ఇది సమంజసం కాదన్నారు. ఆత్మీయఅతిథి నారాయణశర్మ, విశిష్ట అతిథి, తెలంగాణ సారస్వత పరిషత్తు కార్యదర్శి డా.జె.చెన్నయ్య, కవి లక్ష్మణ్‌గౌడ్ తదితరులు ప్రసంగించారు. ఎన్ఆర్ఐ నాతి రవిచందర్, జలజం సుషమ్మరాయ్‌లకు జలజం సత్యనారాయణ శృంగార బిల్హణీయం ను అంకితం చేశారు. ఈ కార్యక్రమాన్ని డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్ నిర్వహించారు. కార్యక్రమంలో బుర్రి వెంకట్రామిరెడ్డి, కోట్ల వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ కీర్తి దాశరథి



దేశపతి శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న ఘనపురం దేవేందర్ తదితరులు.

డాక్టర్ దాశరథి కృష్ణమాచార్య తెలంగాణ తనం మూర్తీభవించిన వ్యక్తి అని, తెలంగాణ అస్తిత్వం కోసం 22 సంవత్సరాల వయసులోనే జైలు జీవితం అనుభవించిన త్యాగ పురుషుడు అని, తెలంగాణ కీర్తి దాశరథి అని ప్రముఖ తెలంగాణ వాగ్గేయకారుడు ముఖ్యమంత్రి కార్యాలయం ప్రత్యేక అధికారి దేశపతి శ్రీనివాస్ అన్నారు ఆయన ఆదివారం నాడు హరిదా రచయితల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన దాశరథి అగ్నిధార దేశపతి ప్రసంగధార అనే కార్యక్రమంలో కీలక ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగారాన్ని శృంగారాన్ని సమపాళ్ళల్లో సమాంతరంగా నడిపించిన కవి దాశరథి అని సోదాహరణంగా వివరించారు. అక్షరాలలో పిడుగులను కురిపించి నిజాం వెన్నులో రజాకార్ల కళ్ళల్లో వణుకు పుట్టించిన చరిత్ర దాశరథి అని ఆయన తేల్చి చెప్పారు. మెదక్ జిల్లా మంజీరా రచయితల సంఘం నిజామాబాద్ జిల్లా హరిదా రచయితల సంఘం నది అనుబంధంతో సాగుతున్న సాహిత్య సంస్థల ని గోదావరి తల్లికి పుట్టిన బిడ్డలే అని ఆయన వివరించారు. దాశరథి కృష్ణమాచారి నిజామాబాద్ జైలు బార్క్ నంబర్ 8లో ప్రముఖ రచయిత వట్టికోట ఆళ్వార్ స్వామి తో కలిసి జైలుశిక్ష అనుభవించిన సందర్భంలో అగ్నిధారను కురిపించిన తీరు దాశరథి అంకితభావాన్ని ఉద్యమశీలతను తెలియజేస్తోందన్నారు. నా తెలంగాణ కోటి రత్నాల వీణ తొలి దశ తెలంగాణ ఉద్యమంలో రైతాంగ సాయుధ పోరాటానికి ఆయుధమైతే మలిదశ తెలంగాణ ఉద్యమంలో రూపం మార్చుకుని మరో ఆయుధంగా ఉద్యమకారులను ముందుకు నడిపించింది అన్నారు. అగ్ని ధారలో దాశరథి తెలంగాణ కోటి రత్నాల వీణ అని పలికిన మాటలు తరువాతి కాలంలో అందెశ్రీ గద్దర్ గూడఅంజయ్య వంటి కవులను కూడా ప్రభావితం చేశాయని వివరించారు. జైలు లోనే ఉండి మంజీరా నదిని, అందమైన ఆకాశపు మేఘాలను అత్యద్భుతంగా వర్ణించాడు ఆయన సోదాహరణంగా తెలిపారు. దాశరథి కృష్ణమాచార్య తెలంగాణ అస్తిత్వాన్ని నిలబెట్టుకోవ డానికి తరతరాల స్ఫూర్తిని నింపి మార్గాన్ని తన రచనల ద్వారా తెలియ చెప్పాడన్నారు. రైతు పక్షాన నిలిచిన కవి డాక్టర్ దాశరథి అని పీడిత ప్రజలకు క్షేమం కలగాలని డాక్టర్ దాశరథి అని సమాజంలో అన్ని వర్గాల ప్రజలు సమానంగా చూడాలి అని నినదించిన కవి డాక్టర్ దాశరథి అని ఆయన వివరించారు. దాశరథి కృష్ణమాచార్య రాసిన పద్యాలను పాటలను ముగ్ధ మనోహరంగా వాడుతూ వివరిస్తూ రెండు గంటలపాటు దేశపతి ప్రసంగం సాగింది. హరిదా రచయితల సంఘం అధ్యక్షుడు ఘనపురం దేవేందర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో గౌరవ అతిథిగా పాల్గొన్న జిల్లా పరిషత్ చైర్మన్ అన్నగారి విఠల్ రావు మాట్లాడుతూ నాటి కాలంలో దాశరథి పోషించిన పాత్రను నేటి తెలంగాణ ఉద్యమంలో కవులు రచయితలు సమర్థవంతంగా పోషించారని దేశపతి లాంటి కవులు ముందువరుసలో ఉండి నడిపించారని ఆనాటి ఉద్యమ జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో దీకొండ బాబురావు సంపాదకత్వం లో వెలువడిన ఇందూరు జిల్లా కవుల భజన పాటలు అనే గ్రంథాన్ని దేశపతి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ గాయని అంజలి, సాయిలవోల, డప్పు రాజు, సిర్పలింగం పాడిన పాటలు ప్రేక్షకులను ఉర్రూతలూగించాయి. ప్రత్యేక అతిథులుగా దశరథ్ కొత్మీర్కర్, నరాల సుధాకర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కాసర్ల నరేష్ రావు, గుత్ప ప్రసాద్ , గంట్యాల ప్రసాద్, సిహెచ్ మధు, చంద్రరావు, డాక్టర్ త్రివేణి, రషీద్, వెంకన్నగారి జ్యోతి, హరిప్రియ, రమణ రేణుక, పద్మజా, ఆంజనేయులు, డాక్టర్ రామచందర్, వసంత లక్ష్మణ్, , సమత కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



సభలో ప్రసంగిస్తున్న దేశపతి శ్రీనివాస్.



సినారె వాగ్భూణ పురస్కారాన్ని ప్రముఖ సాహితీ వేత్త గిరిజామనోహర బాబు గారికి ప్రదానం చేస్తున్న రాష్ట్ర మంత్రి వర్యులు శ్రీ ఈటల రాజేందర్ పురస్కార ప్రదాత దాస్యం సేనాధిపతి డాక్టర్ బి.మధుసూదన్ రెడ్డి కరీనీనగర్ జడ్పీ చైర్ పర్సన్ శ్రీమతి కె.విజయ ఎమ్ వీ నరసింహా రెడ్డి గాజుల రవీందర్ తదితరులు...

# ముసురుంటేనే....

ముసుర్లో ముల్గుతూ,దగ్గుతూ
నాయిన గొంగడి కొప్పరి పెట్టుకొని
బర్రెలతో బాయికాడికెళ్ళి
దోనిపారకంలో ఒడ్లను తెంపి
పంటసేను మునగకుండా గలుమల సరిజేసి
చిల్లుల గుడిసెల తలదాసుకుంటుండే
ఎరువు సంచిని మడిచి తలపై కప్పుకుని
పలక చేతబట్టి అంగిలాగు నానంగ పరుగెత్తి
మోకాలి బురదతో బడికెళ్ళి
సగం ఉరుపుల బడిలో
గురువుల బుద్దులు మైదానం చెరువైతే
కత్తిపడవలతో నిలువెత్తు నాట్యం
మోతకోలు ముసుర్లో
అవ్వ అబ్రేక్ సంచి మడుసుకొని
నడుమంతచుట్టి వరి కలుపుతీసి
పొద్దంతా పనిజేసి రాత్రికి పెంకపెట్టి
మక్కబుగ్గలతో మనిసికిన్ని పాల్లుపెడితే
అందరం వంటింటి గంపలో దాగేటోళ్ళం
ముసురుంటేనే మనసెరిగిన ముచ్చట్లు
ముసుర్లోనే జారుతున్న బురద కౌగలింతలు
కష్టజీవి జీవనయానంలో
మనసు ఉప్పొంగే సాగరనాభి ముసురు

-ఉంద్రాల రాజేశం
9966946084



# అక్షర యోధ-2019 పురస్కారాలు

స్థానిక గ్రంథాలయాల అభివృద్ధి కోసం మంచిర్యాల జిల్లా రచయితల సంఘం దేశవ్యాప్తంగా ఉన్న తెలుగు కవులు,రచయితల నుండి స్వీయ ముద్రిత గ్రంథాలను ఆహ్వానిస్తోంది. కథ,కవిత్వం, పద్య,గేయ,వ్యాస ప్రక్రియల్లో ఉన్న రచనలు పంపాలని, పోటీ నిమిత్తం ఉత్తమంగా అనుకున్న వాటిని 3 కాపీలు పంపాలి అని కోరారు. ఇలా వచ్చిన వాటిలో ముగ్గురిని ఎంపిక చేసి సెప్టెంబర్1నాడు నగదు బహుమతులతో పాటు అక్షర యోధ-2019 పురస్కారంతో సన్మానిస్తామని తెలిపారు. దబ్బెట రాజమల్లు సహకారంతో నిర్వహిస్తున్న ఈ పోటీకి పంపే పుస్తక ప్రతులు ఆగస్ట్ 20 లోపు "బొడ్డు మహేందర్, మంచిర్యాల జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు, ఇంటి నం.2-26, ఆదర్శ నగర్, చెన్నూరు పోస్ట్ ఒ మండలం. మంచిర్యాల జిల్లా-504201" చిరునామా కి పంపాలని, వివరాలు కోసం 9963427242 ఫోన్లో సంప్రదించవచ్చు అని అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొడ్డు మహేందర్, వేకల రామస్వామి ప్రకటించారు.

## నేటి నిజాలు



# జీవితంతో ముడిపడినదే పాట



పుస్తకాలను ఆవిష్కరిస్తున్న అతిథులు.

జీవితంతో ముడివేసుకుందే పాట అని ప్రముఖ సినీ గేయ రచయిత డాక్టర్ సుద్దాల అశోక్ తేజ అన్నారు. జులై 27, శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ సాహితీ, అపూర్వ క్రియేషన్స్ ఆధ్వర్యంలో ప్రముఖ కవులు (తండ్రీకొడుకు) తిరునగరి శ్రీనివాసస్వామి, తిరునగరి శరత్‌చంద్రలు రచించిన 'వెన్నెల వాన', 'అక్షర శిఖరం' పుస్తక ఆవిష్కరణ సభ జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన అశోక్ తేజ మాట్లాడుతూ పాటతో సంబంధం లేకుండా జీవితం లేదన్నారు. ప్రస్తుత భారతానికి ఈ పుస్తకాలు అవసరం అన్నారు. అత్యున్నతమైన విలువలు గల సమాజం వస్తేనే ఆడపిల్లలపై యాసిడ్‌దాడులు ఆగుతాయన్నారు. డా॥ పత్తిపాక మోహన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మోదుగుపూల ఎడిటర్ భూపతి వెంకటేశ్వర్లు, తంగిరాల చక్రవర్తి, ప్రముఖ కవి డా॥ శ్రీరంగస్వామి, డా॥ లక్ష్మణ చక్రవర్తి, తెలంగాణ సాహితీ కోశాధికారి మోహనకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# కర్ణాటక స్పీకర్‌గా.. విశ్వేశ్వర్ హెగ్డే ఏకగ్రీవ ఎన్నిక

బెంగళూరు, జులై31(ఆర్ఎన్ఎ): కర్ణాటక స్పీకర్‌గా విశ్వేశ్వర్ వాగ్దే ఎన్నికయ్యారు. ఈ మేరకు బుధవారం అధికారిక ప్రకటన వెలువడింది. మంగళవారం ఉదయం సీఎం యడ్యూరప్పతో కలిసి వెళ్లి స్పీకర్ పదవికి హెగ్డే నామినేషన్ వేసిన విషయం తెలిసిందే. హెగ్డేకు పోటీగా ఎవరూ నామినేషన్ వేయకపోవడంతో ఆయన స్పీకర్ గా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు బుధవారం అధికారులు ప్రకటించారు. కుమారస్వామి ప్రభుత్వం కుప్పకూలి పోవడంతో గతవారం రాష్ట్ర ముఖ్యమంత్రిగా యడియూరప్ప బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే. సోమవారం విశ్వాస పరీక్షలో యడియూరప్ప నెగ్గిన అనంతరం స్పీకర్ పదవికి కేఆర్ రమేశ్ కుమార్ రాజీనామా చేసిన విషయం తెలిసిందే. దీంతో కొత్త స్పీకర్‌గా బీజేపీ పార్టీలో సీనియర్ ఎమ్మెల్యేగా ఉన్న విశ్వేశ్వర్ హెగ్గే వైపు బీజేపీ అధిష్టానం మొగ్గు చూపింది. విశ్వేశ్వర్ హెగ్డే ఏబీవీపీ నాయకుడిగా పొలిటికల్ కెరీర్‌ను ప్రారంభించారు.

1994లో అంకోల నియోజకవర్గం నుంచి గెలుపొందారు. మూడు సార్లు ఈ నియోజకవర్గానికి ప్రాతినిథ్యం వహించారు. నియోజకవర్గల పునర్ విభజనతో విశ్వేశ్వర్.. సిర్సా నియోజకవర్గానికి మారిపోయారు. ఇక్కడ కూడా ప్రజలు ఆయన్ని ఆదరించారు. 2008, 2013, 2018లో వరుసగా ఈ నియోజకవర్గం నుంచి గెలుపొందుతూ వస్తున్నారు.

# కీచక వధ 'యక్షగానం' ప్రదర్శన



ఎనిమిది రోజులుగా గానసభలో జరుగుతున్న బిందు యక్షగానం ముగిశాయి. మంగళవారం చివరి రోజు తెలంగాణ బీసీ కమిషన్ ఛైర్మన్ బీఎస్ రాములు, ఏభూషి పోశం పటేల్ ట్రస్టు ఛైర్మన్ ఏభూషి యాదగిరి, విజయకుమార్, కళావీఎస్ జనార్ధనమూర్తి అతిథులుగా పాల్గొని కళాకారులను అభినందించారు. గదవెల్లి వెంకన్న బృందం కీచక వధ-చిందు యక్షగానాన్ని ప్రదర్శించింది. తెలంగాణలో ప్రశస్తి పొందిన చిందుయక్షగానాన్ని నేటి తరానికి పరిచయం చేస్తున్న కళాకారులకు బీఎస్. రాములు శుభాకాంక్షలు తెలిపారు.

# కవి చందన్‌రావుకు సినారె స్మారక 10వేల నగదుతో 'సభా సరస్వతి' పురస్కార ప్రదానం



మహాకవి, జ్ఞానపీఠ్ పురస్కార గ్రహిత డా॥సి.నారాయణరెడ్డిగారి 88వ, జయంత్యుత్సవ వేదికపై నిజామాబాద్‌లోని గీతాభవన్‌లో జులై 29న, శ్రీపాద సాహితీ కళాపీఠం, గాయత్రి ధార్మికవేదిక, రజనీ ప్రచురణలు సంయుక్తంగా నిర్వహించిన సాహితీసభలో జిల్లాకు చెందిన ప్రముఖ కవి, వ్యాఖ్యాత సభా సమ్రాట్ వి.పి. చందన్‌రావుగారిని ఘనంగా సన్మానించి "మధుర వాచస్పతి-సభా సరస్వతి" బిరుదుతో సినారె స్మారక సాహితీ పురస్కారంతో పాటు జిల్లా పూర్వ పార్లమెంటు సభ్యులు శ్రీ యం. నారాయణరెడ్డిగారి సౌజన్యంతో 10వేల నగదుతో చందన్‌రావుగారిని సత్కరించారు.

ఈ పురస్కార సభకు ప్రముఖ కళాకారులు శ్రీపాద కుమారశర్మ అధ్యక్షత వహించగా, ప్రముఖ కవి శ్రీ ఏ. సూర్యప్రకాశ్ విశిష్ట అతిథిగానూ, డా॥మూడనాగభూషణం గుప్త గౌరవ అతిథిగా విచ్చేసి చందన్‌రావు సాహితీ సేవలను, సినారె సాహితీ వ్యక్తిత్వాలను వివరిస్తూ ప్రసంగించారు. డా॥ జనగామ చంద్రశేఖరశర్మ, సి. హెచ్.మధు, మేక రామస్వామి ప్రభృతులు పాల్గొన్నారు.

# పెరుగుతున్న గోదావరి వరద

## భద్రాద్రి వద్ద అధికారుల అప్రమత్తం
## ధవళేశ్వరం వద్ద దిగువకు నీటి విడుదల

భద్రాద్రి కొత్తగూడెం/రాజమండ్రి, జులై31(ఆర్ఎన్ఎ): ధవళేశ్వరం వద్ద గోదావరికి వరద ఉధృతి పెరుగుతోంది. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద నీటి మట్టం 8.20 అడుగులకు చేరుకుంది. దీంతో 175 గేట్లు ఎత్తివేశారు. నాలుగు లక్షల 50 వేల క్యూసెక్కుల నీరు సముద్రంలోకి విడుదల చేశారు. ఎగువ నుంచి భారీగా వస్తున్న వరదనీటిని కిందికి వదులుతున్నారు. పశ్చిమగోదావరి జిల్లా కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో గోదావరి ఉధృతి పెరుగుతోంది. భద్రాచలం వద్ద వరద నీరు గంటగంటకు పెరుగుతోంది. కుక్కునూరు, దాచారం మధ్య గల వంతెన పైకి వరద నీరు చేరుకుంది. దాచారం, బెస్తగూడెం, గొమ్ముగూడెం గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వేలేరుపాడు మండలంలోని ఎద్దు వాగు కాజ్ వే పైకి కూడా నీరు చేరుకుంది. దీంతో మండలంలో 15 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. కోయిదా, ఎడవల్లి, కట్కూరు, చిగురుమామిడి ,తాళ్ళ గొమ్ము, గ్రామాలకు రాకపోకలు బంద్ అయ్యాయి.

ఎగువ ప్రాంతాల నుంచి భారీగా తరలివస్తున్న వరద నీరుతో భద్రాచలంలో గోదావరి నీటిమట్టం క్రమంగా పెరుగుతుంది. భద్రాచలం వద్ద నిన్న సాయంత్రం 36 అడుగులు ఉన్న గోదావరి నీటిమట్టం బుధవారం ఉదయానికి 41 అడుగులకు చేరింది. 43 అడుగులకు చేరితే అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేయనున్నారు. దిగువ ప్రాంతంలోని శబరి నది పోటెత్తడంతో భద్రాచలంలో వరద నీరు పెరిగే అవకాశం ఉంది. లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.



కృష్ణానది నుంచి వరద రావడంతో జూరాల గేట్లు ఎత్తేయడంతో కనువిందు చేస్తున్న దృశ్యం

# దేశవ్యాప్తంగా వైద్యుల ఆందోళన

## నిలిచిపోయిన వైద్య సేవలతో రోగుల అవస్థ

హైదరాబాద్,జులై31(ఆర్ఎన్ఎ): కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన జాతీయ వైద్య మండలి బిల్లుకు నిరసనగా దేశవ్యాప్తంగా వైద్యులు ఆందోళన బాట పట్టారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పిలుపు మేరకు నిరసనలో పాల్గొన్నారు. ఈ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ తెలుగు రాష్ట్రాల్లో సైతం వైద్యులు ఆందోళనలు కొనసాగిస్తున్నారు. దీంతో అనేక ఆస్పత్రులుల్ఓ వైద్య సేవలు నిలిచిపోయి రోగులు ఆందోళనకు గురయ్యారు. హైదరాబాద్ నగరంలోని డాక్టర్లు ప్రభుత్వ ఆసుపత్రుల ముందు ఆందోళనకు దిగారు. నాంపల్లిలోని నిలోఫర్ ఆసుపత్రి ముందు విధులు బహిష్కరించి ధర్నా నిర్వహించారు. ఈ బిల్లును వెంటనే ఉపసంహరించుకోవాలని, ప్రభుత్వం స్పందించని పక్షంలో ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అటు ఏపీలోని గుంటూరు సహా పలు జిల్లాల్లో వైద్యులు నిరసన బాట పట్టారు. వైద్యరంగాన్ని నిర్వీర్యం చేసే ఈ బిల్లును తక్షణం ప్రభుత్వం ఉపసంహరించుకోవాలంటూ గుంటూరులోని జీజీహెచ్ ఎదుట ఐఎంఏ, ప్రభుత్వ వైద్యులు, జూనియర్ డాక్టర్లు ధర్నా నిర్వహించారు. కేవలం వైద్యులపైనే కాక.. సామాన్య రోగులు, వైద్య విద్యార్థులపైనా ఈ బిల్లు ప్రభావం చూపుతుందని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



నటసామ్రాట్ అక్కినేని స్మరణలో వంశీ కల్చరల్ & ఎడ్యుకేషనల్ ట్రస్ట్‌వారు డా॥ తెన్నేటి సుధాదేవి సంకలనకర్తగా 'కొత్త కథలు-3' పేరుతో 70 మంది రచయిత, రచయిత్రులతో ప్రచురించారు. ఈ కథల సంకలనం జులై 17న రవీంద్రభారతలో ఆవిష్కరించబడింది. అందులో భాగంగా 'సిమ్‌కార్డ్' చోటు చేసుకుంది. ఆవిష్కరణ సందర్భంలో కేంద్ర సాహిత్య అకాడమీ కార్యదర్శి డా॥కె. శ్రీనివాసరావు, డా॥ఓలేటి పార్వతీశం ద్వారా సత్కారాన్ని అందుకుంటున్న పొత్తూరి జయలక్ష్మి.

# మహారాష్ట్ర రోడ్డు ప్రమాదంలో మృతుల గుర్తింపు

## ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు మృతి
## మృతుల్లో ఇద్దరు చిన్నారులు

ముంబయి, జులై31(ఆర్ఎన్ఎ): మహారాష్ట్ర నేషనల్ హైవేపై ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. పూణెకి నుండి 140 కిలోమీటర్ల దూరంలో ఉన్న కాశీల్ గ్రామ సమీపంలో సతారా వద్ద బెంగళూరు-పుణె ఔటర్‌పై బుధవారం తెల్లవారుజామున 12.45 గంటలకు ఈ ప్రమాదం జరిగింది. ఓ కారు చెట్టును ఢీకొనడంతో ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు మృతి చెందారు. మృతుల్లో ఇద్దరు చిన్నారులు, ఇద్దరుమహిళలు ఉన్నారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించారు. పోలీసులకు సమాచారం అందించారు. హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు స్థానికులు సహాయంతో గాయపడి నవారిని సమీపంలోని ఆస్పత్రికి తరలించి చికిత్స నిందించారు. డ్రైవర్‌తో పాటు మరో చిన్నారికి గాయాలు కాగా.. వారి పరిస్థితి అత్యంత విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. వీరంతా కర్ణాటకలోని ధార్వాడ్ ప్రాంతానికి చెందిన నిజాముద్దీన్ సౌదాగర్ కుటుంబానికి చెందినవారుగా పోలీసులు గుర్తించారు. కారు నంబర్ కేఏ25ఎంసీ4359 మహీంద్రా ఎస్‌యుబి. ఔటర్‌పై అతివేగంగా వస్తుండటంతో కారు అదుపు తప్పిన క్రమంలో చెట్టుకు ఢీకొంది. ఈ ప్రమాదంలో సౌదగర్, అతని భార్య, కుమారుడు, కోడలు, ఇద్దరు మనవళ్ళు ఉన్నారు. మూడేళ్ళ లోపు ఉన్న సౌదగర్ మనుమడు, ఐదు సంవత్సరాల మరో మనుమరాలు మృతి చెందిన వారిలో ఉన్నారు. వీరంతా ఘటనాస్థలంలోనే మృతి చెందగా.. కారు డ్రైవర్ మరో చిన్నారి గాయపడిన వీరు సతారాలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడనీ ఇతను పరిస్థితి విషమంగా ఉందని బొర్గాన్ అసిస్టెంట్ పోలీస్ ఇన్స్పెక్టర్ సీఎస్ మాలి తెలిపారు. ప్రమాద ఘటన సమాచారం అందుకున్న సౌదాగర్ కుటుంబానికి చెందిన బంధువులు ప్రమాద స్థలానికి చేరుకున్నారని తెలిపారు. కాగా మృతదేహాలను కారు వెలికి తీయటానికి రెస్క్యూ టీం, పోలీసులకు మూడు గంటలు పట్టిందని చెప్పారు.

# బైకును ఢీకొన్న లారీ

## ముగ్గురు యువకుల దుర్మరణం

మేడ్చల్,జులై31(ఆర్ఎన్ఎ): నగర శివారులోని కొంపల్లిలో దారుణ రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. బైక్‌పై వెళ్తున్న ముగ్గురు యువకులను వెనుకనుంచి వేగంగా వచ్చిన లారీ బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న ముగ్గురు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. సుచిత్ర నుంచి మేడ్చల్ వైపుకు బైక్‌పై వెళ్తున్న విక్రమ్ సింగ్, ఇంద్రచంద్, దినేశ్ ఈ ప్రమాదానికి గురయ్యారు. అధిక లోడ్‌తో వేగంగా వస్తున్న లారీ కొంపల్లి హైవే బ్రిడ్జ్ వద్ద బైక్‌ను బలంగా ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు ఘటనపై విచారించారు. డ్రైవర్ నిర్లక్ష్యపు డ్రైవింగ్ కారణంగానే ప్రమాదం జరిగిందని పోలీసులు నిర్ధారించారు. మంగళవారం అర్ధరాత్రి ఈ ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. బైక్ అదుపుతప్పి లారీని వెనుక నుంచి ఢీకొట్టడంతో ఈ ప్రమాదం సంభవించింది.






# న్యూయార్క్‌లో 'ఆహా!ఓ హెూ' కవితా గోష్ఠి



న్యూయార్స్ తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం 'ఆహా! ఓహెూ! కవితా గోష్ఠి అశోక్ చింతకుంటగారి నిర్వహణలో అద్భుతంగా జరిగింది. ప్రముఖ సినీ రచయిత, దర్శకులు స్థానిక కవి డా॥ వద్దేపల్లి కృష్ణ మరియు సినీ కవి జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు, హాస్యావధాని శంకరనారాయణ పాల్గొని తమ తమ కవితా వైశిష్ట్యాలతో సభాసదుల్ని ఆనందడోలికల్లో ఓలలాడించారు.

డా॥ వద్దేపల్లి కృష్ణ ప్రసంగిస్తూ భానుమతి అక్కినేని నాగేశ్వరరావు గార్లను మెప్పించి ఎలా తాను సినీ గీతాల్ని రాయగలిగాడో, ఆచార్య డా॥సి. నారాయణరెడ్డి, మహాకవి దాశరథిగార్ల ప్రోత్సాహంతో ఎలా సాహితీ రంగంలో రాణించాడో వివరించాడు. సిరిసిల్లలో పుట్టి పెరిగినా, అమెరికా చికాగో-న్యూయార్క్ నగరాల దాక ఎలా ఎదగ గలిగాడో విశదీకరించాడు. సాహిత్యంలో తన ప్రయోగముక్తకాలైన 'మనసా! తెలుసా? ప్రయోగ పద్యాలైన 'పాట వెలదుల్ని" వినిపించి రంజించేశాడు. తిపిర్నేని తిరుమలరావు, సంస్థ అధ్యక్షులు అశోక్ ప్రభృతులచే శాలువా-జ్ఞాపికలతో సన్మానం పొందాడు. ఈ సన్మానం తనకు జన్మనిచ్చిన సిరిసిల్లకే జరిగినట్లుగా భావిస్తున్నానని కృతజ్ఞతలు తెలిపాడు.

ఆ తర్వాత జొన్నవిత్తుల పేరడీ గీతాలతో కోనసీమ శత పద్యాలతో మరియు శంకరనారాయణ తన హాస్య చతురోక్తులతో అందర్నీ అలరించారు.

# సిట్టింగ్ జడ్జిపై సీబీఐ విచారణ..!

**- అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శుక్లాపై అవినీతి ఆరోపణలు**
**- న్యాయమూర్తి అరెస్టుకు సుప్రీంకు సీబీఐ లేఖ**
**- గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన న్యాయస్థానం**

అలహాబాద్, జులై31(ఆర్ఎన్ఎ): సుప్రీంకోర్టు సంచలన నిర్ణయం తీసుకుంది. అలహాబాద్ సిట్టింగ్ జడ్జి శుక్లా అవినీతిపై సీబీఐ విచారణకు సుప్రీం కోర్టు అనుమతిచ్చింది. ప్రైవేటు మెడికల్ కళాశాలల్లో అడ్మిషన్లకు సంబంధించి సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను లెక్కచేయకుండా 2017-2018 విద్యా సంవత్సరంలో జస్టిస్ శుక్లా ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈక్రమంలో ఆయనపై విచారణకు అనుమతివ్వాలని సీబీఐ ప్రత్యేక దర్యాప్తు అధికారి కోరగా.. సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ రంజన్ గొగోయ్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఓ సిట్టింగ్ జడ్జిపై సీబీఐ విచారణ చేపట్టడం దేశ చరిత్రలోనే ఇదే తొలిసారి. ఎంబీబీఎస్ ప్రవేశాల్లో ప్రయివేట్ మెడికల్ కాలేజీలకు అనుకూలంగా వ్యవహరించారని అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్ఎన్ శుక్లా ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. వాస్తవానికి సుప్రీంకోర్టు, హైకోర్టుల్లోని సిట్టింగ్ న్యాయమూర్తులకు వ్యతిరేకంగా ఎఫ్ఐఆర్ నమోదుచేయాలంటే సరైన ఆధారాలను సుప్రీంకోర్టుకు చూపి సీజేఐ నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. దాదాపు 30 ఏళ్ల కిందట 1991 జులై 25న కే వీరాస్వామి కేసు సందర్భంగా సర్వోన్నత న్యాయస్థానం ఈ నిబంధన తీసుకొచ్చింది. 1991కి ముందు సిట్టింగ్ హైకోర్టు జడ్జిలపై దర్యాప్తు సంస్థలు కేసులు నమోదుచేసిన దాఖలాలు లేవు. అయితే, వీరాస్వామి కేసు తర్వాత తొలిసారి సిట్టింగ్ జడ్జ్‌పై ఎఫ్ఐఆర్ నమోదుకు సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ అనుమతినిచ్చారు. దీంతో త్వరలోనే జస్టిస్ శుక్లాపై సీబీఐ ఎఫ్ఐఆర్ నమోదుచేసి అదుపులోకి తీసుకునే అవకాశం ఉంది. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అలహాబాద్ హైకోర్టు లక్నో ధర్మాసనం న్యాయమూర్తి జస్టిస్ నారాయణ్ శుక్లాపై ఎఫ్ఐఆర్ దాఖలకు అనుమతి మంజూరు చేయాలని కోరుతూ భారత ప్రధాన న్యాయమూర్తికి సీబీఐ డైరెక్టర్ లేఖ రాశారు.

గతంలో సీజేఐగా ఉన్న జస్టిస్ దీపక్ మిశ్రా దృష్టికి ఈ అంశం రాగా, ఆయన సలహాతోనే లేఖ రాసినట్టు సీబీఐ పేర్కొంది. కేసుకు సంబంధించిన పూర్వాపరాలను తన లేఖలో వివరించిన సీబీఐ డైరెక్టర్, ఒకవేళ అవసరమైతే సిట్టింగ్ హైకోర్టు జడ్జ్‌పై ఎఫ్ఐఆర్ నమోదుకు అనుమతించాలని కోరారు.

దీనిని పరిశీలించిన జస్టిస్ రంజన్ గొగొయ్.. అనుమతినిస్తూ సీబీఐ లేఖకు సమాధానం ఇచ్చారు. ఇదిలా ఉండగా, గత నెలలోనే ప్రధాని నరేంద్ర మోదీకి శుక్లా అంశంపై జస్టిస్ గొగొయ్ లేఖ రాశారు. ఆయనపై పార్లమెంటులో అభిశంసన ప్రవేశపెట్టి తొలగించాలని కోరారు. ఇదిలాఉంటే జస్టిస్ శుక్లాపై వచ్చిన ఆరోపణల్లో నిజానిజాలను నిగ్గుతేల్చేందుకు 19 నెలల కిందట నాటి సీజేఐ జస్టిస్ దీపక్ మిశ్రా నియమించిన విచారణ కమిటీ సైతం నిజమని తేల్చిందని మోదీకి రాసిన లేఖలో ఆయన వివరించారు. ఆరోపణలు నేపథ్యంలో 2018 జనవరి 22న న్యాయ విధుల నుంచి జస్టిస్ శుక్లా తప్పుకోగా, తిరిగి తనకు బాధ్యతలు అప్పగించాలని ఆయన కోరితే జస్టిస్ గొగొయ్ తిరస్కరించారు. జస్టిస్ శుక్లా అవినీతికి పాల్పడి ప్రయివేట్ మెడికల్ కాలేజీలకు అనుకూలంగా వ్యవహరించారని ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వ అడ్వొకేట్ జనరల్ రాఘవేంద్ర సింగ్ ఆరోపించడంతో జస్టిస్ దీపక్ మిశ్రా ఓ కమిటీని ఏర్పాటుచేశారు. ఇందులో మద్రాస్, సిక్కిమ్, మధ్యప్రదేశ్ హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులు జస్టిస్ ఇందిరా బెనర్జీ, జస్టిస్ ఎస్కే అగ్నిహోత్రి, జస్టిస్ పీకే జైస్వాల్‌లను కమిటీలో సభ్యులుగా నియమించారు. ఎంబీబీఎస్ ప్రవేశాల సమయంలో ప్రయివేట్ మెడికల్ కాలేజీలు నిబంధనలు ఉల్లంఘించినా, వాటికి అనుకూలంగానే జస్టిస్ శుక్లా వ్యవహరించినట్టు కమిటీ తేల్చింది.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.